# నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:15 సంచిక:3 169 మార్చ్ 2025 హైదరాబాద్

***UGC - Peer - Reviewed***
***Telugu Research Journal***

- తెలంగాణ విద్యారంగం; చట్టసభల చర్చలు
- పతనావస్థలో విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి
- ఆశా కార్యకర్తలు; ఎదుర్కొంటున్న సమస్యలు
- "కృత్రిమమేధ (AI), మానవకృషిల సమన్వయంతోనే భాష బలపడుతుంది"
- గోరటి వెంకన్న పాటలు-అనువాద సమస్యలు-పరిశీలన
- కాలువ మల్లయ్య నవలలు – వస్తు విశ్లేషణ

deepseek Gemini

Grok



CHAT GPT

PEER REVIEWED JOURNAL
ISSN 2349-2376

# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

మార్చి 2025
సంచిక : 3
సంపుటి : 15

గౌరవ సంపాదకులు
**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహా మండలి
**అల్లం నారాయణ**
చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి
**ప్రొఫెసర్ గణేష్**
ప్రిన్సిపాల్(పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు
**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

సంపాదకురాలు
**స్నేహలత ఎం.**

సంపాదకవర్గం

**ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,** ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల
**క్రాంతి,** జర్నలిస్టు
**డా॥చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)
**డా॥శివరాత్రి సుధాకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)
**డా॥ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డిటిపి, లే ఔట్ :** స్నేహ
**కవర్ డిజైన్ :** క్రాంతి

రచనలు పంపాల్సిన చిరునామా
**స్నేహలత ఎం.,**
ఇంటి నెం. 2-95, ఫ్లాట్ నెం. 301,
వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం. 2,
కాకతీయ నగర్, హబ్సిగూడ
హైదరాబాద్-500 007.
మెయిల్: nadusthunnatelangana@gmail.com
**ఫోన్ నెం.: 9290745490**

## సంపాదకుని ఉత్తరం

*మిట్ట మధ్యాహ్నం*
*ఆకాశాన్ని కప్పుకొని*
*విశ్రాంతి తీసుకుంటున్న*
*మోదుగుపువ్వు*
*ఉన్నట్టుండి నేలరాలింది*
*ఇది ఆకురాలుకాలం కదా! అనుకున్న*
*కళ్లు తెరిచిచూస్తే*
*మోదు చివరన*
*లేతచిగురు మొగ్గతొడిగింది*

31 మార్చి, 2025

*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

పతనావస్థలో విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి — **డా. ఇమ్మిడి మహేందర్** — 5

**ప్రొఫెసర్**

తెలంగాణ విద్యారంగం: చట్టసభల చర్చలు — **ప్రొఫెసర్ చింతకింది కాశీం** — 6

**సామాజికం**

ఆశా కార్యకర్తలు; ఎదుర్కొంటున్న ఇబ్బందులు — **సురేష్ గడపాటి** — 9

**తొవ్వముచ్చట**

"కృత్రిమమేధ(AI), మానవకృషిల సమన్వయంతోనే భాష బలపడుతుంది"–రహ్మానుద్దీన్ — **మ్యాడం అభిలాష్** — 13

**పరిశోధన**

గోరటి వెంకన్న పాటలు–అనువాద సమస్యలు–పరిశీలన — **ఎస్.పరుశురాములు** — 25

స్త్రీల చైతన్యానికి దివిటీ పట్టిన తాళ్లపాక తిమ్మక్క'సుభద్రా కళ్యాణము' — **డా. బడిగె ఉమేశ్** — 31

**పల్లెసుద్దులు**

బలగాన్ని కలిపిన బస్సు — **రవి కుర్మకొరె** — 34

**పరిశోధన పరిచయం**

కాలువ మల్లయ్య నవలలు–వస్తు విశ్లేషణ — **డా. గడ్డం లింగరాజు** — 36

**అర్బన్ లైఫ్**

యాష్‌గార్డ్; పప్పన్నం — **స్నేహలత ఎం.** — 38


**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.**

**వెబ్ పేజీ:** https://nadustunnatelangana.com

సంపాదకీయం

# పతనావస్థలో విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి

డా. ఇమ్మిడి మహేందర్

ఏ విద్యాసంస్థకైనా స్వయంప్రత్తి ప్రాణం లాంటిది. అది ఉన్నప్పుడే ఏ సంస్థనైనా సమగ్రంగా పనిచేస్తుంది. ఫలితాలను సాధిస్తుంది. బోధన, పరిశోధన రంగాల్లో మెరుగైన పనితీరును కనబరుస్తుంది. సమాజ ప్రగతి ఆయా విశ్వవిద్యాలయాల పనితీరుపైనే ఆధారపడి ఉంటుందనే విషయం ప్రపంచవ్యాప్తంగా నిరూపణ అయింది. కానీ, గత కొంతకాలంగా మన విశ్వవిద్యాలయాల పనితీరులో నిర్వహణలో అనేక పరిమితులు ఏర్పడుతున్నాయి.

విశ్వవిద్యాలయాలు అంటేనే నిరంతర జ్ఞాన ప్రసరణ. సామాజికార్థిక, రాజకీయ చలనాలకు కేంద్రం. ఇక్కడే ఆలోచనలు వికసిస్తాయి. చైతన్యాన్ని అందుకుంటాయి. ప్రశ్నలై ఉదయిస్తాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మొదలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ఈ విశ్వవిద్యాలయాలే క్రియాశీలకంగా పనిచేసాయి. ఆలోచనలను ప్రోదిచేసాయి. సామాజిక సమస్యలకు పరిష్కారాలు చూపాయి. కానీ, కొంతకాలంగా విద్యా ప్రగతికి దూరంగా జరిగిన పాలకులు విశ్వవిద్యాలయాలను పట్టించుకోవడం లేదు. ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత ఏర్పడ్డ మొదటి ప్రభుత్వం నుండి నేటి ప్రభుత్వం వరకు విశ్వవిద్యాలయాల విషయంలో "దొందు దొందే" అన్న తీరుగానే వ్యవహరిస్తున్నాయి.

విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి ప్రధానంగా రెండు పద్ధతుల ద్వారా ధ్వంసం అవుతుంది. ఒకటి మితిమీరిన రాజకీయ జోక్యం, రెండు నిధులు – నియామకాల లేమి. వీటిని సక్రమంగా అనుసరించకపోతే స్వయం ప్రతిపత్తి ప్రమాదంలో పడుతుంది. నేరుగా చెప్పాలంటే రాజకీయవేత్తల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అటువంటప్పుడు అది స్వయంప్రతిపత్తి అనిపించుకోదు. ఈ విధమైన చర్యలు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో కనిపిస్తున్నాయి. విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ నియామకాల మొదలు చిన్న చిన్న కాంట్రాక్ట్‌ల వరకు రాజకీయ నాయకులు జోక్యం చేసుకుంటున్నారు. దీనికి విశ్వవిద్యాలయాల పాలక వర్గం నిర్మొహమాటంగా తలలూపుతున్నాయి. విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీయటం ద్వారా సమాజంలో దాని ప్రాసంగికతను, విశ్వసనీయతను, నైతికతను, పని విధానాన్ని ప్రభావితం చేయగలిగారు. ఇది ఎంతవరకు వచ్చిందంటే నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రే ఫలానా సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని వైస్ ఛాన్సలర్‌గా మేమే నియమించాం, ఫలానా కాలేజి ప్రిన్సిపాల్‌ని కూడా మేమే నియమించాం అనే పరిస్థితి దాకా పోయింది. దీన్ని కల్లోల సమాజపు భావక్షీణతకు ప్రతీకగా మనం భావించవచ్చు.

అలాగే విశ్వవిద్యాలయాలకు నిధులు – నియామకాలు ఇవ్వడంలో జాప్యం చేయడం ద్వారా వాటిని స్వీయహననానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రయివేట్ విశ్వవిద్యాలయాలలోకి మధ్య, ఎగువ మధ్య తరగతి విద్యార్థులను అకర్షించడానికి ఎన్నో ఏండ్లుగా సమాజ అవసరాలు తీర్చగలిగిన విశ్వవిద్యాలయాలను నిర్లక్ష్యం చేసారు. తమ తోటి రాజకీయ నాయకుల "చదువుల దందా"కు కింది నుంచి పైదాకా వారికి సహాయసహకరాలు అందిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా మనుషులు మాత్రం మారలేదు. వారి భావజాలాలు మారలేదు. ఇప్పుడిప్పుడే విశ్వవిద్యాలయాల మెట్లు ఎక్కుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మొదటితరం విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తున్నారు. సరైన నిధులు లేకపోవడంవల్ల సరైన హాస్టల్ వసతులు లేవు. కాలేజీలు, టీచర్లు లేరు. బల్లలు సరిగ్గా లేవు. పై కప్పులు ఊడి విద్యార్థుల ప్రాణాల మీదకు వస్తున్నాయి. వీటన్నింటికి డబ్బులు కావాలి. బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేస్తున్నారు. ప్రశ్నించే గొంతుకలుగా ఉన్న విద్యార్థులను ధర్నాలు చేయకూడదని సర్క్యులర్లను విడుదల చేస్తున్నారు. ప్రశ్నించడం ఒక హక్కుగా రాజ్యాంగం మనకు కల్పించింది. రాజ్యాంగం, చట్టాల పట్ల సమాజానికి అవగాహన కల్పించాల్సిన విశ్వవిద్యాలయాల్లోనే నిరసన ప్రదర్శనలపై నిషేధం విధించారు. ప్రశ్నించిన విద్యార్థులను తీసుకెళ్లి బంధిస్తున్నారు. కేసులు నమోదు చేస్తున్నారు.

గతంలో పోలీసులు క్యాంపస్సులోకి విశ్వవిద్యాలయాల అనుమతితోనే వచ్చేవారు. నేడు వారు అత్తగారింటికి వచ్చిపోతున్నట్లుగా భావిస్తున్నారు. ఇక క్లాసుల్లోకి వచ్చి అరెస్టు చేసి తీసుకుపోతున్నారు. ఏకంగా ఒక ఏసిపి విశ్వవిద్యాలయ అధికారులతో కూర్చొని విద్యార్థి సమస్యలు వింటున్నారు. మరొక డీసీపీ ప్రెస్‌మీట్ పెట్టి విద్యార్థులను బెదిరిస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అప్రజాస్వామికంగా ఇచ్చిన సర్క్యులర్‌ని వెనక్కి తీసుకోవాలని ధర్నా నిర్వహిస్తున్న సమయంలో లైబ్రరీ వద్ద ఒక డిసిపీ విద్యార్థులను బెదిరిస్తున్నారు. వీరందరి చర్యలు విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తున్నాయి. అకడమిక్ వాతావరణాన్ని, విద్యార్థుల స్వేచ్ఛా ప్రవర్తనను ప్రభావితం చేస్తున్నాయి. ఇటువంటి చర్యలు అసమర్థ పాలకుల డొల్లతనాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

హక్కులు, చట్టాలు, న్యాయం, ధర్మాల గురించి మాట్లాడే కొంత మంది ప్రొఫెసర్లు విశ్వవిద్యాలయాల్లో జరిగే అన్యాయాలను ఖండించినా, చాలామంది ఈ విషయాలు మాట్లాడటానికి జంకుతున్నారు. సుందర భవిష్యత్తును నిర్మించడానికి తమ కలాలను, గళాలను ఉపయోగించాల్సిన తరం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏది ఏమైనా విశ్వవిద్యాలయాల్లో స్వయంప్రతిపత్తి ఉండాలి. అది పుట్టిన బిడ్డకు తల్లిపాల వంటిది. దాన్ని నిర్మూలించి కార్పొరేటు విధానాలకు స్వాగతం చెప్తూ, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను ధ్వంసం చేసే కుట్రలో వీటిని భాగంగా గుర్తించాల్సిన సందర్భం ఇది. T

# తెలంగాణ విద్యారంగం; చట్టసభల చర్చలు

ప్రొఫెసర్ చింతకింది కాశీం

ముప్పై ఏళ్ల కిందట చట్టసభలను అర్థం చేసుకునే ప్రాపంచిక దృష్టి మా తరానికి ఏర్పడింది. విప్లవ విద్యార్థి రాజకీయాల వలన చట్టసభలలో జరిగే చర్చను సూక్ష్మంగా, లోతుగా అర్థం చేసుకొని వ్యాఖ్యానించేవాళ్లం. తరిమెళ్ల నాగిరెడ్డి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చేసిన చారిత్రాత్మకమైన ప్రసంగం 'తాకట్టులో భారతదేశం' పుస్తకరూపంలో చదువుకున్నాం. చట్టసభలు బాతఖాని క్లబ్బులయ్యాయనే రాజకీయ అర్థశాస్త్ర అవగాహన ఏర్పడుతుండిన తొలిరోజులవి. పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీల ప్రమేయం తగ్గటం వలన ప్రజాసమస్యలు శాసనసభలో ప్రస్తావనకు కూడా నోచుకోకుండా పోయాయి. బహుళజాతి సంస్థల అభివృద్ధి నమూనా మీద చర్చలు చేసి చట్టాలు రూపొందించడానికి ప్రభుత్వాల ప్రయత్నం మొదలయింది. కాలం గడిచే కొద్ది రాజకీయ యవనిక మీద విలువల పతనం కూడా మన కళ్లముందరి కాలాన్ని ప్రతిబింబిస్తుంది. ఇప్పటి చట్టసభలకు వైయక్తిక దూషణల మీద తప్ప ప్రజా సమస్యల మీద చర్చను నడపడం పట్ల విముఖతను చూస్తున్నాం. ఇలాంటి సందర్భంలో తెలంగాణ శాసనమండలిలో విద్యారంగం మీద కొన్నిగంటల పాటు కొందరు సభ్యులు చేసిన ప్రసంగం మీద పౌరసమాజం తప్పక చర్చించాలి.

తీన్మార్ మల్లన్న, తక్కెల్లపల్లి రవీందర్‌రావు చేసిన ప్రసంగాలు, ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన విషయాలు కొన్ని ప్రశ్నలను తెలంగాణ సమాజం ముందు ఉంచాయి. ప్రభుత్వ రంగంలో నడుస్తున్న విద్య సంక్షోభంలో ఉందని, వేల కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నా తగిన ఫలితం రావటం లేదని, విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు కనీస స్థాయిలో లేవని, తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపట్ల విశ్వాసం సడలిందని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు వృత్తి నిబద్ధత, సామాజిక బాధ్యతను ప్రదర్శించటం లేదని సభ్యుల, ముఖ్యమంత్రి చర్చల సారాంశంగా మనం అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ విద్యారంగం పతనం ఇవాల్టికి ఇవ్వాళ ప్రారంభం కాలేదు. దేశంలోకి నూతన ఆర్థిక విధానాలు ప్రవేశించాక సంక్షేమరంగం మీద ముఖ్యంగా విద్యారంగం మీద ప్రభుత్వ కేటాయింపులు తగ్గుతూ వచ్చాయి. విద్య ప్రభుత్వ ప్రాధాన్యతలో లేకుండా పోయింది. ఫలితంగా విద్యార్థులు చదువుకోవడానికి కావలసిన మౌలిక వసతులు తరగతిగదుల నిర్మాణం నిలిచిపోయింది. ఉపాధ్యాయుల నియామకాలు నామమాత్రమయ్యాయి. ప్రభుత్వం విద్యా రంగం మీద కేటాయించే బడ్జెట్ కేవలం టీచర్ల జీతభత్యాలకే సరిపోయేది. కనుక ఈ ప్రభావమంతా బోధన మీద పడింది. ఈ పరిస్థితిని గమనించిన కొందరు వ్యాపారవేత్తలు విద్యా రంగంలోకి ప్రవేశించి ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పారు. ఈ క్రమంలో ఆర్థిక వెసులుబాటు ఉన్న కుటుంబాలు తమ పిల్లలను ఫీజులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో చేర్పించారు. సహజంగానే ప్రభుత్వ విద్యాసంస్థలు పేదల, కింది కులాల విద్యార్థులకు పరిమితం అయ్యాయి. విద్యలో ఒక విభజన రేఖ ఏర్పడింది. లాభసాటిగా మారిన విద్యా వ్యాపారంలోకి ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రవేశించడం వలన ప్రైవేట్ విద్యారంగానికి నష్టం జరగని విధాన రూపకల్పన ముందుకు వచ్చింది. రాజకీయ పార్టీలకు ఎన్నికలలో డబ్బును సమకూర్చే స్థాయికి విద్యా వ్యాపారవేత్తలు ఎదిగారు. ఫలితంగా 'పూనుస్పర్థలు విద్యలందు వైరములు వాణిజ్యమందు' అని గురజాడ చెప్పిన మాట తలకిందులై విద్యా వ్యాపారంలోకి వైరం ప్రవేశించింది. క్రమంగా ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరిచి ప్రైవేట్ రంగానికి పాలకులు ఎర్రతివాచి పరిచారు.

గ్లోబలైజేషన్ వ్యక్తి ప్రాధాన్యతను ముందుకు తీసుకొచ్చింది. కెరియరిజానికి పెద్దపీట వేసింది. సామూహిక ఆలోచనలు, విలువలు, సామాజిక ప్రయోజనం, బాధ్యతల స్థానంలో వ్యక్తి ఒక విలువగా ఈ కాలం ప్రదర్శించింది. విలువల రాహిత్యాన్ని ఎల్లెడల వ్యాపింపచేసింది. నిబద్ధతతో పాఠం బోధించవలసిన టీచర్లు కూడా ప్రపంచీకరణ కదుపునకు గురయ్యారు. ఉదాత్త ఆశయాలు, విలువలు సమాజంలో లుప్తమవుతుండిన సందర్భం కూడా తరగతి గదిని ప్రభావితం చేసింది. అవసరానికి మించిన సంపాదన ఒక లక్ష్యంగా సమాజంలోకి వ్యాపించింది. ప్రభావిత సమూహంగా ఉండిన కొందరు ఉపాధ్యాయులు చిట్టీల, రియల్ ఎస్టేట్ వ్యాపారాలలోకి ప్రవేశించారు. ప్రభుత్వం స్థాయిలవారిగా పెట్టవలసిన పర్యవేక్షణను గాలికి వదిలివేసింది. ప్రజా ఉద్యమాలకు, విప్లవోద్యమాలకు, కమ్యూనిస్టులకు, బహుజన పార్టీలకు విద్య ప్రధాన ఎజెండా కాకుండా పోయింది. ఇది కేవలం తమ అనుబంధ అధ్యాపక, విద్యార్థి సంఘాల నినాదంగా మారిపోయింది. ప్రభుత్వ విద్యను కాపాడితేనే ఓట్లు అడగాలనే చైతన్యాన్ని ప్రజలలో కల్పించి పాలకపార్టీల మీద ఒత్తిడి పెంచి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. ఇన్ని కారణాల వలన ప్రభుత్వ విద్య పట్ల మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి విముఖత ప్రదర్శిస్తుంది. కనుక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అనాథలయ్యాయి.

ప్రైవేట్, ప్రభుత్వ విద్య అనే తేడా లేకుండా ఈ పాతికేళ్లలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తగిన స్థాయిలో లేవని రేవంత్‌రెడ్డి ఆవేదన చెందాడు. వేల కోట్లు ఖర్చు చేస్తున్నా ఫలితం తగినంత లేదని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేసాడు. అయితే గాయం ఒక చోట ఉంటే మలాం మరో చోటరాస్తే సరైన ఫలితాన్ని ఆశించలేము. ఒక విద్యార్థి మీద చేస్తున్న ఖర్చు లక్షకు పైగా ఉంటుందని విధాన మండలిలో ముఖ్యమంత్రి చెప్పారు. నిజమే, ఆ లక్ష రూపాయలలో ఉపాధ్యాయుల, పాఠ్యేతర ఉద్యోగుల జీతాలు, పాఠశాల కరెంట్ బిల్లులు కూడా కలిసి ఉంటాయని ఆయన తెలియక మాట్లాడాడా! అభ్యసనం ప్రతీ విద్యార్థికి ప్రాథమిక పాఠశాల కేంద్రంగా జరగాలి. కానీ పాతికేళ్లుగా మన పాలకులు ప్రాథమిక విద్యను గాలికి వదిలివేసారు. ప్రాథమిక పాఠశాలలో అక్షరక్రమాన్ని శ్రద్ధగా నేర్పిస్తేనే పఠనం, లేఖన నైపుణ్యాలు అబ్బుతాయి. ఈ రెండు నైపుణ్యాలు ఉంటేనే శాస్త్రాల అధ్యయనం సులభమవుతుంది. కనుక మనం మలాం పూయవలసింది ప్రాథమిక స్థాయిలో. అమెరికా లాంటి దేశాలలో ప్రైమరి స్కూల్ టీచర్లకు అత్యధిక జీతం ఇచ్చి గౌరవిస్తారు. వాళ్లు కూడా అంతే నిబద్ధతతో నాణ్యమైన విద్యను గరిపి బాల్యాన్ని తీర్చిదిద్దుతారు.

మన దేశంలో టీచర్లను తయారుచేసే ఉపాధ్యాయ శిక్షణ విద్య అధమస్థాయిలో ఉంది. సర్టిఫికెట్లు ఇచ్చి సమాజం మీదికి పంపటం తప్ప ఆ కళాశాలలో సృజనాత్మకత శూన్యం. పరిమితి లేని స్థాయిలో ప్రైవేట్, డి.ఎడ్., బి.ఎడ్ కళాశాలలు ప్రవేశించాక ప్రమాణాలు దిగజారిపోయాయి. రికార్డులు రాయకపోయినా, టీచింగ్ ప్రాక్టీస్ చేయకపోయినా అభ్యర్థుల వద్ద డబ్బులు తీసుకొని మార్కులు వేసే కళాశాలలే అధికంగా ఉన్నచోట నాణ్యమైన, ప్రతిభావంతమైన ఉపాధ్యాయులను ఎలా ఆశించగలము. కనుక సరైన శిక్షణ పొందని ఉపాధ్యాయులు మూర్తిమత్వాన్ని ఎలా సాధించగలరు. 'మన విశ్వవిద్యాలయాలు గుమస్తాలను తయారు చేస్తున్నాయని' అంబేద్కర్ ఏనాడో చెప్పాడు. ఎనభై ఏళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే మనం గుమస్తాలకు సరిపడే జ్ఞానాన్ని కూడా ఇవ్వలేకపోతున్నాం.

విశ్వవిద్యాలయాలలో చదువుకున్న విద్యార్థులే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు అవుతారు. కానీ విశ్వజ్ఞానాన్ని అందించవలసిన విశ్వవిద్యాలయాలు తెల్లపేపరును నల్లగ చేస్తే మార్కులు వేసి, పట్టాలు ఇచ్చి పంపుతున్నాయి. అక్షరాలను సరిగ్గా రాయలేని, చదువలేని వాళ్లకు కూడా పిహెచ్.డి లాంటి అత్యున్నత డిగ్రీని ఇచ్చి సత్కరిస్తున్నారు. ఫలితంగా బోధనారంగంలోకి నైపుణ్యాలు లేనివారు ప్రవేశిస్తున్నారు. భిన్నరంగాలకు కావలసిన మేధావులను తయారుచేసే విద్యారంగంలో ఉద్యోగంకోసం అధ్యాపకులుగా మారుతున్నవారే అధికశాతం. బోధన పట్ల అభిరుచితో ప్రవేశిస్తున్న వారి సంఖ్య చాలా పరిమితంగా ఉంది. మన సమాజంలో మెరికల్లాంటి యువత

ఆకర్షణీయమైన కార్పొరేట్ జీతాల వైపు వెళ్తున్నారు. దేశీయంగానైతే సివిల్ సర్వెంట్లుగా, గ్రూప్స్ అధికారులుగా స్థిరపడడానికి ఆసక్తి చూపుతున్నారు. బోధనా వృత్తివైపు, పరిశోధన వైపు వచ్చేవారికి ఆయా రంగాలలో తగిన నైపుణ్యం ఉండటం లేదు.

ఇన్ని సవాళ్లను ఎదుర్కొంటున్న విద్యారంగాన్ని చిత్త శుద్ధితో ప్రక్షాళన చేయాలని రేవంత్‌రెడ్డికి ఉంటే తక్షణ కార్యాచరణ ఇలా ఉండాలి. ఉపాధ్యాయుల, అధ్యాపకుల శిక్షణ కళాశాలలను పున:సమీక్షించి వాటి అనుమతులను పునరుద్ధరించాలి. డి.ఎడ్, బి.ఎడ్ కోర్సులకు అభ్యర్థుల ఎంపిక కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షలో సమూల మార్పులు తీసుకరావాలి. పఠన, లేఖన నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రవేశపరీక్ష ఉండాలి. ఐచ్ఛిక ప్రశ్నల స్థానంలో వ్యాసరూప సమాధాన ప్రశ్నల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాలి. ఉపాధ్యాయ శిక్షణ తర్వాత నిర్వహించే పరీక్ష పత్రాల మూల్యాంకనం శాస్త్రీయంగా, హేతుబద్ధంగా ఉండాలి. పీజీ, పిహెచ్.డి స్థాయి విద్యను అభ్యసించేవారి ఎంపిక కోసం నిర్వహించే పరీక్షలలో కూడా రాత, మౌఖిక పరీక్ష పద్ధతులను ప్రవేశపెట్టి ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉండాలి.

యూనివర్సిటీల ఆచార్యుల ఎంపిక ప్రస్తుతం లోపభూయిష్టంగా ఉంది. సివిల్ సర్వీస్ స్థాయి లాంటి మూడు అంచల పరీక్ష పద్ధతిని ప్రవేశపెట్టి ఆచార్యులను ఎంపికచేయాలి. విశ్వవిద్యాలయాలలోకి విశ్వజ్ఞానాన్ని ఆహ్వానించే విధంగా ఎంపిక ఉండాలి. అధికారంలో ఉన్నవాళ్లు విశ్వవిద్యాలయాలను తమ రాజకీయ క్షేత్రంగా మార్చుకోవడాన్ని విస్మరించాలి. మంత్రుల, రాజకీయ నాయకుల జన్మదినాలు జరపడం, పాలాభిషేకాలు చేయడం లాంటి విద్యేతర కార్యకలాపాలు చేయకుండా తమ అనుచర గణానికి పరిమితులు విధించాలి. ఈ విషయంలో ముఖ్య మంత్రే చొరవచూపి అదుపుచేయాలి. విశ్వవిద్యాలయాలను కేవలం విద్యార్థి సంఘాల విద్యా సంబంధిత రాజకీయ చర్చలకు వేదికలుగా ఉండనివ్వాలి. పాఠ్యాంశాలలో మార్పులను, నూతన కోర్సుల ప్రారంభం, పరిశోధనలో కొత్త పరికల్పలను రూపొందించేలా విద్యార్థుల కార్యాచరణ ఉండాలి. సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయార్థిక సమస్యలకు పరిష్కారాలను వెదికే మేధోనిలయాలుగా విశ్వవిద్యాలయాలు ఉండాలనే పరిపక్వత సమాజానికి, రాజకీయ నాయకత్వానికి రావాలి. బోధనా రంగంలోకి ప్రవేశించాలనుకునే వారికి కార్పొరేట్ రంగంలో ఇస్తున్న విధంగా ఆకర్షణీయమైన వేతనాలు ఉండాలి. అన్నిటికి మించి విద్యారంగానికి సరిపడ నిధులను ప్రభుత్వం కేటాయించాలి. T

<u>**రచయితలకు సూచనలు:**</u>

**1. రచనలను డీటీపీ చేసి పంపేవారు ప్రతినెల 15వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో లేదా వర్డ్ ఫైల్‌లో పత్రిక మెయిల్ అడ్రస్‌కు పంపించగలరు.**

**2. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**3. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**4. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**5. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

# ఆశా కార్యకర్తలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులు

సురేష్ గడపాటి

**పరిచయం**

భారతదేశ ప్రజారోగ్య రంగంలో ఆశా కార్యకర్తలు, లేదా గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు కీలకమైన వ్యక్తులుగా ఆవిర్భవించారు. మాతా, శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, టీకా కార్యక్రమాలు, రోగ నిరోధక శక్తిని పెంచడంలో, పోషకాహారం, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆశా కార్యకర్తలు అనే ప్రోగ్రాంని జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్లో (NRHM) భాగంగా ప్రారంభించారు. కాలానుగుణంగా ఈ ఆశా కార్యకర్తలు అనే ప్రోగ్రాంని 2013 నుండి పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరింపజేశారు. కోవిడ్-19 సమయంలో వారు అందించిన సహకారం చాలా గొప్పది. వీరు సమాజానికి, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారు. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలకు ఆరోగ్య సంరక్షణ సేవలను విస్తరించేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. ఇంతటి కృషి చేస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదు. పైగా వీరిని వాలంటీర్స్ అని మాత్రమే పిలుస్తున్నారు.

**ఆశా కార్యకర్తల ఎంపిక, వారి విధులు**

**భౌగోళిక పంపిణీ:** గ్రామీణ ప్రాంతాల్లో 1,000 మందికి ఒక ఆశా కార్యకర్త ఉంటారు.

**గుర్తింపు:** 2013లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ద్వారా గుర్తించబడ్డారు.

**విధులు, బాధ్యతలు:** నవజాత శిశువులు, గర్భిణీ స్త్రీలు, మరణాలను నమోదు చేయడంబీ రోగులను ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లడంబీ మందులు పంపిణీ చేయడంబీ రోగ నిరోధక శక్తి పెంపుదల వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఆరోగ్య గణాంకాలను నివేదించడం వంటి కార్యక్రమాలను చేపడతారు.

**గ్రామీణ ప్రాంత కార్యకర్తల అర్హతలు:**

1. ఆశా అభ్యర్థి ఆ గ్రామానికి చెందిన వివాహిత, వితంతువు లేదా విడాకులు తీసుకున్న మహిళ(లు) అయి ఉండాలి.

2. 25 నుండి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలి.

3. ఎంపిక కాబడే అభ్యర్థులు అక్షరాస్యులు అయి ఉండాలి. 10వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికేట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అంగన్‌వాడీ, బ్లాక్, జిల్లా స్థాయిలో అనేక ఇంటర్వ్యూలు ఉంటాయి. ఆశా కార్యకర్తల ఎంపికలో ఆరోగ్య కమిటీలు నిష్పక్షపాత ఎంపిక ప్రక్రియను చేపడతాయి.

**పట్టణ ప్రాంత కార్యకర్తల అర్హతలు:**

1. ఆశా అభ్యర్థులు పట్టణ ప్రాంతాలకు సంబంధించిన మహిళా వివాహితులు, వితంతువులు, విడిపోయినవారు లేదా విడాకులు తీసుకున్నవారు అయి ఉండాలి.

2. 25 నుండి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలి.

3. అభ్యర్థులు తగిన అక్షరాస్యత కలిగి, ఆ ప్రాంతపు మాతృభాషలో నిష్ణాతులై ఉండాలి.

**శిక్షణ:**

ఆశా కార్యకర్తలకు మొదటి సంవత్సరంలో 23 రోజుల పాటు శిక్షణ ఇస్తారు, ఆ తర్వాత ప్రతి సంవత్సరం 12 రోజుల శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణా పాఠ్యాంశాలు వారి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను అందించడానికి అనుగుణంగా తయారు చేయబడ్డాయి.

**పరిశోధన పద్ధతి:**

గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పనిచేసే ఆశా కార్యకర్తలతో 20 నుంచి 30 నిమిషాల పాటు లోతైన సంభాషణ (IDI) జరపడం ద్వారా గుణాత్మక అధ్యయనం చేయడం జరిగింది.

**నైతిక పరిశీలన:**

హైదరాబాద్ విశ్వవిద్యాలయం వారి ఎథికల్ కమిటీ అనుమతి పొందిన తర్వాతనే ఆశా కార్మికులపై చేసిన పరిశోధన వివరాలను ప్రచురిస్తున్నాము. అలాగే అధ్యయనంలో భాగంగా సేకరించిన వారి వ్యక్తిగతర సమాచారం, విషయ సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని హామీ ఇవ్వడం జరిగింది.

**కనుగొన్నవి:**

సమాచారాన్ని విశ్లేషించిన తర్వాత ఫలితాలను మూడు ప్రధాన విభాగాలు, ఉప విభాగాలుగా విభజించాము. అవి

1. **పని సవాళ్లు:** అధిక పని – తక్కువ చెల్లింపులు, వ్యవస్థాగత అసమానతలు, సామాజిక కళంకం

2. **వృత్తిపరమైన ప్రమాదం:** శారీరక ఒత్తిడి, మానసిక ఆరోగ్య సవాళ్లు, వ్యక్తిగత భద్రతా సమస్యలు

3. **సామాజిక, ఆర్థిక చిక్కులు:** ఆర్థిక అస్థిరత, లింగ ఆధారిత భారం, సాధికారత మరియు ఏజెన్సీ.

**ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సవాళ్లు:**

1. పని సవాళ్లు

**అధిక పని, తక్కువ చెల్లింపు:** ఆశా కార్యకర్తలు "మూడు షిఫ్ట్"లలో పనిచేస్తున్నారు. గృహ బాధ్యతలు, సమాజ సేవతో పాటు, ఆరోగ్య కేంద్ర విధులను సమతుల్యం చేసుకుంటారు. అధిక పరిభారమే కాకుండా ప్రభుత్వం నుంచి సరైన జీతం అందదు. అందే ఆ కొద్ది జీతం కూడా సమయానికి అందకపోవడంతో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.

***"మాపై అధిక పని భారం ఉంది, కొన్ని సార్లు ఇతర ఆశా కార్యకర్తల పనులను కూడా నిర్వహించడం వల్ల పని ఒత్తిడి పెరిగి, మేము చాలా ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది"*** (IDI, ASHA4).

వ్యవస్థాగత అసమానతలు: ఆశా కార్యకర్తలు లింగ, కులవివక్షను ఎదుర్కొంటున్నారు. ఇది ''స్వచ్ఛంద సేవకులు"గా వారి హోదాతో కలిపి ఆర్థిక, శారీరక మరియు మానసిక దుర్బలత్వాలకు దారితీస్తుంది.

**సామాజిక వివక్షత:** ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచడంలో వీరిది కీలక పాత్ర అయినప్పటికీ, ఆశాలు తరచుగా సామాజిక వివక్షకు గురవుతున్నారు. ఈ వివక్షతలు వారి శ్రేయస్సుకు ఆటంకం కలిగిస్తున్నాయి.

"మేము కింది స్థాయి ఉద్యోగులము కాబట్టి సమాజం చిన్న చూపు చూస్తుంది, మాకు తగినంత గౌరవం దక్కడం లేదు" (IDI, ASHA5).

**2. వృత్తిపరమైన ప్రమాదాలు**

**శారీరక ఒత్తిడి:** పని ఒత్తిడిలో పడి సరైన సమయానికి భోజనం చేయకపోవడం, తగినంత నిద్ర లేకపోవడం వంటి తీవ్రమైన పరిస్థితులకు గురికావడం వల్ల ఆశాలలో పోషకాహార లోపం, రక్తహీనత, అంటువ్యాధులు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

***"కొన్నిసార్లు తీసుకుపోయిన సద్ది కూడా అలానే తీసుకొస్తాను. పని ఒత్తిడి కారణంగా తినడానికి కూడా కొన్నిసార్లు టైం ఉండదు. పైగా టైంకి తినకపోవడం వల్ల నీరసంగా అనిపించి మరుసటి రోజు డ్యూటీకి వెళ్లాలనిపియ్యదు. ఎవరికైనా, ఏ సమయంలోనైనా, ఏ ఇబ్బంది వచ్చినా రాత్రయినా, పగలైనా వాళ్లతో పాటు ఆరోగ్య కేంద్రానికి వెళ్లడం జరుగుతుంది. ఉదాహరణకు ఒక మహిళకు పురిటినొప్పులు వచ్చినయి అనుకో ఆమెతో ఏ రాత్రైనా ఆరోగ్య కేంద్రానికి వెళ్లడం జరుగుతుంది. అంతే కాకుండా అక్కడికి వెళ్లి ఆ పరిస్థితిని చక్కదిద్దడానికి అక్కడే ఉండాల్సిన అవసరం కూడా వస్తుంది.*** (IDI, ASHA2).

**మానసిక ఆరోగ్య సవాళ్లు:** ఆశా కార్యకర్తల అవసరం, వారికి సమాజంలో పరిమితంగా దొరికే సామాజిక మద్దతు మొదలైన అంశాలు వారిని ఒత్తిడికి, ఆందోళనకు ఆందోళనకు గురిచేస్తాయి, ఇటువంటి పరిస్థితులు వారి శ్రేయస్సును, ఉద్యోగ సంతృప్తిని ప్రభావితం చేస్తాయి.

**భద్రతా సమస్యలు:** ముఖ్యంగా మారుమూల లేదా సమస్యాత్మక ప్రాంతాలలో పనిచేసే ఆశా కార్యకర్తలు, తమ విధులను నిర్వర్తిస్తున్నప్పుడు వేధింపులకు, హింసకు, దాడులకు గురవుతున్నారు. ఈ పరిస్థితులు ఆశా కార్యకర్తలకు మెరుగైన భద్రతను, సహాయక వ్యవస్థల నిర్మాణం చేయాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తున్నాయి.

***"నేను ఒంటరిగా వెళుతున్నది చూసి కొందరు నన్ను వెంబడించి నాతో దురుసుగా వ్యవహరించడం జరిగింది. తర్వాత ఎందుకు చేస్తున్నాను రా ఈ జాబు అనిపించింది. కానీ, తప్పక ఇవన్నీ భరించాల్సి వస్తుంది. కుటుంబాన్ని పోషించుకోవడం కోసం ఈ దుర్భర పరిస్థితులను కూడా భరించాల్సి వస్తుంది.*** (IDI, ASHA1).

**3. సామాజిక, ఆర్థికపరమైన చిక్కులు**

**ఆర్థిక అస్థిరత:** ఆశా కార్యకర్తలకు ఇచ్చే గౌరవ వేతనాలు చాలా కుటుంబాలకు ప్రధాన ఆదాయంగా ఉంటున్నాయి. అయితే వేతన చెల్లింపుల్లో జాప్యం లేదా ఆలస్యం వల్ల సొంత ఖర్చులు ఆర్థిక ఒత్తిడిని పెంచి పేదరికంలోకి నెట్టివేస్తున్నాయి.

**"నా భర్త ఉద్యోగం కోల్పోయినందున నా ఇంట్లో నేనే ఏకైక ఆదాయ వనరు"** (IDI, ASHA2).

**లింగ, కుల వివక్ష:** ప్రధానంగా అణగారిన వర్గాలకు చెందిన మహిళలైన ఆశా కార్యకర్తలు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో లింగ, కుల ఆధారిత వివక్షను ఎదుర్కొంటున్నారు. ఆశా కార్మికులు దళిత, ఆదివాసి మహిళలతో సహా ఆర్థికంగా సామాజికంగా అణగారిన వర్గాల నుండి వచ్చారని సమాజంలో మహిళల శ్రమలో ఎక్కువ భాగాన్ని వేతనం లేని, సంరక్షణ పనిలో భాగంగా సాధారణంగా పరిగణించబడే విధులను నిర్వర్తిస్తున్నారని గమనించడం జరిగింది. ఆశా కార్యక్రమ మూల్యాంకనంపై జరిపిన ఒక అధ్యయనం ప్రకారం దళిత బహుజన, ఇతర అణగారిన

వర్గాల చెందిన ఆశ కార్మికులపై అంతర్గత మరియు బాహ్య కుల ఆధారిత వివక్షతకు సంబంధించిన సంఘటనను పొందుపరచడం జరిగింది. (భారత ప్రభుత్వం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, 2011).

"మేము సర్వేలో భాగంగా సమాచార సేకరణకు వెళ్లినప్పుడు కొంతమంది వారి ఇంటి తలుపులను, మెట్లను తాగొద్దని ఆంక్షలు పెట్టేవారు, తాకనీయకపోయేవారు (IDI, ASHA3).

*నా భర్త నన్ను ఇలా మందలించాడు: మీ కుటుంబాన్ని సరిగా చూసుకోలేని వారు ఈ సమాజాన్ని ఎలా బాగు చేస్తారని వ్యంగ్యంగా  అన్న సందర్భాలను ఎదుర్కోవడం జరిగింది* (IDI, ASHA5).

*వివిధ కారణాల వల్ల నేను PHCకి ఆలస్యంగా వస్తే పబ్లిక్ హెల్త్ నర్సు నాపై అరుస్తూ, రోజు గైర్హాజరు చేసేది (IDI, ASHA5).*

**సాధికారత, ఏజెన్సీ:** ఆశా కార్యకర్తలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, తమ హక్కుల కోసం వాదించడంలో, సంఘాలను సమీకరించడంలో, వారి పని పరిస్థితుల వల్ల జీవనోపాధిని మెరుగుపరచడానికి విధాన సంస్కరణలను డిమాండ్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పోరాటంలో వారు నిజాయితీని ప్రదర్శిస్తున్నారు.

*"ఉద్యోగ భద్రత, వేతన పెంపుదల కోసం నిరసన తెలుపుతున్న సమయంలో పోలీసులు మాపై దాడి చేసి అరెస్టు చేశారు. మేము అరెస్టు అయ్యామని తెలిసి మా కుటుంబ సభ్యులు మీకు ఇలాంటి పని అవసరం లేదని మందలించడం జరిగింది.* (IDI, ASHA6).

**ఆశా కార్యకర్తల శ్రేయస్సు, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తుంది?**

ఆశా కార్యకర్తల శ్రేయస్సు భారతదేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పనితీరుతో నేరుగా ముడిపడి ఉంది. ఆరోగ్యకరమైన మద్దతు సమాజంలో, కుటుంబంలో ఉన్న ప్రతీ కార్యకర్త తన విధుల్లో ప్రతిభావంతంగా పనిచేసే అవకాశం ఉంది. ఇందులో భాగంగా తల్లి, శిశు ఆరోగ్య సేవలను పొందడం, వాటిని సులభతరం చేయడం కూడా జరుగుతుంది. ఆశా కార్యకర్తలతో అనుసంధానించబడినప్పుడు మహిళలు ప్రసూతి ఆరోగ్య సేవలను ఎక్కువగా ఉపయోగించుకునే అవకాశం ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. మెరుగైన ఆరోగ్య ఫలితాల కోసం వారి శ్రేయస్సుకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలని ఈ పరిశోధన నొక్కి చెప్తుంది.

**వాదనలు, విధాన సిఫార్సులు**

**గుర్తింపు, న్యాయమైన పరిహారం:**

ఆశా కార్యకర్తలకు సంస్థాగత గుర్తింపు, న్యాయమైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు కల్పించడం, వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలు, ప్రసూతి మద్దతును పొందే ప్రభుత్వ ఉద్యోగులుగా ఉద్యోగపరమైన రక్షణ కల్పించడం.

**సామర్థ్య నిర్మాణం:** లక్ష్య శిక్షణ, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఆశా కార్యకర్తల నైపుణ్యాలు, జ్ఞానం, విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారికి మద్దతుగా నిలవాలి.

**సాధారణ ఆశా కార్యకర్తలకు బదులుగా ప్రత్యేక ఆశా కార్యకర్తల అవసరం:** ఆశా కార్యకర్తలను ఆరోగ్య ప్రాధాన్యతల ఆధారంగా ప్రత్యేక వర్గాలుగా విభజించవచ్చు 1. తల్లి, పిల్లల ఆరోగ్య విభాగం 2. అంటువ్యాధి కాని వ్యాధుల విభాగం 3. అంటు వ్యాధుల కొరకు ఒక విభాగం, 4. మానసిక ఆరోగ్యం కొరకు ఒక విభాగం, 5. డిజిటల్ టెక్నాలజీ కొరకు ఒక విభాగం. ఈ విధంగా స్పెషలైజేషన్ మోడల్‌ను అమలు చేయడం ద్వారా మనం గణనీయంగా గ్రామీణ భారతదేశంలో ఆరోగ్య సంరక్షణని అందించగలము. ఆరోగ్య ఫలితాలను, మెరుగైన వ్యాధి నిర్వహణ సంబంధమైన లక్ష్యాలను సాధించవచ్చు.

**సమాజాన్ని భాగస్వాములు చేయడం:** ఆశా కార్యకర్తల సహకారాన్ని, సేవా గుణాన్ని గుర్తించి అభినందించడానికి స్థానిక సంఘాలను ప్రోత్సహించాలి. బలమైన మద్దతు నమ్మకాన్ని, సహకారం వారికి అందించాలి.

**భద్రతా చర్యలు:** వేధింపులు, హింస, దాడి ప్రమాదాలను తగ్గించడానికి ఆశా కార్యకర్తలకు, ముఖ్యంగా మారుమూల, లేదా సంఘర్షణాత్మక ప్రాంతాలలో పనిచేసే వారికి భద్రతా ప్రోటోకాల్‌లు, మద్దతు వ్యవస్థలను మెరుగుపరచాలి.

**వ్యవస్థాగత అడ్డంకులను పరిష్కరించడం:** ఆశా కార్యకర్తలు అనుభవించే లింగ, కుల ఆధారిత అసమానతలను పరిష్కరించడంతోపాటు సమాన అవకాశాలను, వనరులను మెరుగుపరచాలి. తద్వారా వారికి సమాజంలో సమానమైన గౌరవం దక్కుతుంది

**ఆర్థిక భద్రత:** ఆశా కార్యకర్తలకు వేతనాలను సరైన సమయానికి చెల్లింపులు జరిగేలా చూసుకోవడం, వారి జేబులో నుంచి పెట్టుకునే ఖర్చులను తగ్గించడం ద్వారా ఆర్థిక ఒత్తిడిని, శాశ్వత పేదరికాన్ని తగ్గించేలా మార్గదర్శకాలను రూపొందించాలి.

**ముగింపు**

ఈ పరిశోధన ఆశా కార్యకర్తల దుస్థితి భారతదేశ ఆరోగ్య సంరక్షణ రంగంలో విస్తృత నిర్మాణాత్మక అన్యాయాలను ప్రతిబింబిస్తుంది. విధాన సంస్కరణలు, వ్యవస్థాగత మద్దతుల తక్షణ అవసరాన్ని నొక్కి చెబుతుంది.

ప్రజారోగ్యంలో ముందు వరుస యోధులుగా, కార్యకర్తలుగా, సేవకులుగా ఆశా కార్యకర్తలు సమానమైన గౌరవం గుర్తింపును, రక్షణ పొందుటకు అర్హులు. ఈ పరిశోధన ఆశా కార్యకర్తల వ్యక్తిగత శ్రేయస్సును, సమాజ ఆరోగ్య ఫలితాలను ముందుకు తీసుకెళ్లడానికి ఇది తోడ్పడుతుంది. సామూహిక వాదన, సాధికారత, సంఘీభావం ద్వారా కార్యకర్తల్లో సానుకూల మార్పును కొనసాగించవచ్చు. అలాగే ప్రజారోగ్యానికి శాశ్వత సహకారాన్ని అందించడంతో మెరుగైన ఫలితాలను పొందవచ్చు.

గుర్తింపు: పరిశోధన ప్రాజెక్టును నిర్వహించడంలో సహాయం చేసినందుకు హైదరాబాద్ విశ్వవిద్యాలయం-ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్, తెలంగాణ వైద్య అధికారులకు, పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలలోని ఆశా కార్యకర్తలకు ముఖ్యంగా జంతుశాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థి సంగెం ప్రభాకర్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

పరిశోధన చేయడానికి ఎలాంటి ఆర్థిక సహాయం పొందలేదు మరియు ఈ పరిశోధనలో ఎలాంటి వైరుధ్యాలు లేవు.

**ప్రస్తావనలు:**

1. Menon, Shaveta, Ramila Bisht, and Balakrishnan Nair. "ASHA Workers During COVID-19 in India: At the Intersection of Gender and Work." Journal of Health Management 27.1 (2025): 78-85.
2. Gadapati, Suresh, and B. R. Shamanna. "Workplace violence against community health workers in Lower Middle-Income Country-India." work 19: 20.
3. Bisane, Priti, et al. "An evaluation of job satisfaction levels among ASHA workers at the Raipur PHC, Nagpur." F1000Research 13 (2024): 428.
4. Gadapati S, Shamanna BR. A Review on Violence Against Health Care Professionals in India and Its Impact. Natl J Community Med 2023;14(8):525-533.DOI: 10.55489/njcm.140820233112
5. (PDF) A Review on Violence Against Health Care Professionals in India and Its Impact. Available from: https://www.researchgate.net/publication/372837292_A_Review_on_Violence_Against_Health_Care_Professionals_in_India_and_Its_Impact [accessed Mar 11 2025].
6. Bist, Rekha Rani, et al. "What they know about their work, barriers, and challenges faced by the community health workers while performing their multiple roles: mixed method study in India." International Journal of Community Medicine and Public Health 10.6 (2023): 2228.
7. Rattu, Ramesh Kumar; Kumar, Manoj1; Sekhri, Kavita2; Chaudhary, Ankit3,. Duties, Responsibilities, and Challenges of Community Health Workers: Evidence from a Health Block of Northern Indian Province. CHRISMED Journal of Health and Research 9(2): p 135-139, Apr–Jun 2022. | DOI: 10.4103/cjhr.cjhr_35_21
8. Verdezoto, Nervo, et al. "The invisible work of maintenance in community health: challenges and opportunities for digital health to support frontline health workers in Karnataka, South India." Proceedings of the ACM on Human-Computer Interaction 5. CSCW1 (2021): 1-31.
9. Meena, Sadhana, et al. "Challenges faced by ashas during their field works: a cross-sectional observational study in rural area of Jaipur, Rajasthan." (2020): 97-99.
10. https://nhm.gov.in/index1.php?lang=1&level=1&sublinkid=150&lid=226
11. https://www.who.int/india/news/feature-stories/detail/asha-the-driving-force-behind -india-s-public-health-services

✶ రచయిత: పరిశోధక విద్యార్థి, హెచ్‌సియు

తొవ్వ ముచ్చట

# "కృత్రిమ మేధ (AI), మానవకృషిల సమన్వయంతోనే భాష బలపడుతుంది"

ఇంటర్వ్యూ: రహ్మానుద్దీన్

ఇంటర్వ్యూయర్: మ్యాడం అభిలాష్

***కృత్రిమ మేధ (AI) రంగం నేడు ప్రపంచాన్ని రూపుమాపుతున్న అత్యుత్తమ సాంకేతిక విప్లవాల్లో ఒకటిగా ఎదుగుతోంది. భాషా అభివృద్ధి, సమాచార పంపిణీ, డిజిటల్ లిటరసీ పెంపు వంటి అంశాల్లో AI కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా తెలుగు వంటి ప్రాంతీయ భాషలకు ఈ సాంకేతికత అనేక అవకాశాలను తెరిచింది. యాంత్రిక అనువాదం, టెక్స్ట్-టు-స్పీచ్, స్పీచ్-టు-టెక్స్ట్, టెక్స్ట్ జెనరేషన్ వంటి టూల్స్ తెలుగులో వినూత్న మార్పులకు దారితీస్తున్నాయి. డిజిటల్ మాధ్యమాల వృద్ధిలో భాగంగా వికీపీడియా, వికీసోర్స్ వంటి స్వేచ్ఛా విజ్ఞాన వేదికల్లో కూడా AI ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో, Buzzai Technologies సంస్థ వ్యవస్థాపకులు మరియు CEOరహ్మానుద్దీన్ గారితో 'నడుస్తున్న తెలంగాణ' పత్రిక తరపున మ్యాడం అభిలాష్ చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇది.***

*కృత్రిమ మేధ (AI) రంగం నేడు ప్రపంచాన్ని రూపుమాపుతున్న అత్యుత్తమ సాంకేతిక విప్లవాల్లో ఒకటిగా ఎదుగుతోంది. భాషా అభివృద్ధి, సమాచార పంపిణీ, డిజిటల్ లిటరసీ పెంపు వంటి అంశాల్లో AI కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా తెలుగు వంటి ప్రాంతీయ భాషలకు ఈ సాంకేతికత అనేక అవకాశాలను తెరిచింది. యాంత్రిక అనువాదం, టెక్స్ట్-టు-స్పీచ్, స్పీచ్-టు-టెక్స్ట్, టెక్స్ట్ జెనరేషన్ వంటి టూల్స్ తెలుగులో వినూత్న మార్పులకు దారితీస్తున్నాయి. డిజిటల్ మాధ్యమాల వృద్ధిలో భాగంగా వికీపీడియా, వికీసోర్స్ వంటి స్వేచ్ఛా విజ్ఞాన వేదికల్లో కూడా AI ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో, Buzzai Technologies సంస్థ వ్యవస్థాపకులు మరియు CEO రహ్మానుద్దీన్ గారితో 'నడుస్తున్న తెలంగాణ' పత్రిక తరపున మ్యాడం అభిలాష్ చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇది.*

**1. మీ బాల్యం, విద్యాభ్యాసం, భాషలపై మీ ఆసక్తి ఎలా మొదలైంది?**

మా నాన్నగారు ప్యారామిలిటరీలో ఉద్యోగం చేయడం వలన, ఆ ఉద్యోగంలో స్థానచలనం మూడేళ్ళకొకసారి ఉండటం వలన, మేం హైదరాబాదులో సీఆర్పీఎఫ్ క్వార్టర్స్‌నే ఉండేవాళ్ళం. నా బాల్యమంతా అక్కడే. విద్యాభ్యాసం కేంద్రీయ విద్యాలయం (సెంట్రల్ స్కూల్) సీఆర్పీఎఫ్ లోనే. కేవి చదువుల్లో తెలుగు ఉండదు. అందుకని మా అమ్మ ఇంటి దగ్గర తెలుగు నేర్పించి, ఎప్పటికప్పుడు క్లాసు పుస్తకాలకు అదనంగా తెలుగు పుస్తకాలు చదువుకునేందుకు తెచ్చి ఇచ్చేది. కేవి బడుల్లో భారతదేశం నలుమూలల నుంచి విద్యార్థులు వచ్చి చదువుకుంటారు, అందువలన మా తరగతి గదిలో ముప్ఫై మంది విద్యార్థులుంటే, ఒక్కొక్కరిదీ ఒక్కో మాతృభాష ఉండేది. హిందీ, ఇంగ్లిష్ అందరూ మాట్లాడుకున్నా, తెలుగు, తమిళం, ఉర్దూ (దకి?నీ), కన్నడం, మలయాళం, మరాఠీ, గుజరాతీ, సింధీ, భోజ్పురీ, పహాడీ, మొ!! భాషలు మాట్లాడే తోటి విద్యార్థుల మధ్య నేను పెరిగాను. భాష కన్నా, లిపి మీద మక్కువతో స్కూల్‌లో ఉండగానే అరబ్బీ, ఉర్దూ, మలయాళం, తమిళం లిపులు స్నేహితుల ద్వారా నేర్చుకున్నాను. వారికి తెలుగు లిపి నేర్పించాను. నేను దిల్సుఖ్నగర్ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదివాను. అక్కడి సంస్కృతం, ఇంగ్లిష్ మాష్టార్లు తరగతి గదిలోని పాఠాలకు అదనంగా మాకు భాషాశాస్త్రం వైపుకు ఆలోచింపజేసే పాఠాలు చెప్పారు. ఇంజనీరింగ్ నేను పులివెందులలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో(జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం, ఇంజనీరింగ్ కళాశాల పులివెందుల) కంప్యూటర్ సైన్స్‌లో చేసాను. అప్పుడప్పుడే కంప్యూటర్లలో తెలుగులో, ఇతర భారతీయ భాషల్లో రాయడం గురించి, ఐఐటీ మద్రాసులో జరిగిన పలు కార్యశాలలకు వెళ్ళి ఆ సాంకేతికతల గురించి తెలుసుకున్నాను. తర్వాతి కాలంలో ఆ పునాది స్థాయి తెలివి నాకు బాగా ఉపకరించింది. మా కళాశాల ఆచార్యులు మమ్మల్ని ఎప్పుడూ మాతృభాషలో కంప్యూటింగ్ వ్యవస్థను

రూపొందించుకుంటూ తెలుగు భాషాభివృద్ధి చేసే వైపుకు ప్రోత్సహించేవారు. వారి ప్రోత్సాహమే ఈ దిశగా పనిచేసేందుకు నాకు ఉత్సాహాన్నిచ్చింది.

**2. భాషా అభివృద్ధి, వికీపీడియా, డిజిటల్ మాధ్యమాల్లో మీ ప్రయాణం గురించి చెప్పండి.**

నేను మూడవ ఏడాది ఇంజనీరింగ్ చదువుకునే రోజుల్లో ఈ-తెలుగు, తెలుగు బ్లాగింగ్ గురించి తెలిసింది. ఆ రోజుల్లో పుస్తక ప్రదర్శనలో ఈ-తెలుగు వారు స్టాల్ పెట్టి సాధారణ ప్రజలకు తెలుగులో కంప్యూటర్లో, ఇంటర్నెట్లో ఎలా పని చేసుకోవాలో నేర్పించేవారు. ఆ సమయంలో నేను ఆ సముదాయం వారికి తెలుగులో ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఒకటి చేయదలచానని, అందుకు సలహాలు, సూచనలు కావాలని ఒక విద్యుల్లేఖ (ఈ-మెయిల్) రాసాను. జవాబుగా చాలా మంది నన్ను ప్రోత్సహించి సలహాలు, సూచనలు ఇచ్చారు. వీవెన్ గారు నేరుగా కలిసి నాకు సూచనలు చేసారు. అలా తెలుగు భాషలో సాంకేతిక ఉపకరణాలపై నా పనికి పునాది పడింది. ఇంజనీరింగ్ చదువు అయిపోయాక, ఉద్యోగరీత్యా పూణే, ఆ తర్వాత హైదరాబాద్ లో పని చేస్తుండగా తెలుగు బ్లాగర్లను చాలా మందిని కలిసాను. వారి పరిచయాల వల్ల తెలుగులో వారు కంప్యూటర్లో రాస్తున్నపుడు వస్తున్న సమస్యలను తెలుసుకొని నాకు వీలైనంతలో సహాయం చేసే వాడిని. చావా కిరణ్ పరిచయమయ్యాక మొదట వారి కార్యాలయంలోని కంప్యూటర్లలో తెలుగు వాడకునేందుకు వీలుగా తెలుగుకుపకరించే సాఫ్టువేర్ల స్థాపన చేసేవాడిని. ఆ తర్వాత వారి కినిగె సంస్థలో చేరి తెలుగు భాషా కీబోర్డును రూపొందించి, వాణిజ్యపరంగా అమ్మాను. సురవర ఫాంట్ల శ్రేణిలో వజ్రం పేరుతో ఒక ఫాంటును రూపొందించాను. ఈబుక్లపై పని చేయడం వలన పైథాన్, జావా ప్రోగ్రామింగ్ భాషల్లో తెలుగు అక్షరాల రెండరింగ్ పై ఆ రోజుల్లో బాగా పనిచేసాను. చావా కిరణ్ కినిగెలో పని చేసే రోజుల్లో వికీపీడియాలో సరిదిద్దటం చేయించేవారు. కళాశాల రోజుల్లో ఆంగ్ల వికీలో పని చేసినా, ఈ-తెలుగు, కినిగె రోజుల్లో తెలుగు వికీపీడియాలో బాగా పని చేసాను. వికీమీడియా ఇండియా స్థాపించాక తెలుగు వికీపీడియాకు ప్రతినిధిగా ఉన్నాను. ఆ తర్వాత వికీపీడియా వారు భారతదేశంలో వికీపీడియా చొరవ కోసం సీఐఎస్తో పని చేసే రోజుల్లో అక్కడ కమ్యూనిటీ కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్గా చేరి, ఆపై ప్రాజెక్ట్ ఆఫీసర్గా తెలుగు, ఇతర భారతీయ భాషల్లో వికీపీడియా అభివృద్ధి కోసం పని చేసాను. కొంకణీ వికీపీడియా ఇంక్యుబేషన్ దశ నుంచి పూర్తి స్థాయి వికీపీడియా అయ్యే వైపుకు జరిగిన కృషిలో నేను కూడా పాలు పంచుకున్నాను. వీవెన్ గారు స్వేచ్ఛా (ఓపెన్ సోర్స్) సాఫ్టువేర్, ఓపెన్ (బహిరంగ) ఇంటర్నెట్, ఓపెన్ (బహిరంగ) వెబ్ గురించిన ఆలోచనలను గురించి నాకు చెప్తూ ఉండేవారు. ఆ ప్రభావం వలన వివిధ సాఫ్టువేర్ల అంతరవర్తిని (ఇంటర్ఫేస్) తెలుగులో కనపడేలా ట్రాన్స్లేట్వికీ, గ్నూ లోకలైజేషన్, ఫైర్ఫాక్స్ లోకలైజేషన్ లాంటి అనువాద ప్రాజెక్టుల్లో పాల్గొన్నాను. ఆధునిక కంప్యూటింగ్ వ్యవస్థలు ఏర్పడ్డాక నా వ్యక్తిగత పరిశోధనాభిరుచులకు సరిపోయే సాంకేతికతలకు ఎప్పటికప్పుడు నా వైపు నుంచి తగిన కృషి చేస్తూనే ఉన్నాను.

**3. తెలుగు వికీపీడియాతో మీ అనుబంధం ఎప్పుడు మొదలైంది? దాని ద్వారా మీకు ఏ ప్రయోజనాలు కలిగాయి?**

నేను కళాశాలలో ఉండే రోజుల్లో Nani1only వాడుకరి పేరుతో ఆంగ్ల వికీపీడియాలో కొన్ని ఎడిట్లు చేసి, అవి సరైన మార్పులు కాకపోవటం వలన అక్కడి ఎడిటర్లు ఆ మార్పులను తొలగించి, పేజీలను తీసివేసేవారు. ఈ-తెలుగు వారి నుంచి తెవికీ గురించి తెలుసుకున్నాక, తెలుగు వికీపీడియాలో తెలుగు హ్యాండిల్తో ఎడిట్ చేయమని వీవెన్ సూచిస్తే రహ్మానుద్దీన్ వాడుకరి పేరుతో ఎడిట్ చేస్తున్నాను. తెలుగు వికీపీడియాలో సమాచారాన్ని చేర్చటం నాకు సంతోషాన్నిస్తుంది. నా భాషలో నేను నలుగురికీ నాకు తెలిసిన సమాచారాన్ని పంచుకునే మార్గాన్ని తెవికీ నాకు కల్పించింది. అలానే తెలుగు భాష, సంస్కృతి గురించిన విషయాలను ఆంగ్ల, ఇతర భాషల వికీపీడియాల్లో, పాత-నకలు హక్కులు తొలగిపోయిన తెలుగు పుస్తకాలను అందించే వికీసోర్స్లో, తెలుగుకు సంబంధించిన ఫోటో, పుస్తక, ఆడియో, వీడియో వనరులను ఎక్కించి అందరితో పంచుకునేందుకు కామన్స్ లో నేను పని చేస్తూంటాను. తెవికీ, ఇతర వికీపీడియా ప్రాజెక్టుల్లో పని చేస్తూ నాకు ఒక రకమైన సంతృప్తి కలగడంతో పాటుగా నా తెలుగు అస్తిత్వానికి నేను బాగా దగ్గరయ్యానని కూడా చెప్పవచ్చు.

**4. డిజిటల్ మాధ్యమాలు భాషల అభివృద్ధిలో ఎంతవరకు ప్రభావం చూపుతున్నాయి?**

ముద్రిత పుస్తకాలకు పరిమితులున్నాయి. దేశ, కాల, నిడివి, వ్యాప్తి, సరళతా పరిమితులు ముఖ్యం, అవి కాక ఇంకెన్నో పరిమితులున్నాయి. పుస్తకంలో ఉన్న సమాచారాన్ని

ఒకే సమయంలో పలు చోట్లకు ప్రసరించడం కష్టం. పుస్తకంలో ముద్రించిన సమాచారం కాలదోషం పట్టుకుంటుంది. పరిమిత నిడివిలో మాత్రమే సమాచారాన్ని అందించగలము. పుస్తకాలలో ఉన్న విషయం జనబాహుళ్యానికి అర్థమయ్యేలా విశదీకరించేందుకు సహకార వనరులు అరుదుగా మాత్రమే అందుబాటులో ఉంటాయి. మరో పక్క నేటి డిజిటల్ యుగంలో భాషల అభివృద్ధిపై డిజిటల్ మాధ్యమాలు గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయి:

**భాషావ్యాప్తి:** సోషల్ మీడియా, బ్లాగులు, వెబ్సైట్ల ద్వారా ప్రాంతీయ భాషలు ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చెందుతున్నాయి.

♦ కొత్త పదాల సృష్టి: టెక్నాలజీ, ఇంటర్నెట్ వల్ల భాషలలో నూతన పదజాలం, సంక్షిప్త రూపాలు ఏర్పడుతున్నాయి.

♦ భాషా సంరక్షణ: అంతరించిపోతున్న భాషలను డిజిటల్ డాక్యుమెంటేషన్ ద్వారా రక్షించుకోవడం సాధ్యమవుతోంది.

♦ అనువాద సాధనాలు: గూగుల్ ట్రాన్స్లేట్ లాంటి ఆన్లైన్ సాధనాలు భాషా అవరోధాలను తగ్గిస్తున్నాయి.

♦ భాష నేర్చుకోవడం: యాప్లు, ఆన్లైన్ కోర్సులు ప్రజలకు నూతన భాషలు నేర్చుకోవడానికి సహాయ పడుతున్నాయి.

♦ స్థానిక భాషలకు ప్రాధాన్యత: డిజిటల్ కంటెంట్లో విభిన్న ప్రాంతీయ భాషల ఉపయోగం పెరుగుతోంది.

♦ భాషా ప్రమాణాల మార్పు: సాంప్రదాయేతర రచనా శైలి, ఈమోజీలు, మీమ్స్ భాషలను ప్రభావితం చేస్తున్నాయి.

♦ AI సాంకేతికత: చాట్బాట్లు, వాయిస్ అసిస్టెంట్లు భాషా సామర్థ్యాలను మెరుగుపరుస్తున్నాయి.

**5. తెలుగు భాషలో కృత్రిమ మేధ (AI) ఆధారిత టూల్స్ గురించి చెప్పండి?**

తెలుగు భాషలో కృత్రిమ మేధ (AI) ఆధారిత సాధనాలు (Tools) ఇటీవల వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. వీటిని విభిన్న రంగాలలో ఉపయోగిస్తున్నారు, ముఖ్యంగా సహజ భాషా ప్రక్రియలు (NLP), యాంత్రిక అనువాదం, పాఠ్య అప్రమేయ యాంత్రిక రచన (text automation), వాక్య నిర్మాణ విశ్లేషణ, మరియు వాక్య భావ పరిశీలన (sentiment analysis) లాంటి అనేక విభాగాలలో తెలుగు భాషకు సంబంధించిన AI టూల్స్ ఉపయోగిస్తున్నారు.

1. యాంత్రిక అనువాదం (Machine Translation)

Google Translate - తెలుగు నుంచి ఇతర భాషలకు మరియు ఇతర భాషల నుంచి తెలుగుకు అనువాదం చేయగలదు.

Microsoft Translator - సానుకూలంగా మెరుగైన అనువాద కచ్చితత్వం కోసం వాడవచ్చు.

Bhashini - భారత ప్రభుత్వానికి చెందిన భాషా సాంకేతికతల వేదిక, వివిధ భారతీయ భాషల మధ్య అనువాదానికి ఉపకరిస్తుంది.

2. తెలుగు టెక్స్ట్-టు-స్పీచ్ (TTS) మరియు స్పీచ్-టు-టెక్స్ట్ (STT)

Google Speech-to-Text API - తెలుగు వాయిస్ డేటాను టెక్స్టా మారుస్తుంది.

Mozilla Common Voice - తెలుగు వాయిస్ డేటాను సేకరించి, ఓపెన్-సోర్స్ మోడల్స్ అభివృద్ధి చేయడానికి తోడ్పడుతోంది.

iSpeech, Azure Cognitive Services - వాణి గుర్తింపు (ఏ భాషలో మాట్లాడుతున్నారు, స్త్రీ/పురుష వగైరా) సేవలు అందిస్తున్నాయి.

3. తెలుగు వాక్య భావ పరిశీలన (Sentiment Analysis)

సోషల్ మీడియా వ్యాఖ్యల విశ్లేషణ కోసం కొన్ని NLP మోడల్స్ అభివృద్ధి అవుతున్నాయి.

తెలుగు ఫీచర్లను గుర్తించడానికి Transformers (BERT, IndicBERT) ఆధారిత మోడల్స్ ఉపయోగపడుతున్నాయి.

4. తెలుగు కోసం GPT ఆధారిత మోడల్స్

IndicNLP - భారతీయ భాషల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేయబడిన మోడల్స్.

AI4Bharat - తెలుగు సహా అనేక భారతీయ భాషల కోసం NLP టూల్స్ అభివృద్ధి చేస్తున్న భారతీయ సంస్థ.

GPT-3, GPT-4 ఆధారంగా కొంతమంది అభివృద్ధి చేసిన తెలుగు ట్యూన్డ్ మోడల్స్ కూడా ఉన్నాయి.

5. తెలుగు OCR (Optical Character Recognition) టూల్స్

Tesseract OCR తెలుగు హస్తలిఖిత పాఠాన్ని డిజిటల్ టెక్స్టుగా మార్చడానికి ఉపయోగపడుతుంది.

Google Docs OCR, Microsoft OCR - తెలుగు ప్రింటెడ్ పాఠాలను డిజిటలైజ్ చేయగలుగుతుంది.

6. తెలుగు ASR (Automatic Speech Recognition) టూల్స్

Kaldi, DeepSpeech - తెలుగు ఆడియో నుండి టెక్స్టు ఉత్పత్తి చేసే మోడల్స్ అభివృద్ధి చేస్తున్నారు.

Whisper by OpenAI - ఇటీవల విడుదలైన వాణీ గుర్తింపు మోడల్, తెలుగు వంటి భాషలను అర్థం చేసుకోగలదు.

7. తెలుగులో చాట్బాట్స్ మరియు వర్చువల్ అసిస్టెంట్స్

Chatbot Systems - విద్య, కస్టమర్ సపోర్ట్, ప్రభుత్వ సేవలలో ఉపయోగిస్తున్న తెలుగు చాట్బాట్లు అభివృద్ధి అవుతున్నాయి.

Bhashini & EkStep Foundation -ప్రభుత్వ రంగంలో మల్టీలింగ్వల్ చాట్బాట్ల అభివృద్ధికి సహాయ పడుతున్నాయి.

భవిష్యత్తు అభివృద్ధి దిశలు

Agentic AI - తెలుగులో మరింత సహజమైన మానవ–యాంత్రిక సంభాషణ మోడల్స్.

Telugu LLMs - GPT తరహా మోడల్స్, భారతీయ భాషా డేటాతో మరింత మెరుగ్గా తయారయ్యాయి.

**6. భవిష్యత్తులో వికీపీడియా వంటి ప్లాట్ఫార్మ్లపై కృత్రిమ మేధ ఏ విధంగా ప్రభావం చూపిస్తుంది? భవిష్యత్తులో వికీపీడియా & కృత్రిమ మేధ (AI) ప్రభావం ఎలా ఉండబోతోంది?**

కృత్రిమ మేధ (AI) వికీపీడియా లాంటి బహుభాషా విజ్ఞాన పంపిణీ వేదికలపై విప్లవాత్మక ప్రభావాన్ని చూపిస్తుంది. ముఖ్యంగా భాషా మౌలికత, సమాచారం ప్రామాణికత, స్వయంచాలక కంటెంట్ జనరేషన్, అనువాద నాణ్యతపై AI కీలక పాత్ర పోషించనుంది.

1. కంటెంట్ సృష్టి మరియు అప్డేట్

అ. స్వయంచాలక వ్యాస రచన (Automated Article Generation)

AI మోడల్స్ GPT-4/5, Llama, మరియు ఇతర LLMల ఆధారంగావోడల్స్ కొత్త వ్యాసాలను స్వయంచాలకంగా రూపొందించగలవు.

ఇ. తెలుగు వంటి భాషలలో లేనిచోట చరిత్ర, సైన్స్, సాంకేతికత, సాహిత్యం వంటి విభాగాలకు వ్యాసాలను రూపొందించడానికి AI ఉపయోగపడుతుంది.

ఈ. వివరాలను తాజాకరణ (Real-Time Updates)

ఉ. కృత్రిమ మేధ ఆధారిత టూల్స్ వికీపీడియా వ్యాసాలను తాజా సమాచారం ద్వారా నవీకరించగలవు. ఉదాహరణకు, విభిన్న వార్తా మూలాల నుండి సమాచారాన్ని విశ్లేషించి, ప్రామాణికంగా అప్డేట్ చేసే AI పద్ధతులు అభివృద్ధి అవుతాయి.

2. యాంత్రిక అనువాదం & భాషావిస్తరణ

అ. ఇండిక్ భాషల విస్తరణ (Expansion in Indian Languages)

ఆ. భాషా మోడల్స్ (IndicBERT, AI4Bharat, Bhashini) ద్వారా వికీపీడియా వ్యాసాలను తెలుగులో మెరుగైన నాణ్యతతో అనువదించవచ్చు.

ఇ. ప్రస్తుతానికి Google Translate, Microsoft Translator వంటివి ఉన్నాయి కానీ భవిష్యత్తులో మరింత సహజమైన అనువాదం కోసం AI మోడల్స్ అభివృద్ధవుతాయి.

ఈ. అనువాదాల్లో పక్షపాతాన్ని తగ్గించడం (Reducing Bias in Translation)

ఉ. AI అనువాద మోడల్స్ సంభాషణ పరంగా మరింత సహజంగా మారి, భాషా స్వచ్ఛతను మెరుగుపరచగలవు.

3. కంటెంట్ నిర్ధారణ & ఫేక్ న్యూస్ నియంత్రణ

అ. సమాచార నిజనిర్ధారణ & తప్పుడు సమాచార గుర్తింపు (Fact-Checking & Misinformation Detection)

ఆ. AI ఆధారిత నిజనిర్ధారణ బాట్లు వికీపీడియాలోని సమాచారాన్ని ధృవీకరించగలవు.

ఇ. వందలాది మూలాలను పరిశీలించి, FactCheckGPT లాంటి వోడల్స్ ఆధారంగా అప్రామాణికమైన సమాచారాన్ని గుర్తించగలవు.

ఈ. వికీపీడియా ఎడిటింగ్లో మానవ తప్పిదాల నియంత్రణ చేయవచ్చు.

ఉ. గందరగోళమైన లేదా తప్పుడు మార్పులను గుర్తించి, సముచితమైన మూలాల ఆధారంగా అవి సరైనవేనా అనేది చెక్ చేసే AI మెకానిజమ్లు అభివృద్ధవుతాయి.

4. వికీపీడియా చాట్బాట్లు & విజువల్ ఇంటరాక్షన్

అ. తెలుగులో చాట్బాట్ వ్యవస్థలు

ఆ. వికీపీడియా కంటెంట్ ఆధారంగా తెలుగు భాషలో చాట్బాట్లను అభివృద్ధి చేయొచ్చు.

ఉదాహరణకు, వికీపీడియా విషయాలను నేరుగా మాట్లాడే వాయిస్-అసిస్టెంట్స్ (Google Assistant, Alexa లాంటి AI బాట్లు) రూపంలో అందించవచ్చు.

ఇ. ఇంటరాక్టివ్ విజువల్ కంటెంట్

ఈ. AI ఆధారంగా ఇమేజ్ సింథెసిస్, డేటా విజువలైజేషన్ (e.g., DALL•E, Midjourney) వినియోగించుకుని విజ్ఞానపరమైన ఇమేజస్, గ్రాఫ్స్ తయారు చేయవచ్చు.

5. వికీపీడియాలో AI ఆధారిత వ్యక్తిగతీకరణ

అ. పాఠకుల అభిరుచికి అనుగుణంగా కంటెంట్

ఆ. AI మోడల్స్ వ్యక్తిగత శైలికి అనుగుణంగా సమాచారం అందించగలవు.

ఉదాహరణకు, ఒక విద్యార్థికి సరిపడే మెరుగైన కంటెంట్, పరిశోధకులకు డీప్ డైవ్ వివరణలు అందించే వ్యక్తిగత వికీపీడియా వెర్షన్లు అభివృద్ధి కావచ్చు.

6. వికీపీడియా కమ్యూనిటీపై AI ప్రభావం

అ. వ్యాస రచనలో మానవ క్రియేటివిటీ తగ్గుదల

ఆ. AI ఎక్కువగా స్వయంచాలకంగా వ్యాసాలు రూపొందించటం వల్ల మానవ ఎడిటర్ల అవసరం తగ్గొచ్చు. అయితే, సున్నితమైన విషయాలపై మానవ పర్యవేక్షణ అవసరం ఉంటుంది.

ఇ. కంటెంట్ మానిటరింగ్ & వాడుకదారుల విభజన

ఈ. AI మోడల్స్ ఏ వ్యాసాలు అత్యధిక మార్పులు ఎదుర్కొంటున్నాయి? ఎక్కడ ఎక్కువ వాదనలు జరుగుతున్నాయి? వంటి విశ్లేషణలు అందించగలవు.

భవిష్యత్తులో వికీపీడియా మరియు ఇతర విజ్ఞాన ప్లాట్ఫార్మ్లపై AI మౌలికమైన మార్పులను తీసుకురాబోతోంది. ముఖ్యంగా తెలుగు వికీపీడియా అభివృద్ధికి AI ఎంతో మేలు చేయగలదు. మీరు ఈ రంగంలో పరిశోధన చేయాలనుకుంటే, AI ఆధారంగా తెలుగు కోసం వికీపీడియా కంటెంట్ జనరేషన్, అనువాద నాణ్యత మెరుగుదల, మరియు చాట్బాట్ ఇన్టిగ్రేషన్ లాంటి అంశాలను పరిశీలించవచ్చు.

**7. AI ఆధారిత అనువాద యంత్రాలు తెలుగులో సరిగ్గా పనిచేయడం కోసం మీరు సూచించే మార్గాలు ఏవి?**

AI ఆధారిత యంత్రానువాద వ్యవస్థలు తెలుగులో అధిక నాణ్యతతో పనిచేయాలంటే అనేక అంశాలను మెరుగుపరచాల్సి ఉంటుంది. ప్రస్తుతం గూగుల్ ట్రాన్స్లేట్ , మైక్రోసాఫ్ట్ ట్రాన్స్లేటర్, AI4Bharat లాంటివి తెలుగు భాషకు మద్దతు ఇస్తున్నాయి. అయితే, ఇప్పటికీ అనేక సవాళ్ళు ఉన్నాయి, ముఖ్యంగా వ్యాకరణ సమస్యలు, సంధి-సమాస రీతులు, సందర్భానికి అనుగుణంగా అర్థాన్ని మార్చే పదబంధాలు, మరియు సాంస్కృతిక విశేషాలు మొదలైనవి.

తెలుగులో అనువాద నాణ్యత మెరుగుపరిచేందుకు మార్గాలు

1. అధిక నాణ్యత గల డేటా సేకరణ

లి తెలుగు-ఇంగ్లీష్ పెద్ద మౌలిక కోశాలు (కార్పస్) సిద్ధం చేయాలి.

* తెలుగు నుండి ఇంగ్లీష్, ఇంగ్లీష్ నుండి తెలుగు అనువాద నమూనాలు విస్తృతంగా అవసరం.

* IndicNLP, AI4Bharat, OPUS (Open Parallel Corpus), PMIndia Dataset వంటివి ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి కానీ, మెరుగైన, డొమైన్-స్పెసిఫిక్ డేటా అవసరం.

* తెలుగు సాహిత్యం, వార్తలు, అధికారిక పత్రాలు, సంభాషణ డేటాను ఉపయోగించి పెద్ద Parallel Corpus సిద్ధం చేయాలి.

2. భాషా-నిర్దిష్ట మోడల్ల అభివృద్ధి

* ప్రస్తుత LLMలపై తెలుగు-కేంద్రీకృత Fine-Tuning అవసరం.

* Google Translate, DeepL వంటివి ప్రధానంగా Euro-centric data లో ట్రైన్ చేయబడ్డాయి.

* IndicBERT, MuRIL, mBART, XLM-R లాంటి మోడల్స్ తెలుగుపై ప్రత్యేకంగా అనుకూలంగా మార్చాలి.

* సాంస్కృతికంగా అర్థవంతమైన అనువాదాలకు మోడల్స్ను ఫైన్-ట్యూన్ చేయాలి.

ఉదాహరణ: How are you?

గూగుల్ ట్రాన్స్లేట్: "మీరు ఎలా ఉన్నారు?"

తగిన భావవ్యాఖ్య: "మీరు బాగున్నారా?"

* భాషా శైలిని మెరుగుపరిచే కస్టమ్ మోడల్స్

* ఫార్మల్ vs. ఇన్ఫార్మల్ స్టైల్ కోసం ప్రత్యేక మోడల్స్ తయారు చేయాలి.

* ఒకే పదానికి వివిధ అర్థాలు ఉండే సందర్భాలను మోడల్ గుర్తించగలగాలి.

3. యాంత్రిక అనువాదాలకు టెక్నికల్ మెరుగుదల

* Neural Machine Translation (NMT)కి తెలుగు ప్రత్యేక ఫీచర్లు జోడించడం.

* తెలుగు వ్యాకరణంలో సంధులు, సమాసాలు, వాక్య నిర్మాణం వంటి అంశాలను మోడల్ అర్థం చేసుకోవాలి.

* Transformer-based architectures (BERT, T5, mT5) మళ్ళీ ట్యూనింగ్ చేయాలి.

* Subword Tokenization " Byte Pair Encoding (BPE), WordPiece, SentencePiece లాంటివి తెలుగుకు ప్రత్యేకంగా అనుకూలీకరించాలి.

* Context-Aware Translation Models: తెలుగు అనువాదాలు తరచుగా కచ్చితమైన context లేకుండా సరైన అర్థాన్ని ఇవ్వవు. దీన్ని అధిగమించేందుకు document-level translation మోడల్స్ అభివృద్ధి చేయాలి.

4. మానవీయ జోక్యం (Human-in-the-loop Approach)

* Post-Editing by Humans (PEMT) : యాంత్రిక అనువాదాలను మానవులు పరిశీలించి, సరిచేసే వ్యవస్థ అందుబాటులో ఉండాలి. దీని ద్వారా మోడల్లను reinforcement learning ద్వారా మెరుగుపరచవచ్చు.

* User Feedback Mechanisms: అనువాద యంత్రాలు సరైన ఫలితాలు ఇవ్వకపోతే, యూజర్ల అభిప్రాయాన్ని స్వీకరించే విధానం ఉండాలి. Google Translate Community Contributions మాదిరిగా, తెలుగు వాడుకదారులను భాగస్వామ్యం చేయాలి.

5. డొమైన్-స్పెసిఫిక్ అనువాద మోడల్స్ అభివృద్ధి

సాధారణ అనువాద మోడల్స్ అందరికీ సరిగ్గా పనిచేయవు. కాబట్టి, విభిన్న రంగాల కోసం ప్రత్యేక మోడల్స్ అవసరం:

* సాంకేతిక అనువాదం (Technical Translation) - ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, మెడికల్.

* చట్టపరమైన తెలుగు అనువాదం – ప్రభుత్వ పత్రాలు, న్యాయపరమైన విషయాలు.

* సాహిత్య అనువాదం – తెలుగు కవిత్వం, నవలలు, చారిత్రక గ్రంథాలు.

6. కోడ్-మిక్సింగ్ (Code-Mixing) & స్పోకెన్ అనువాదం

తెలుగు-ఇంగ్లీష్ మిశ్రమ భాష (Code-Mixed Language) అనువాద సమస్యలు అధిగమించాలి.

ఉదాహరణ: "This is a good opportunity, right?"

Incorrect: "ఇది ఒక మంచి అవకాశం, కుడా?"

Better: "ఇది మంచి అవకాశం కదా?"

లి సంభాషణ మోడల్స్ (Conversational Models)

Google Assistant & Alexa లాంటి వాయిస్ మోడల్స్ తెలుగులో సహజంగా స్పందించేందుకు మెరుగుపరచాలి.

Spoken Telugu కోసం speech-to-text + context-aware translation మిక్స్ చేయాలి.

7. వికీపీడియా & భాషా మాదిరి డేటాబేస్ల వినియోగం

* తెలుగు వికీపీడియా డేటా, తెలుగు వార్తా పత్రికలు, బహుళ భాషా టెక్స్టను మోడల్స్ ట్రైనింగ్లో ఉపయోగించాలి.

* Parallel Corpus లేని స్థితిలో, అనేక భాషా వాక్యాలను సంకలనం చేసి, మానవ అనువాదంతో పంచుకునే విధానం (crowdsourcing datasets) అభివృద్ధి చేయాలి.

**8. కృత్రిమ మేధ ద్వారా సాహిత్యంలో ఏ మార్పులు వస్తున్నాయని మీరు భావిస్తున్నారు?**

కృత్రిమ మేధ (AI) ఆధారంగా సాహిత్యం విస్తృతమైన మార్పులను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ప్రతిలిపి, మనతెలుగుకథలు.కామ్ వంటి వెబ్సైట్లు, కిండిల్ డైరెక్ట్ పబ్లిషింగ్ (KDP), AI ఆధారిత రచనల ద్వారా కొత్త కథలు తయారు చేయడంలో పెరుగుతున్న ట్రెండ్ను చూస్తున్నాం.

ఇది ఇప్పటికి చిన్న స్థాయిలో ఉన్నప్పటికీ, భవిష్యత్తులో, AI కథలు రచించడం, కవిత్వం సృష్టించడం, నాటకాలు, నవలలు, స్క్రిప్టులు వంటి ప్రక్రియల్లో పెద్ద స్థాయిలో విరివిగా ప్రవేశించనుంది. అయితే, ఈ మార్పుల వల్ల సృజనాత్మకత, మానవ రచయితల పాత్ర, సాహిత్య నాణ్యత పై ఏ విధమైన ప్రభావం ఉంటుందనే దానిపై అనేక చర్చలు కొనసాగుతున్నాయి.

AI ఆధారిత కథారచన & కవిత్వం

* GPT-4, Gemini, Claude, LLaMA లాంటి మోడల్స్ ఆధారంగా కథలు, పద్యాలు, కథనాలు రూపొందించగలుగుతున్నాయి.

* AI రచనలు వేగంగా తయారవుతున్నాయి, కానీ అవి భావప్రకటనలో లోపించేవి, మానవ అనుభవాన్ని పూర్తిగా ప్రతిబింబించలేవు.

* తెలుగు వెబ్సైట్లలో AI-రచించిన కథలు మానవ రచయితలతో పోటీ పడుతున్నాయి.

ఉదాహరణ:

* AI ఒక కథను 5 సెకన్లలో సృష్టించగలదు.

* అదే కథను ఒక రచయిత 2-3 గంటలు ఖర్చు చేసి రాస్తాడు.

* కానీ AI కథలలో మౌలికత తగ్గిపోతుంది, మానవ అనుభవాల లోతు ఉండదు.

వ్యక్తిగతీకరించిన నవలలు

* AI వ్యక్తిగత అభిరుచికి అనుగుణంగా ఓదార్పు కథలు, వ్యక్తిగత కథనాలు రూపొందించగలదు.

* ఉదాహరణకు, మీరు స్పష్టంగా ప్లాట్ ఇచ్చినట్లయితే, AI పూర్తిస్థాయి నవలను సృష్టించగలదు.

* కొన్ని కథల వెబ్సైట్లు AI ద్వారా రచయితల శైలిని అనుకరించి కొత్త కథలు రూపొందిస్తున్నాయి.

ఉదాహరణ:

* మీరు చెప్తే: "నాకు ఓ హారర్ థ్రిల్లర్ కావాలి, అర్ధరాత్రి వానలో ఓ ఇంట్లో జరిగే కథగా ఉండాలి."

* AI వెంటనే కథను రూపొందించగలదు.

* దీని వల్ల నవల రచన విధానం పూర్తిగా మారిపోతోంది.

AI ఆధారంగా రచయితల పని తీరు & పుస్తక ప్రచురణ మార్పులు

* గతంలో రచయితలు మంచి ప్లాట్, కథన మోడలింగ్, భాషా నైపుణ్యాలు అవసరమయ్యేవి.

* ఇప్పుడు AI సహాయ రచయిత (Co-Author)గా మారింది.

* AI మద్దతుతో రచయితలు తమ రచనా శైలిని మెరుగు పరచుకోవచ్చు.

* కిండిల్ Direct Publishing (KDP)లో AI-రచించిన పుస్తకాలు పెరుగుతున్నాయి.

* కొన్ని రచయితలు AI ఆధారంగా ప్రాథమిక రచన చేయించి, దానిని మెరుగుపరచి, ప్రచురిస్తున్నారు.

తెలుగు సాహిత్యంలో కొత్త పుంతలు తొక్కుతున్న AI ప్రస్తుత స్వభావం

(a) ప్రతిలిపి, కథల వెబ్సైట్ల ప్రభావం

* ప్రస్తుతం AI నేటివ్ తెలుగు రచయితల శైలిని అనుకరించే స్థాయికి రాలేదు, కానీ భవిష్యత్తులో ఇదే మార్పు గణనీయంగా ఉండొచ్చు.

* ప్రతిలిపి & మన తెలుగు కథలు లాంటి తెలుగు వెబ్సైట్లు AI జెనరేటెడ్ కథలతో మానవ రచయితల కథలను పోటీగా మారుస్తున్నాయి.

* కొందరు రచయితలు AIని ఉపయోగించి వేరే పేర్లతో కథలు ప్రచురిస్తున్నారు.

(b) కాపీరైట్ & హక్కుల సమస్యలు

* AI అవే కథలను, పదబంధాలను, వాక్య నిర్మాణాలను మళ్ళీ మళ్ళీ ఉపయోగించే ప్రమాదం ఉంది.

* AI-రచించిన రచనలపై మానవ రచయితలకు హక్కులు దక్కుతాయా? అనేది పెద్ద చర్చ.

ప్రయోజనాలుజి

* * రచయితలకు సాయం: కథల ప్లాట్, ఐడియాలు త్వరగా అందించగలదు.

* * సాహిత్య లభ్యత పెరుగుతుంది: తెలుగు లో AIద్వారా పుస్తకాలు వేగంగా ప్రచురించవచ్చు.

* * వ్యక్తిగతీకరించిన కథలు: User-Defined కథలు తయారు చేయవచ్చు.

* * పాత సాహిత్యం డిజిటైజేషన్: AI ఆధారంగా పాత తెలుగు పుస్తకాలు OCR చేసి, ప్రచురించవచ్చు.

పరిమితులు

* * కథల లోతు తగ్గిపోతుంది: భావోద్వేగ పరంగా మానవీయ అనుభవం తగ్గిపోతుంది.

* * సృజనాత్మకత తగ్గిపోవచ్చు: రచయితలు AIపై పూర్తిగా ఆధారపడే ప్రమాదం.

* * కాపీరైట్ సమస్యలు: మానవ రచయితల రచనలను AI కాపీ చేసే ప్రమాదం.

* * మానవ రచయితల ఉద్యోగ భద్రత: AI కథలు పెరిగితే, కొత్త రచయితలకు అవకాశాలు తగ్గొచ్చు.

భవిష్యత్తులో AI & తెలుగు సాహిత్యం – నేను భావిస్తున్న మార్పులు

AI సహాయంతో రచయితల శైలి మెరుగుదల

* తెలుగు రచయితలు AIని సహాయ సాధనంగా ఉపయోగించుకుని, తమ కథన శైలిని మెరుగుపరచుకోవచ్చు.

* ఉదాహరణకు, కథల కోసం AIసూచనలను తీసుకొని, వాటిని మార్చి మెరుగుపరిచే విధానం ఉపయోగించాలి.

కాపీరైట్ రక్షణ AI రచనలు గుర్తించే టూల్స్ అవసరం

* తెలుగు రచయితలకు AIకథలపై తమ హక్కులను పరిరక్షించే చట్టాలు అవసరం.

* AI రాసిన రచనలను గుర్తించి ఏరే టూల్స్ అవసరం.

కృత్రిమ మేధ అనుకరించలేని "తనదైన మానవీయ శైలి"

* మనం AI నుంచి మన కథనాల్లో ప్రత్యేకమైన మానవీయ భావోద్వేగాలను నిలుపుకోవాలి.

* జీవిత అనుభవం, మానవీయ భావోద్వేగం, లోతైన భావావేశాలు – ఇవి AIకి పూర్తిగా సాధ్యం కాదు.

భవిష్యత్తులో AI–రచయితల అనుసంధానం

* AI రచనలు "సహాయక రచనలు" (Co-Written Stories) గా మార్చడం మంచిది.

* AI కథలు మానవ రచయితల పరిశీలన & కంటెంట్ రిఫైన్ తర్వాత ప్రచురించే విధానం పెరగాలి.

8. తెలుగు సాహిత్యంలో AI సహాయంతో కొత్త ప్రక్రియలు అభివృద్ధి చేయవచ్చా?

తెలుగు సాహిత్యంలో AI సహాయంతో కొత్త ప్రక్రియలు నిస్సందేహంగా అభివృద్ధి చేయవచ్చు. ఇక్కడ కొన్ని అవకాశాలు:

అ. AI సహ–రచనలు: మానవ రచయితలు AI తో కలిసి కథలు, నవలలు, కవితలు సృష్టించవచ్చు. AI ప్రారంభిక ఆలోచనలు అందించగా, రచయిత వాటిని మెరుగుపరచవచ్చు.

ఆ. ప్రాచీన తెలుగు సాహిత్య పునరుద్ధరణ: పాత గ్రంథాలను, పాడైపోయిన రచనలను AI పునర్నిర్మించి, ఆధునిక పాఠకులకు అందించవచ్చు.

ఇ. సంభాషణాత్మక సాహిత్యం: పాఠకులు సజీవంగా పాల్గొనగలిగే, వారి ఎంపికల ప్రకారం కథ మారే సాహిత్యం సృష్టించవచ్చు.

ఈ. ప్రాంతీయ యాసల సంరక్షణ: వివిధ తెలుగు యాసలు, నుడికారాలను AI భద్రపరచి, వాటిని కొత్త రచనలలో ఉపయోగించవచ్చు.

ఉ. సాహిత్య విశ్లేషణలు: తెలుగు సాహిత్యాన్ని AI ద్వారా విశ్లేషించి తెలుగు సాహిత్య చరిత్రలో కొత్త ప్యాటర్నులు, పోకడలు కనుగొనవచ్చు.

ఊ. అనువాద సాహిత్యం: విశ్వ సాహిత్యాన్ని సమర్థవంతంగా తెలుగులోకి, తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషలలోకి అనువదించవచ్చు.

ఋ. క్రాస్–మీడియా స్టోరీటెల్లింగ్: కథలను టెక్స్ట్, ఆడియో, విజువల్ కంటెంట్ మిశ్రమంగా సృష్టించే నవీన ప్రక్రియలు.

ౠ. పాఠకానుగుణ సాహిత్యం: పాఠకుడి ఆసక్తులు, వయసు, చదివే సమయం ఆధారంగా మారుతూ ఉండే వ్యక్తిగతీకరించిన సాహిత్యం.

* డేటా–ఆధారిత కథనాలు: వాస్తవ డేటాపై ఆధారపడిన సృజనాత్మక రచనలు, సామాజిక అంశాలపై అవగాహన పెంచేవి.

* వర్చువల్ రియాలిటీ సాహిత్యం: సాంప్రదాయిక పుస్తకాలకు మించి, అనుభవాత్మక తెలుగు సాహిత్యాన్ని సృష్టించవచ్చు.

అయితే, ఈ కొత్త ప్రక్రియలు అభివృద్ధి చేయడంలో సవాళ్లు కూడా ఉన్నాయి. తెలుగు భాషా సౌందర్యం, సాంస్కృతిక సందర్భాలు, సామాజిక విలువలు సంరక్షించబడేలా జాగ్రత్త వహించాలి. మానవ రచయితలు,

భాషావేత్తలు, సాంకేతిక నిపుణుల సహకారంతో ఈ సవాళ్లను అధిగమించి, తెలుగు సాహిత్యాన్ని నూతన శిఖరాలకు తీసుకువెళ్లవచ్చు.

**9. కథలు, కవిత్వం, వ్యాస రచనల్లో AI ఉపయోగించడం వల్ల సృజనాత్మకతకు నష్టం కలుగుతుందా?**

AI ఏ స్థాయిలో సమాజంలోకి చొచ్చుకు పోయిందంటే AI లేకుండా మన చుట్టూ జరిగే ఏ పనీ ప్రభావితం కాకుండా ఉండలేదు. సృజనాత్మక కాల్పనిక రచనల విషయంలో ముఖ్యంగా AI పూర్తి స్థాయిలో కథలు, కవితలు, వ్యాసాలు, నవలలు రాసేయగలదు. మనం ఒక అంశం ఇచ్చి, నేపథ్యం ఇచ్చి, పాత్రల పేర్లిచ్చి, ఎల్ఎల్ఎమ్ కి ఇస్తే అది వెంటనే క్షణాల్లో మనకు కావాల్సిన ప్రక్రియలో, కావాల్సిన జాన్రాలో రచ్నలు చేసిస్తోంది. అందువల్ల కచ్చితంగా AI రచనలు సృజనాత్మకతకు నష్టం కలిగిస్తాయి. అలాంటి రచనలన్నీ అప్పటికే AI ట్రెయిన్ అయిన శైలిలో రాయగలవు. కొన్ని శైలుల మిశ్రమంగా కూడా రచనలు రావచ్చు, కానీ అప్పటికే ట్రెయిన్ అవ్వని శైలిలో AI రచనలు చేయడం ప్రస్తుతం కష్టమే. ఆ విధంగా AI ట్రెయిన్ అవ్వని శైలిలో రాయగలిగే రచయితల విశిష్ట రచనలకు ఆదరణ ఉంటె, అలాంటి రచనలకు సమీప భవిష్యత్తులో ప్రమాదం ఉండకపోవచ్చు. మరో పక్కన చూసుకుంటే ప్రతి కాలంలో రచయితలు తమ రచనలను త్వరితంగా పూర్తి చేసేందుకు పూర్తిగా వారి ఆలోచనలపై ఆధారపడకుండా, అంతకు ముందు రాసిన రచయితల రచనల మీద ఆధార పడినట్లు, పదాల కోసం నిఘంటువులు, గ్రంథాలు ప్రాసపద నిఘంటువులు చూసుకున్నట్లు, వ్యాకరణం సరి చూసుకునేందుకు వ్యాకరణకర్త సహాయం తీసుకున్నట్టుగానే AI అందించే సహాయక పనిముట్లను, అనువర్తనాలను వాడుకోవచ్చు. రచయితకు ఆలోచనలను మసకబారితే AI నుంచి సూచనలు తీసుకోవచ్చు. వ్యాకరణం, శైలి సరిచేయడం, లేదా సాధారణ డ్రాఫ్టు తయారు చేయడంలో AI సహాయం చేయడం వల్ల రచయితలు తమ సృజనాత్మక శక్తిని కథనం లేదా భావోద్వేగ లోతును పెంచడంపై ఎక్కువగా కేంద్రీకరించవచ్చు.

మరో పక్క ముందు చెప్పుకున్నట్లు AIని పూర్తిగా రచనలు చేయడానికి ఉపయోగిస్తే, రచయితల వ్యక్తిగత ఆలోచనలు, భావోద్వేగాలు లేదా అనుభవాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇది రచనలను యాంత్రికంగా, జీవం లేకుండా చేయవచ్చు. AI డేటా ఆధారంగా పనిచేస్తుంది కాబట్టి, అది ఇప్పటికే ఉన్న రచనలను అనుకరించే అవకాశం ఉంది. ఇది సృజనాత్మకతలో వైవిధ్యాన్ని తగ్గించి, ఒకే తరహాలో మూసపోసినట్లుండే రచనలకు దారితీయవచ్చు. కథలు లేదా కవిత్వంలో మానవ అనుభవం, సాంస్కృతిక నేపథ్యం, సూక్ష్మ భావోద్వేగాలు చాలా ముఖ్యం. AI ఈ లోతును పూర్తిగా అర్థం చేసుకోలేకపోవచ్చు, ఫలితంగా రచనలు పైపై భావాలకే పరిమితమై రచనలు చప్పగా మిగిలిపోవచ్చు.

**10. తెలుగు సాహిత్యంలో AI ఉపయోగించి మీకు ఆకర్షణీయంగా అనిపించిన ఏదైనా ప్రాజెక్ట్ ఉందా?**

grok అని ఇటీవల ఎక్స్ (ట్విట్టర్) ద్వారా ఎలాన్ మస్క్ ప్రవేశపెట్టిన పెద్ద భాషా మోడల్ ఇంతకు ముందు మోడళ్ళతో పోల్చుకుంటే చాలా సహజంగా సంభాషణలు చేస్తోంది. Claude AI, Deepseek తెలుగు రచనలు చేస్తున్నపుడు కొన్ని కొత్త పదాలను చొప్పిస్తున్నాయి. మనం ఇంతకు వాడని రూపంలో సకారాత్మకంగా క్రియారూపాలను ఇస్తోంది. రోజు రోజుకీ మరింత ఆకర్షణీయమైన ప్రాజెక్టులు మన ముందుకు వస్తున్నాయి.

**11. కృత్రిమ మేధ ద్వారా భాషలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాన సవాళ్లు ఏమిటి?**

కృత్రిమ మేధ (AI) ద్వారా భాషలను ముందుకు తీసుకెళ్ళడం అనేది భాషాభివృద్ధి, సంరక్షణ, అనువాదం, విస్తరణలో అనేక అవకాశాలను అందిస్తుంది. అయితే, ఈ ప్రక్రియలో కొన్ని ప్రధాన సవాళ్ళు ఎదురవుతాయి:

1. డేటా పరిమితులు: AI భాషా మోడళ్ళు ట్రెయినింగ్ కోసం పెద్ద మొత్తంలో డేటాపై ఆధారపడతాయి. అయితే, తక్కువ వనరులు కలిగిన భాషలు (low-resource languages) లేదా అరుదైన యాసలకు సంబంధించిన డేటా తక్కువగా లేదా అసలు లేకపోవడం ఒక పెద్ద సవాలు. ఉదాహరణకు, తెలుగు భాష, ఉత్తరాంధ్ర యాసలో డిజిటల్ కంటెంట్ పరిమితంగా ఉండటం వల్ల AI ఆ భాషను పూర్తిగా అర్థం చేసుకోవడం కష్టమవుతుంది.

2. సాంస్కృతిక సూక్ష్మతలు: భాష కేవలం పదాల సమూహం మాత్రమే కాదు. అది సంస్కృతిని, సంప్రదాయాలను, భావోద్వేగాలను ప్రతిబింబిస్తుంది. AIకి ఈ సూక్ష్మతలను గుర్తించడం, వాటిని రచనల్లో లేదా అనువాదాల్లో పొందుపరచడం సవాలుగా ఉంది.

ఉదాహరణకు, ఒక సామెత లేదా స్థానిక వ్యక్తీకరణను AI సరిగ్గా అనువదించలేకపోవచ్చు, దాని అసలు అర్థం కోల్పోవచ్చు.

3. అనువాదంలో కచ్చితత్వం: భాషల మధ్య వ్యాకరణ నిర్మాణం, శైలి, మరియు సందర్భం చాలా భిన్నంగా ఉంటాయి. AI అనువాదాలు తరచూ యాంత్రికంగా లేదా అసహజంగా అనిపించవచ్చు, ముఖ్యంగా సాహిత్య రచనలు లేదా కవిత్వంలో. ఉదాహరణకు, తెలుగు నుండి ఆంగ్లంలోకి ఒక కవితను అనువదించేటప్పుడు దాని నడక లేదా భావ లోతు కోల్పోయే అవకాశం ఉంది.

4. భాషా ఏకరీతి ప్రమాదం: AI ఎక్కువగా ప్రధాన భాషలైన ఆంగ్లం, చైనీస్, స్పానిష్ వంటి వాటిపై దృష్టి పెడుతుంది. దీని వల్ల చిన్న భాషలు లేదా స్థానిక యాసలు వెనుకబడిపోయి, ఏకరీతి భాషా సంస్కృతి ఏర్పడే ప్రమాదం ఉంది.

5. సాంకేతిక మరియు ఆర్థిక అవరోధాలు: AI భాషా సాధనాలను అభివృద్ధి చేయడానికి అధిక సాంకేతిక వనరులు, నిపుణులు, మరియు ఆర్థిక సహకారం అవసరం. అన్ని భాషా సమూహాలకు ఈ వనరులు సమానంగా అందుబాటులో ఉండవు, దీనివల్ల అసమానతలు తలెత్తుతాయి.

6. నైతిక సమస్యలు: AI ద్వారా భాషా కంటెంట్ సృష్టించడంలో రచయితల గుర్తింపు, కాపీరైట్ సమస్యలు ఎదురవుతాయి. ఉదాహరణకు, AI ఒక రచయిత శైలిని అనుకరిస్తే, అది ఆ రచయిత సృజనాత్మక హక్కులను ఉల్లంఘించవచ్చు.

ఈ సమస్యలను అధిగమించడానికి AI అభివృద్ధిలో భాషా నిపుణులు, స్థానిక సమాజాలు, మరియు సాంకేతిక నిపుణుల సహకారం అవసరం. ఈ సమతులంతోనే AI భాషల వైవిధ్యాన్ని సంరక్షిస్తూ, వాటిని సమృద్ధిగా ముందుకు తీసుకెళ్ళగలదు.

**12. AI ఆధారిత సాహిత్య రచనకు నైతిక పరిమితులు ఉంటాయా?**

AI ఆధారిత సాహిత్య రచనకు నైతిక పరిమితులు (Ethical Constraints) అనేవి ఉంటాయి. ముఖ్యంగా క్రింది అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి:

1. ఒరిజినాలిటీ & నకలుహక్కులు

* AI రూపొందించిన రచన అసలు సృజనాత్మక సాహిత్య సృష్టిగా పరిగణించాలా?

* ఇప్పటికే ఉన్న రచనల ఆధారంగా AI ఉత్పత్తి చేసే కంటెంట్ మౌలికత కోల్పోయిందా?

* AI మోడళ్ళు పెద్ద మొత్తంలో డేటా నుంచి ట్రైనింగ్ పొందే క్రమంలో రచయితల హక్కులను ఉల్లంఘిస్తున్నాయా?

2. ప్రామాణికత & రచయిత పాత్ర

* AI రచనలు మానవ రచయితల కంటే తక్కువ విలువైనవిగా పరిగణించాలా?

* రచనను మానవుడు సవరించకపోతే అది నమ్మదగినదిగా పరిగణించలామా?

* సాహిత్య రచనలో భావోద్వేగాల పాత్రను AI పూర్తిగా రిప్లేస్ చేయగలదా?

3. నైతిక బాధ్యత

* AI తప్పుడు సమాచారం అందించినప్పుడు దానికి బాధ్యుడు ఎవరు?

* ఏదైనా వివాదాస్పద లేదా ద్వేషపూరిత కంటెంట్ ఉత్పత్తి చేసినప్పుడు దానిపై నియంత్రణ ఎవరికి ఉంటుంది?

4. సాంస్కృతిక ప్రాముఖ్యత

* AI మోడళ్ళను శిక్షణ ఇచ్చే డేటా ఒక నిర్దిష్ట సాంస్కృతిక నేపథ్యంలో ఉంటే, అవి భిన్న సంస్కృతులను సమర్థంగా ప్రతిబింబించగలవా?

* స్థానిక భాషలు, సాహిత్య రూపాలను AI పూర్తిగా అర్థం చేసుకోగలదా?

5. రచయితల జీవనోపాధి

* AI వల్ల సాహిత్యరచయితలు తమ ఉపాధిని కోల్పోతారా?

* మానవ రచయితలు AI రచనలతో పోటీ పడేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలా?

**13. వికీపీడియా, వికీసోర్స్, వికీడేటా వంటి ప్రాజెక్టుల్లో AI సహాయం ఎలా ఉపయోగపడుతుందని మీరు భావిస్తున్నారు?**

వికీపీడియా, వికీసోర్స్, వికీడేటా లాంటి ప్రాజెక్టుల్లో AI సహాయం విస్తృతంగా ఉపయోగపడే అవకాశముంది. వికీపీడియాలో, ప్రత్యేకంగా చిన్న భాషల కోసం, AI కనీస పునాది సమాచారాన్ని సేకరించి వ్యాసాలను స్వయంచాలకంగా రూపొందించడంలో సహాయపడుతుంది.

పాఠ్యశుద్ధి (spell check), వ్యాకరణ పరిశీలన, యాంత్రిక అనువాదం లాంటి పనుల ద్వారా విషయ సమాచార నాణ్యతను మెరుగుపరచడానికి AI ఉపయోగపడుతుంది. అలాగే, చరిత్ర, భౌగోళిక సమాచారం, విజ్ఞాన శాస్త్ర సంబంధిత అంశాలను విశ్వసనీయ మూలాల ఆధారంగా తార్కికంగా సమీకరించేందుకు AI ఉపకరిస్తుంది.

వికీసోర్స్లో, AI పాత గ్రంథాలను డిజిటైజ్ చేయడంలో, ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ (AI) సాంకేతికత ద్వారా వాటిని టెక్స్ట్ ఫార్మాట్లోకి మార్చడంలో సహాయపడుతుంది. శాస్త్ర గ్రంథాలు, పురాతన పత్రాలు, ప్రాచీన గ్రంథాలను క్రమబద్ధీకరించి విపులీకరించడంలో AI తోడ్పడుతుంది.

వికీడేటాలో, AI ద్వారా పెద్ద మొత్తంలో డేటాను విశ్లేషించి, కొత్త నెట్వర్క్లు కనుగొనడం, డేటా నిల్వలను అప్డేట్ చేయడం, డూప్లికేట్ లేదా తప్పులున్న డేటాను గుర్తించి సరిచేయడం సాధ్యమవుతుంది. వికీడేటా ఆధారంగా వివిధ భాషల్లో సమాచారాన్ని సమర్థంగా విభజించేందుకు AI ఉపయోగపడుతుంది.

**14. భవిష్యత్తులో AI వల్ల మన సాహిత్య ధోరణులు ఎలా మారుతాయి?**

భవిష్యత్తులో AI ప్రభావంతో సాహిత్య ధోరణులు గణనీయంగా మారనున్నాయి. ముఖ్యంగా, AI ఆధారిత రచనాపద్ధతులు కొత్త ప్రయోగాలకు దారితీసే అవకాశం ఉంది. కవిత్వం, కథలు, నవలలు వంటి సాహిత్యరూపాల్లో AI కొత్త మార్గాలను సూచించగలదు. ఉదాహరణకు, AI మోడళ్లను శిక్షణ ఇచ్చే విధానాన్ని బట్టి, సాహిత్యంలో కొత్త శైలులు, అసాధారణమైన కథన నిర్మాణాలు ఉద్భవించవచ్చు.

మౌలికత (originality) విషయంలో, AI రచనలు మానవ సృజనాత్మకతను పూర్తిగా భర్తీ చేయకపోయినా, సహాయక పాత్ర వహించగలదు. రచయితలు తమ కథనాలను మెరుగుపరిచేందుకు, కొత్త ప్రేరణ పొందేందుకు AIను ఉపయోగించుకోవచ్చు. ముఖ్యంగా, ప్లాట్ నిర్మాణం, పాత్రల స్వభావ విశ్లేషణ, చారిత్రిక నేపథ్యాల పరిశోధన వంటి అంశాల్లో AI తోడ్పడే అవకాశముంది.

AI ఆధారంగా అనువాద సాహిత్యానికి కూడా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటికే యాంత్రిక అనువాద వ్యవస్థలు తక్షణ అనువాదాలను అందిస్తున్నా, భవిష్యత్తులో AI ఆధారంగా మరింత సున్నితమైన, భాషా సౌందర్యాన్ని పునరుత్పత్తి చేయగల అనువాద విధానాలు అభివృద్ధి చెందతాయి. దీని ద్వారా ప్రాంతీయ భాషల సాహిత్యం ప్రపంచ స్థాయిలో మరింత అందుబాటులోకి రావచ్చు.

అదనంగా, AI ఆధారంగా వ్యక్తిగతీకరించిన కథలు (personalized storytelling), ఇంటరాక్టివ్ ఫిక్షన్ (interactive fiction) వంటి కొత్త సాహిత్యరూపాలు ప్రాచుర్యం పొందే అవకాశం ఉంది. పాఠకుల అభిరుచులను బట్టి కథలను మార్చగల వ్యవస్థలు అభివృద్ధి కావడంతో, సాహిత్యం మరింత డైనమిక్గా మారుతుంది.

సమస్యాత్మకంగా, AI ఆధారిత రచనల వల్ల సాహిత్య మౌలికత్వం తగ్గిపోవచ్చనే ఆందోళన కూడా ఉంది. సృజనాత్మకతకు స్వేచ్ఛ తగ్గి, AI ద్వారా ఉత్పత్తి అయ్యే సాహిత్యం ఒకే విధమైన ఫార్మాట్ను అనుసరించే ప్రమాదం ఉంది. దీన్ని నివారించేందుకు, AI ను ఒక సాధనంగా ఉపయోగించుకుని, మానవీయ భావోద్వేగాలతో కూడిన సాహిత్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

మొత్తంగా, భవిష్యత్తులో AI వల్ల సాహిత్య ధోరణులు కొత్త మార్గాల్లో అభివృద్ధి చెందుతాయి. అయితే, మానవ రచయితల ప్రత్యేకత, భావోద్వేగాలు, మౌలికత మరింత ముఖ్యమైనదిగా మారుతాయి. AI ను ఒక సాధనంగా ఉపయోగించి, సాహిత్యాన్ని విస్తరించే దిశగా పరిగణించడం ఉత్తమ మార్గం.

**15. కృత్రిమ మేధ ఆధారిత టూల్స్ భాషా ప్రేమికులు, రచయితలు ఉపయోగించుకోవడం అవసరమా?**

కృత్రిమ మేధ ఆధారిత టూల్స్ను భాషా ప్రేమికులు, రచయితలు ఉపయోగించుకోవడం సమర్థవంతమైన నిర్ణయం. ఇవి రచనలో సహాయపడటమే కాకుండా, కొత్త ప్రక్రియలను అన్వేషించేందుకు మార్గం చూపుతాయి. నిఘంటువులు, వ్యాకరణ పరీక్షకాలు, పదప్రయోగ సూచనలు వంటి టూల్స్ ద్వారా భాషా నైపుణ్యం పెరుగుతుంది. అంతేకాకుండా, AI ఆధారిత అనువాద వ్యవస్థలు భాషాంతర సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి, ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు ఉపయోగపడతాయి. కథల రూపకల్పన, పాత్రల విశ్లేషణ, శైలి మెరుగుదల వంటి అంశాల్లో కూడా AI తోడ్పడుతుంది. అయితే, ఈ టూల్స్పై పూర్తిగా ఆధారపడడం సృజనాత్మకతను తగ్గించే ప్రమాదం ఉంది. AI రూపొందించే రచనలు మానవ భావోద్వేగాలను సంపూర్ణంగా ప్రతిబింబించలేవు, భాషా

నైపుణ్యాన్ని పరిమితి చేసే అవకాశం ఉంది. పైగా, కొన్ని సందర్భాల్లో ఈ టూల్స్ తప్పుదారిపట్టించే సమాచారాన్ని అందించవచ్చు. అందుకే, AIను ఒక ఉపకరణంగా ఉపయోగించుకోవాలిగానీ, సాహిత్య సృజనలో మానవీయతను కోల్పోకుండా ఉండటం ముఖ్యం.

**16. భాషా అభివృద్ధికి AI, మానవ కృషి రెండింటిలో ఏది ముఖ్యమైనది?**

భాషా అభివృద్ధికి AI, మానవ కృషి రెండూ సమానంగా ప్రాధాన్యత కలిగి ఉన్నాయి, ఎందుకంటే భాష అనేది ఒకే ఒక్క అంశంపై ఆధారపడే ప్రక్రియ కాదు. ఇది సహజ అభివృద్ధి, సాంకేతిక పురోగమనం, సృజనాత్మకత, వినియోగం లాంటి అనేక కారకాలకు సంబంధించినది. మానవ కృషి ద్వారా భాష లోతుగా అభివృద్ధి చెందుతుంది, సాహిత్యం, కవిత్వం, కొత్త పదప్రయోగాలు, సాంస్కృతిక విభిన్నతలతో భాష విస్తరిస్తుంది. మానవుల భావోద్వేగాలు, వ్యక్తిగత అనుభవాలు, భాషా సౌందర్యం వంటి అంశాలు మనుషుల సహజ నైపుణ్యంతో మాత్రమే అందించగలము. AI ద్వారా భాషాపరమైన పరిశోధన వేగవంతమవుతుంది, వివిధ భాషల అనువాదం, స్వయంచాలక నిఘంటువుల తయారీ, వ్యాకరణం సరిచేయడం, డిజిటల్ సాధనాల ద్వారా భాష వినియోగాన్ని పెంచడం వంటి అవకాశాలు కలుగుతాయి. అయితే, మానవ కృషికి పరిమితులు ఉన్నాయి. భాషాభివృద్ధి సుదీర్ఘ ప్రక్రియగా ఉండటంతో, మానవ శక్తితో మాత్రమే దీనిని వేగంగా విస్తరించడం కష్టం. అదే సమయంలో, AI అభివృద్ధి చెందినా, అది మానవీయ భావోద్వేగాలను, సాంస్కృతిక సున్నితత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోవడం దాని పరిమితి. అందువల్ల, భాషాభివృద్ధిలో AI ఒక సాధనంగా ఉండగా, మానవ కృషి దానికి మౌలిక దిశను నిర్దేశిస్తుంది. రెండింటి సమన్వయంతోనే భాష బలపడుతుంది, విస్తరిస్తుంది, కొత్త మార్గాలను అన్వేషిస్తుంది.

**17. భవిష్యత్ భాషా ప్రగతికి మీ సూచనలు, ఆలోచనలు ఏమిటి?**

భవిష్యత్తులో తెలుగు భాషా ప్రగతికి, ప్రపంచంలోని ఇతర ప్రముఖ భాషలతో సమానంగా దాని అభివృద్ధిని సాధించాలంటే, విస్తృతమైన వాడకాన్ని పెంచడంతో పాటు, మౌలిక భాషా వనరుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి. తెలుగువారు అన్ని మాధ్యమాల్లో అంతటా తెలుగు వాడకాన్ని పెంచుకోవాలి. వారి మొబైల్ ఫోన్ల అంతరవర్తిని (ఇంటర్ఫేస్)ని తెలుగులోకి మార్చి వాడుకోవాలి. ఆపైన సాంకేతిక భాషాశాస్త్రవేత్తలు రావాలి. వారు మౌలిక భాషా వనరులను తయారు చెయ్యాలి.  ముఖ్యంగా, పెద్ద పరిమాణంలో అనోటేటెడ్ కార్పస్ను నిర్మించడం అత్యవసరం, ఎందుకంటే ఇది మెషిన్ లర్నింగ్, న్యూరల్ నెట్వర్క్, ఆచరణాత్మక సహజ భాషా ప్రక్రియల అప్లికేషన్ల అభివృద్ధికి ఉపయోగపడుతుంది.

తెలుగు వాక్య నిర్మాణం, వ్యాకరణం, భాషా శైలి, నిఘంటువుల సమాచారంతో కూడిన విస్తృత డేటాసెట్లు రూపొందించాలి. ప్రామాణిక తెలుగు టెక్స్ట్ కార్పస్ను రూపొందించేందుకు వికీసోర్స్, ఇంటర్నెట్ ఆర్కైవ్, గుటెన్బర్గ్ ప్రాజెక్ట్, ఇతర స్వేచ్ఛా మూల వనరుల నుంచి డేటాను సమీకరించి, తగిన శుద్ధీకరణ, ట్యాగింగ్ చేయడం అవసరం. అలాగే, తెలుగు భాషా శబ్ద సంపదను పరిరక్షించేందుకు, పలుకుబడి, భాషా భేదాలు, మాండలిక రూపాలను గణాంకపూర్వకంగా డిజిటైజ్ చేసి భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉంచాలి.

ఇందుకు తోడుగా, తెలుగు భాష కోసం  సహజ భాషా అవగాహన (నేచురల్ లాంగ్వేజ్ అండర్స్టాండింగ్ – NLU), సహజ భాషా రచన (నేచురల్ లాంగ్వేజ్ జనరేషన్ – NLG) మొదలైన అభివృద్ధి చేయడానికి పరిశోధనలను ప్రోత్సహించాలి. AI ఆధారంగా తెలుగు భాషా ఉపకరణాలను మెరుగుపరిచేందుకు విశ్వవిద్యాలయాల్లో, పరిశోధనా సంస్థల్లో, స్వతంత్ర డెవలపర్లకు భాషా టెక్నాలజీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

తెలుగు వాడకం పెంచేందుకు, AI సహాయంతో తెలుగు ఇంటర్ఫేస్లను అభివృద్ధి చేయాలి, ముఖ్యంగా గవర్నమెంట్ పోర్టల్స్, విద్యా వ్యవస్థ, స్వతంత్ర మీడియా వంటి రంగాల్లో. ప్రజలు విస్తృతంగా తెలుగు వాడేలా, AI ఆధారంగా తెలుగు టెక్స్ట్ టు స్పీచ్ (TTS), స్పీచ్ టు టెక్స్ట్ (STT) వ్యవస్థలను బలోపేతం చేయాలి. తెలుగు వెబ్ కంటెంట్ను పెంచేందుకు స్వేచ్ఛా మూల వనరులను ప్రోత్సహించాలి, ముఖ్యంగా వికీపీడియా, వికీడేటా, వికీసోర్స్ వంటి ప్రాజెక్టుల ద్వారా తెలుగులో అధిక సంఖ్యలో వ్యాసాలు, పాఠాలు అందుబాటులోకి తీసుకురావాలి.

భాషా ప్రేమికులు, సాంకేతిక నిపుణులు, ప్రభుత్వ సంస్థలు, విద్యార్థులు కలిసి భవిష్యత్తులో తెలుగును అంతర్జాతీయ భాషల సరసన నిలిపేలా అభివృద్ధికి కృషి చేయాలి.

★ రచయిత: పరిశోధక విద్యార్థి, ఓయు T

# గోరటి వెంకన్న పాటలు-అనువాద సమస్యలు-పరిశీలన

ఎస్. పరశురాములు

**సంక్షిప్తి** (Abstract)

ఈ పరిశోధన పత్రం పాటల్లో వచ్చే అనువాద సమస్యలను చర్చిస్తుంది. ఈ అధ్యయనం గోరటి వెంకన్న పాటల అనువాదంపై దృష్టి సారిస్తుంది. గోరటి వెంకన్న తెలంగాణకు చెందిన ప్రసిద్ధ రచయిత, కవి, గాయకుడు. వెంకన్న పాటలు తెలంగాణ ప్రాంత ప్రజల భావోద్వేగాలకు ప్రతిబింబం. అంతేగాక తెలంగాణ సంస్కృతికి ప్రాతినిధ్యం వహిస్తాయి. వెంకన్న పాటలు ప్రజల మనసులపై దీర్ఘకాలిక ముద్రవేస్తాయనడంలో ఆశ్చర్యం లేదు. తెలుగు నుండి ఆంగ్లంలోకి పాటలను అనువదించడంలో వచ్చే సమస్యలను విశ్లేషించడం. లక్ష్యభాషలో తెలంగాణ సంస్కృతి ఎలా ప్రదర్శించబడుతోంది అనేది పరిశీలించడం ఈ అధ్యయన ప్రధాన ఉద్దేశ్యం. గోరటి వెంకన్న పాటల్లో సంగీతం కాకుండా కవిత్వ వ్యక్తీకరణను కూడా కలిగి ఉన్నాయి. గోరటి వెంకన్న రాసి, పాడిన పాటల్లో కొన్ని ఎంపిక చేసిన పాటలను Peter Low చెప్పిన Translation of Songs పాటల అనువాదం సిద్ధాంతం (Low Pentathlon Principles) పెంటాథ్లాన్ సూత్రాల ప్రకారం పరిశీలించాను.

**సాంకేతిక పదాలు** (Key Words): *అనుకరణ, ప్రతిస్థానం సంస్కృతి, ఛందస్సు, లయ, పాట, ప్రాంతం, అనువాద సమస్య,*

## 1. పరిచయం:

గోరటి వెంకన్న, 1964లో తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లాలోని గౌరారం గ్రామంలో జన్మించారు. గోరటి వెంకన్నకు చిన్నప్పటినుంచి పాటలు పాడటం అలవాటుగా ఏర్పడింది. కుటుంబంలో తాత కాశన్న, తండ్రి నరసింహులు భజన పాటలు పాడుతూ ఉండేవారు. పంతులు రాఘవ శర్మ ప్రభావంతో బడిలోనే పద్యాలు, శ్లోకాలు నేర్చుకొని, వాటిని నైపుణ్యంగా పాడేవారు. దాంతో గోరటి వెంకన్నపై కుటుంబీకులు పాడే తత్వాలు, గురువుల బోధనలు అనివార్య ప్రభావం చూపాయి.

గోరటి వెంకన్న తనముందున్న అన్యాయాలు, హింసలను పాటలద్వారా ధైర్యంగా వ్యతిరేకించాడు. కళాశాలలో ప్రగతిశీల ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొంటూ, సమాజంలోని అన్యాయాలను తన పాటల ద్వారా వ్యక్తపరిచాడు. ఆయన పాటలు గ్రామీణ జీవితం, రైతుల కష్టాలు, సామాజిక అన్యాయాలను స్పష్టంగా ప్రతిబింబించి, ప్రజల హృదయాలను తాకేలా ఉంటాయి. గోరటి వెంకన్న అసలు పేరు గోరటి వెంకటయ్య. ప్రజల కష్టసుఖాలు, ప్రపంచీకరణ ప్రభావాలు, ప్రకృతి సౌందర్యం వంటి అంశాలను పాటలుగా మలిచి, ప్రజల అభిమానాన్ని పొందారు. ప్రజల ప్రేమతో వెంకటయ్య పేరు వెంకన్నగా మారి, ఆయన గొప్ప వాగ్గేయకారుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు.

గోరటి వెంకన్న కాలానుగుణంగా తన పాటలను రాస్తూ, సమాజంలోని సమస్యలను ప్రతిబింబించారు. "ఏకునాదం మోత"లో తెలంగాణ కరువు, రైతుల అప్పుల బాధలు, ఆత్మహత్యలు, కులవ్యవస్థపై విమర్శలు కనిపిస్తాయి. "అందుకోర గుతుపందుకో" వంటి పాటలు అగ్రకుల అహంకారాన్ని ప్రశ్నించాయి. "పల్లె కన్నీరు పెడుతుందో" పాట ప్రపంచీకరణవల్ల గ్రామీణ ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులను స్పష్టంగా చూపింది. "రేలపూతలు" లోనూ ఈ అంశాలను వివరించారు. గ్రామీణ బతుకుల చిత్రణను కళ్ళకుకట్టినట్టు తన పాటల ద్వార తెలిపారు. వెంకన్న రచయితగా మాత్రమే కాకుండా, రాజకీయ, సామాజిక ఉ ద్యమాల్లో కూడా కీలకపాత్ర పోషించారు. ఆయనకు 2017లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఇది ఆయన సాహిత్యానికి దక్కిన గొప్ప గౌరవంగా భావించవచ్చు.

## 2. పాట-అనువాదం (Translation of Song):

పాటల అనువాదం అనేది అనేకమందికి ఆసక్తికరంగా కనిపించే ఒక రంగంగా మారింది. అందువల్ల అనువాద అధ్యయనాలలో పరిశోధన చేయాల్సిన అంశంగా తయారైంది. న్యూజిలాండ్ విశ్వవిద్యాలయానికి చెందిన పీటర్ లోవ్, అనువాద అధ్యయనాలలో ప్రముఖ పండితులలో

ఒకరిగా పాటల అనువాదంపై తన వ్యూహాలను విస్తృతంగా వివరించారు. పీటర్ లోవ్ ప్రవేశపెట్టిన పాట అనువాద వ్యూహాలు కింది విధంగా ఉన్నాయి:

1. "అనువాదం": ఇది సాహిత్యాన్ని లక్ష్యభాషకు చాలా దగ్గరగా అనువదించడం. ఇందులో పాట ట్యూన్ సమానంగా లేదా చాలా దగ్గరగా చేయబడుతుంది.

2. "అనుకరణ": ఇందులో సాహిత్యానికి భావనతో కూడిన స్వేచ్ఛా అనువాదం ఉంటుంది. కానీ ట్యూన్ మాత్రం సమానంగా లేదా చాలా దగ్గరగా చేయబడుతుంది.

3. "ప్రతిస్థానం": ఇందులో అసలైన సాహిత్యాన్ని పునరాయోగం చేయడం జరుగుతుంది. అయితే ట్యూన్ మాత్రం సమానంగా లేదా చాలా దగ్గరగా చేయబడుతుంది. దీనిలో మూలపాఠ్యంలోని థీమ్, సందర్భం, నిర్మాణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి.

పాట అనువాదాలు – తాత్కాలిక సిద్ధాంత ప్రాజెక్టు, సినిమా సబ్టైటిలింగ్/సబ్టైటిలింగ్ పనిగా, లేదా పాటల సాహిత్యాన్ని ఉటంకించే ప్రత్యేక ప్రచురణలో భాగంగా ఉండవచ్చు. కానీ, గేయ రచయితలు, గాయకులు, ఒపెరా నిపుణులు, నాటక రచయితలు పాటల అనువాదాలపై క్రమంగా పనిచేస్తుంటారు. ఇటీవలివరకు, పాటల అనువాదాలకు, అనువాద పరిశోధనలో తక్కువ ప్రాధాన్యం లభించింది. దీని కారణాల్లో ఒకటి పాటలను అనువదించే వ్యక్తుల వృత్తిపరమైన గుర్తింపుపట్ల స్పష్టత లేకపోవడం కావచ్చు. ఏదేమైనా, బాణీలు అనేక మార్గాలలో, విభిన్న ప్రయోజనాలకోసం, వివిధ మధ్యవర్తులచే వివరించబడుతున్నది వాస్తవం. ఈ రంగంలో కేంద్రీకృతమైన పరిశోధనకు సముచితమైన కారణంగా ఉంటుంది.

తెలుగు సాహిత్యంలో పాటల అనువాదం చేయడం చాలా తక్కువగా జరుగుతోంది. గోరటి వెంకన్న పాటలను "The Wave of the Crescent" అనే పేరుతో దామోదరచారి, తిరుపతి రెడ్డి Englishలోకి అనువదించారు. గోరటి వెంకన్న సాహిత్యాన్ని, ఆయన భావజాలాన్ని ఇతర భాషల్లోకి అనువదించడం అత్యవసరం.

**3. పాటకి అనువాద సిద్ధాంత కర్తలు ఇచ్చిన నిర్వచనాలు:**

అనువాద సిద్ధాంతకర్తలు పాటకి వివిధరూపాల్లో నిర్వచనాలు ఇచ్చారు. పాటలు సమాజాన్ని ప్రతిబింబించడం మాత్రమే కాక, కొన్ని సందర్భాల్లో సామాజిక మార్పులను సులభతరం చేసే సామాజిక పరిస్థితులను సృష్టిస్తాయి. పాటలు ప్రజలను ఎటువంటి ఆందోళనకు గురిచేసాయో, వారు సమస్యలను ఎలా చూశారో, తమ ఆశలు, ఆకాంక్షలు, నిరాశలను ఎలా వ్యక్తపరిచారో చెప్పడానికి విలువైన వనరులుగా ఉంటాయి.

***"Songs do not consist of just the lyrics and the tune, but also of all the contexts, in which they are created, experienced, produced, and consumed" (Spitzer & Walters 2015, 1).***

***"S. Hallam (2008) refers to a song being, powerful at the level of social group, because it facilitates communication which goes beyond words, enables meanings to be shared, and promotes the development and maintenance of individual, group, cultural and national identities."***

***"K. Kaindl (2005, 235) states that, popular songs are important mass media products through which cultures are articulated and hence communicated to people of different linguistic, historical and cultural backgrounds."***

పైన పేర్కొన్న Kaindl అనే సిద్ధాంతకర్త ప్రజాదరణ పొందిన పాటలు అనువాద పరిశోధనల్లో చాలావరకు నిర్లక్ష్యం చేయబడ్డాయి. పాటల అనువాదం అనేది అనువాద పరిశోధనల్లో పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిన అంశం కాదు, కానీ కవిత్వ అనువాదంవంటి సృజనాత్మక విధానాలు అవసరమైన అనువాదాలతో సరిపోలిస్తే, పాటల అనువాదం అంతగా నిబద్ధంగా అధ్యయనం చేయబడలేదంటాడు.

**4. గోరటి వెంకన్న పాటల అనువాద సమస్యలు, విశ్లేషణ** (Translation of Gorati Venkannas Songs Problems and Analysis):

గోరటి వెంకన్న పాటలను తెలుగులో నుండి ఆంగ్లంలోకి అనువాదం చేయాలంటే అంత సులభతరం కాదు. గోరటి వెంకన్న పాటల్లో తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో ప్రజలు మాట్లాడుకునే పదాలే అతని పాటల్లో కనిపిస్తాయి. అవి తెలంగాణ మాండలిక పదాలు. వినటానికి అంత సులభంగా ఉన్నా, వాటిని అనువాదం చేయటం

చాలాకష్టంతో కూడిన పని. అనువాదకుడికి ఆ మాండలికంలో మంచి ప్రావీణ్యం ఉన్నప్పటికీ గోరటి వెంకన్న పాటల అనువాదం అనేది కత్తిమీద సాము లాంటిదే.

Peter low Pentathlon Approach పీటర్ లోవ్ పాటల అనువాద సిద్ధాంతం ప్రకారం, పాటల అనువాదానికి ఐదు స్థాయిలు ఉంటాయి. ఇవి పాడగలిగే విధానం (సింగబిలిటీ), అర్థం, రైమ్, రిథమ్, సహజత్వం. ఈ రెండు వర్షన్లను పీటర్ లోవ్ వ్యూహాల కింద పోల్చి విశ్లేషించినప్పుడు, ఈ క్రింది ఫలితాలను పొందవచ్చు .

**1. గానయోగ్యతా గుణం** (Sing ability): పాట అనువాదంలో గానయోగ్యతా గుణం అనేది కీలకమైన అంశం. పీటర్ లోవ్, ఫ్రాంజాన్ ఈ అంశాన్ని పాట అనువాదంలో ప్రధానంగా పరిశీలించారు. గానయోగ్యత అనేది శ్రావ్యమైన, సులభంగా పాడదగిన పదాలను కలిగి ఉండటం. పాటను పాడే వ్యక్తి సులభంగా పాడగలిగేలా, సంగీతం సరిపడేలా ఉంటేనే పాట అనువాదం విజయవంతం అవుతుంది. ఈ అంశం పాటను మరో భాషలో ప్రేక్షకులకోసం ప్రదర్శించే సమయంలో చాలా ముఖ్యమవుతుంది.

**2. భావం** (Sense): పాట అనువాదంలో భావాన్ని కొంత మేరకు మార్చడం జరుగుతుంది. అయితే, మూల పాఠ్యంలోని భావాన్ని పూర్తిగా విస్మరించకూడదు. పీటర్ లో చెప్పిన విధంగా, నిజమైన పాటని అనువాదకులు మూల రచయితకు విధేయతను చూపుతారు. భావాన్ని పదాల రూపంలో మార్చినా, పాట మూల భావం లక్ష్యభాషలో కూడా స్పష్టంగా ఉండాలి.

**3. సహజత్వం** (Naturalness): సహజత్వం అనేది register text, పద క్రమాన్ని సూచిస్తుంది. ప్రేక్షకులు పాటను వినగానే అర్థంచేసుకునేలా, సులభంగా అర్థమయ్యే పదాలు ఉండాలి. ఈ విషయంలో, అనువాదకుడు లక్ష్యభాషాప్రేక్షకులకు విధేయత చూపాలి.

**4. లయ** (Rhythm): లయ అనేది కాంపోజర్కు సంబంధించిన అంశం. ఇది పాటలో ప్రాముఖ్యం కలిగిన భాగం. లయను లక్ష్యభాషలోకి అనువదించటం చాలా కష్టమైన పని. అయితే, పాట క్రమం, వాయిద్యాల వాడకం ద్వారా లయను సరిచేయవచ్చు.

**5. ఛందస్సు** (Rhyme): పాట అనువాదంలో ఛందస్సు ఒక కీలకమైన అంశం. చాలామంది అనువాదకులు లక్ష్యపాఠ్యంలో ఛందస్సురీత్యా పెద్ద మార్పులు చేస్తారు. అయితే, పీటర్ లోవ్ చెప్పినట్లుగా, ఛందస్సు విషయంలో గట్టి నియమాలను పాటించకూడదు. ముఖ్యంగా, లక్ష్యపాఠ్యంలో ప్రతి లైన్లో ఛందస్సు ఒకే విధంగా ఉండడం పాట భావాన్ని దెబ్బతీయవచ్చు. పెంటాథ్లాన్ సూత్రాలు, పాటల అనువాదంలో అనువాదకుడికి సరైన మార్గనిర్దేశకాలు అందిస్తాయి.

తెలుగు సాహిత్యాన్ని చాలామంది ఇతర భాషల్లోకికి అనువాదాలు చేశారు. ఎందుకంటే వచనాన్ని అనువాదం చేయటం కష్టతరమైన పని కాదు. ఎవరైనా రెండు భాషల్లో ప్రావీణ్యం కలిగి వుంటే చాలు అనువాదం చేయొచ్చు. కాని పాటల అనువాదం అనేది చాలాకష్టం. సాహిత్యాన్ని అనువాదం చేసినట్టుగా పాటలను అంత సులభంగా చేయలేం. పాటలో ఉన్నటువంటి అ బాధను గానీ దుఃఖాన్ని గానీ లేక పాట మాధుర్యాన్ని మూలభాషలో ఉన్న విధంగా లక్ష్యభాషలోకి అనువాదం చేయలేం. పాటల అనువాదంలో అనేక సవాళ్ళను ఎదుర్కొనవచ్చు. పాటలను అనువదించేటప్పుడు కొన్ని సాధారణ సమస్యలు వస్తాయి. ఆ సమస్యలు కింది చెప్పిన విధంగా వుంటాయి.

**భాషా నిర్మాణం:** తెలుగు, ఇంగ్లీష్లో భిన్నమైన వ్యాకరణ నిర్మాణాలు, వాక్య నిర్మాణాలు ఉన్నాయి. ఉద్దేశించిన అర్థం, రిథమ్, కవిత్వ ప్రవాహాన్ని కాపాడుతూ గీతాలను అనువదించడం సవాళ్ళను కలిగించవచ్చు.

**ఉదాహరణ 1**

| Telugu | English |
|---|---|
| చెయ్యి ఎత్తు లేసి ఆడే | He seizes the black cobra skilfully |
| నల్లతాసు నొడిసిపట్టి | That rises to his height |
| పడిసెల తిప్పినట్టు | Twirling like a spinning top |
| పడిగ పడిగ తిప్పెటోడు | turning swiftly, with precision |

**ఉదాహరణ 2**

| Telugu | English |
|---|---|
| సంత మా ఊరి సంత-వారానికోసారి | Our village fair is held once a week |
| జోరుగ సాగేటి సంత – మా ఊరు సంత | Hectic activity continues there unstopped |

| | |
|---|---|
| సుట్టు ముప్పై ఊర్ల పెట్టు జనమందరు | All people from thirty villages around |
| పుట్టపగిలి సీమలొచ్చినట్లోస్తారు. | Visit it like ants emerging from broken anthill |

పైన చెప్పిన ఉదాహరణ పాటలోని వాక్యాన్ని మనం గమనిస్తే " వడిగ వడిగ తిప్పెటోడు" "సుట్టు ముప్పై ఊర్ల పెట్టు జనమందరు" ఇక్కడ వడిగ వడిగ అనే పదం రెండ్లు సార్లు వచ్చింది అలాంటి వాక్య నిర్మాణం ఇంగ్లీష్ లో లేదు. "సుట్టు ముప్పై ఊర్ల పెట్టు జనమందరు" ఈ వాక్యంలో సుట్టు పెట్టు అని ప్రాస వచ్చింది. అలాంటి ప్రాస ఇంగ్లీష్ లో ఉండొచ్చు. కాని తెలుగులో ఉన్న విధంగా వుండకపోవచ్చు. కనుక పీటర్ లా చెప్పిన అనువాద పద్ధతి ఐన singability మరియు sense అనే పద్ధతిలో తెలుగులో ఉన్నా వాక్యానికి ఇంగ్లీష్ లో చాలాదగ్గరి సమానంగా వచ్చే అర్థంతో మాత్రమే అనువాదం చేయగలం. కాని తెలుగు, ఇంగ్లీష్ అనేవి రెండు వేరు వేరు వాక్య నిర్మాణం గల భాషలు కనుక మూలా భాష ఐన తెలుగులో వుండే వాక్య నిర్మాణం, లక్ష్య భాష ఐన ఇంగ్లీష్ ఒకే వ్యాకరణ నిర్మాణ నియమాలు కలిగి వుండవు. కనుక అలాంటి పదాలని కానీ వాక్యాలని కానీ ఉన్నది ఉన్నట్టుగా అనువాదం చేయలేం.

**సాంస్కృతిక సందర్భం:** తెలుగు పాటలు చాలావరకు స్థానిక సంప్రదాయాలు, ఆచారాలు, జానపదాల మూలాలు కలిగి ఉంటాయి. ఇవి ఇంగ్లీష్లో ప్రత్యక్ష అనువాదాలు లేకపోవచ్చు. సాంస్కృతిక సారాన్ని అందించడం, అనువదించిన సంస్కృతిలో సరిగ్గా వ్యక్తంచేయడం జాగ్రత్తగా పరిగణించాలి. సృజనాత్మక అనుకరణ అవసరం.

ఉదాహరణ: 1

| Telugu | English |
|---|---|
| కోడికూతకు ముందు లేసి | You are awake before the crow ing of the cock |
| పేడనీళ్ల కల్లాపి జల్లి | You sprinkle the dung water in the courtyard |
| ముచ్చటొొలుకు ముగ్గులేసే | You draw ornamental patterns with the powder of rice |

**ఉదాహరణ:2**

| Telugu | English |
|---|---|
| కృత్తిక తొలకరి లేక అసలేరు ముసురే రాక | No rainfall in Krutthika Season |
| ఉత్తరుత్త చేయి జూపితే బతకలేక బస్తీకొస్తి | Not even a drizzle in asaleru |
| | The Uttara has shown us empty hands |
| | Came to the city to lead my life |

**ఉదాహరణ:3**

| Telugu | English |
|---|---|
| బతుకమ్మ కోలాట పాటలు | Bathukamma songs, the songs sung with play of sticks |
| భజన కీర్తనలు మద్దెల మోతలు | The beats of drums and the sing ing of hymns |
| బైరాగుల కిన్నెర తత్త్వంబులు | Philosophical songs of bairagis |
| కనుమరుగాయెరా నా పల్లెల్లో | Have lost their respective identi ties in my village |

తెలుగు భాషలో వున్న సంస్కృతి ఇంగ్లీష్ భాషలో లేకపోవడంవల్ల ఆ భాషలో కొన్ని పదాలకి సమానమైన అర్థాలు గాని పదాలుగాని లేకపోవటంవల్ల ఆ పదాలను ఇంగ్లిష్ లోకి అనువాదం చేయలేం. పైన చెప్పిన ఉదాహరణలో "పేడనీళ్ల కల్లాపి జల్లి/ముచ్చటొలుకు ముగ్గులేసే" వాక్యంలో కల్లాపి, ముగ్గు అనేది ఇంగ్లీష్ సంస్కృతిలో లేకపోటంవలన వాటికి సమానార్థం వచ్చే విధంగా అనువాదం చేయటం జరిగింది. పీటర్ లా చెప్పినట్టు sense and naturalness అనే పద్ధతిలో అనువాదం చేయటం జరిగింది. కాని కొన్ని తెలుగు సాంస్కృతిక పదాలకి ఇంగ్లీష్ లో వాటికీ సమానమైన అర్థం వచ్చే పదాలు వుండవు. కనుక వాటిని అనువాదం చేయలేం. ఉదాహరణనికి పైన చెప్పిన "కృత్తిక తొలకరి లేక/ అసలేరు ముసురే రాక/ఉత్తరుత్త చేయి చేయి జూపితే బతకలేక బస్తీకొస్తి ఇక్కడ కృతిక, అసలేరు, ఉత్తర అనేవి తెలుగు నెలలు. పంటలు వేసుకునే సమయంలో వచ్చే కార్తులు. వాటిని ఇంగ్లిష్ లోకి అనువాదం చేయలేం. బతుకమ్మ కోలాట పాటలు/భజన కీర్తనలు మద్దెల మోతలు/బైరాగుల కిన్నెర తత్త్వంబలు బతుకమ్మ, కోలాటం అనేవి మన తెలుగులో మాత్రమే ఉంటాయి. కాబట్టి వాటిని అదేవిధంగా అనువాదం చేసి వివరణ ఇవ్వాల్సి వస్తుంది.

**పదసంయోజన, పదం ఎంపిక:** తెలుగు పాటల్లో చాలావరకు పదసంయోజనాలు, ఉపమానాలు, కవిత్వపరమైన భావ వ్యక్తీకరణలు ఉంటాయి. వీటికి ఇంగ్లీష్లో ప్రత్యక్ష అనువాదాలు లేకపోవచ్చు. మౌలిక గీతాల సారాన్ని కాపాడే సమానమైన వ్యక్తీకరణలు కనుగొనడం లేదా కొత్త ఉపమానాలు సృష్టించడం కఠినమైన పని కావచ్చు.

**ఉదాహరణ: 1**

| Telugu | English |
|---|---|
| సుట్టు ముప్పై ఊర్ల పెట్టు జనమందరు | All people from thirty villages around |
| పుట్టపగిలి సీమలొచ్చినట్లోస్తారు. | Visit it like ant emerging from broken anthill |

**ఉదాహరణ: 2**

| Telugu | English |
|---|---|
| కృత్తిక తొలకరి లేక అసలేరు ముసురే రాక | No rainfall in Krutthika Season |
| ఉత్తరుత్త చేయి జూపితే బతకలేక బస్తీకొస్తి | Not even a drizzle in asaleru |
| | The Uttara has shown us empty hands |
| | Came to the city to lead my life |

పైన చెప్పిన ఉదాహరణలన్నీ ఇంగ్లీష్ లోకి సమానమైన అర్థం వచ్చేటట్టు పీటర్ లా చెప్పిన అనువాద పద్ధతి ఐన singability, sense and naturalness పద్ధతిని ఉపయోగించి అనువాదం చేయటం జరిగింది. కాని తెలుగులో వుండే అలంకారానికి సమానమైన అలంకారం ఇంగ్లీష్ లో అన్ని పదాలకి వుండకపోవచ్చు. పైన ఉన్న తెలుగు వాక్యాలు పుట్టపగిలి సీమలొచ్చినట్లోస్తారు/ కుక్కినట్టు ఎక్కి కూలవడొస్తారు/ పెండ్లి కోయినట్టు బండ్లు కట్టుకోని అంటే జనాలు చాల ఎక్కువగా, ఒక పెండ్లికి ఎలా అయితే మంచి బట్టలు వేసుకొని ముస్తాబై వెళ్తారో అలా వస్తున్నారని అర్థం. కుక్కినట్టు అంటే ఇరుకుగ కూర్చొని వస్తారు అని అలంకారప్రాయంగా ఉన్నా వాక్యాన్ని ఇంగ్లీష్ లోకి అలానే అనువాదం చేయలేం. దానిని సమానమైన అర్థం వచ్చే విధంగా మాత్రమే అనువాదం చేయగలం. ఇక్కడ ఇంకో వాక్యం ఉత్తరుత్త చేయి జూపితే బతకలేక బస్తీకొస్తి దీనిలో ఉత్తర కార్తిలో కురవాల్సిన వాన రాలేదు అని అర్థం చేయిజూపితే అనే అలంకార ప్రయోగానికి ఇంగ్లీష్లో సమాన అర్థం వచ్చే విధంగా అనువాదం చేయగలుగుతాం తప్ప సరైన అనువాదం చేయలేం.

**రైమ్, ఛందస్సు:** తెలుగు పాటలు సాధారణంగా నిర్దిష్ట రైమ్ పద్ధతులు, ఛందస్సు(మీటర్ల)ను అనుసరిస్తాయి. ఇవి ఇంగ్లీష్లో సులభంగా అనుకరించలేం. ఉద్దేశించిన అర్థాన్ని అందిస్తూ లిరికల్ ప్రవాహం, రైమ్, సంగీతాన్ని నిర్వహించడంలో ఒక సున్నితమైన సమతుల్యత అవసరం.

**ఉదాహరణ: 1**

| Telugu | English |
|---|---|
| బూడిది పిర్రల బుడ్డగోసి | Loincloth for his ash coloured hips |
| బిర్రుగ నడుమూకెగవోసి | Ties the cloth to his waistline |
| సెడుగుడ్ సెడుగుడ్ అడుగు | Runs after the fence fields, |
| ఎలుగులెంకటి పిట్ట పరుగు | Bamboo sticks in his left hand |
| ఎడమ సేతులెదురు బరుగు | Roaming in the wild bushes always |
| అడవి తుప్పలెల్ల తిరుగు | After exploring the entire forest |
| ఊరి ఎంగిలి కొంత కలిసె | He calls the pigs affectionately to him |
| సుక్క పందులు దరికి పిలిసె | Pours the fodder into the watergrass |
| కుడితిని కుడిసేతనె కలిపె | Mixes the food he supplicated from the |
| ఆ పంది పిల్లల ప్రేమతో విందున్నాదని పిలిసె | villagers He blends the fodder with his right hand |
| | He testifies to the pig cubs, there is fodder for them |

**ఉదాహరణ: 2**

| Telugu | English |
|---|---|
| బేరాలు సారాలు సరుకుల భారాలు | The fair sees profits, losses, likes and dislikes |
| లాభాలు నష్టాలు ఇష్టాలయిష్టాలు | Tinkling bells, flowers and peals of laughter and pretense |
| మువ్వలు పువ్వులు నవ్వులు నటనలు | |

**ఉదాహరణ: 3**

| Telugu | English |
|---|---|
| మెతుకుకు గతిలేకున్న బతుకున నీతున్న దాన్ని | I am foodless but hones |

తెలుగు పాటల లయ, ప్రాసను ఇంగ్లీష్ లోకి అనువదించడం చాలా కష్టతరం. తెలుగు, ఇంగ్లీష్ భాషల వాక్య నిర్మాణం విభిన్నంగా ఉండటంతో, భావానువాదం మాత్రమే సాధ్యం. పీటర్ లో చెప్పిన rhythm and rhyme పద్ధతి ప్రకారం, తెలుగు పాటల ప్రాసను నిలుపుకోలేకపోయినా, వాటిలోని అర్థం, భావం మాత్రమే సమర్థవంతంగా అనువదించవచ్చు.

**ముగింపు:**

గోరటి వెంకన్న ప్రపంచ రచయితలు, గాయకులైన బాబ్ డిలాన్, మైకేల్ జాక్సన్, పాల్ రోబ్సన్, పీట్ సీఘర్, పాబ్లో నెరుడాలాంటి గొప్పవాళ్ళ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆ మహానుభావుల పాటలు ఏలా అయితే సమాజంలో ప్రాముఖ్యతని పొందాయో అలాగే గోరటి వెంకన్న పాటలు కూడా తెలుగు సమాజంలో అంతగా ఆదరణ పొందాయి. బాబ్ డిలాన్ పాటకి అత్యున్నత నోబెల్ పురస్కారం వచ్చిందో గోరటి వెంకన్న పాటకి 2017లో కేంద్రీయ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది, ఇది ఆయన సాహిత్యానికి వచ్చిన గొప్ప గౌరవంగా నిలిచింది. వచన సాహిత్యాన్ని అనువాదం చేసినట్టుగ, గేయ సాహిత్యాన్ని అనువాదం చేయటం చాలాకష్టం. గోరటి వెంకన్న పాటలను తెలుగు, తెలంగాణ మాండలికాన్ని ఇంగ్లీష్ లోకి అనువాదం చేయటం అనేది అంత సులభమైన పని కాదు. గోరటి వెంకన్న పాటల్లో వుండే ఆ బాధ, దుఃఖం, ఛిద్రమైన గ్రామీణ ప్రజల జీవనం, ప్రకృతి సోయగాలని అతని భావజాలాన్ని అదేవిధంగా ఇంగ్లిష్ లోకి అనువాదం చేయటం అనేది కష్టం. తెలంగాణ భాషలో వుండే సాంస్కృతికమైన పదాలకి సమానమైన అర్థాలు ఇంగ్లిష్ లో వుండవు కనుక వాటికి అత్యంత దగ్గరగా సమానమైన అర్థం వచ్చే విధంగా మాత్రమే అనువాదం చేయగలం. గోరటి వెంకన్న సాహిత్యాన్ని ఇతర భాషలలోకి అనువాదం చేయాల్సిన అవసరం చాలా ఉంది.

**ఉపయుక్త గ్రంథసూచి:**


1. Bosseaux, Charlotte. The translation of song (2011).

2. Franzon, Johan. Choices in song translation: Singability in print, subtitles and sung performance. The Translator 14.2 (2008): 373-399.

3. Gorlée, Dinda L. Song and significance: Virtues and vices of vocal translation. Vol. 25. Brill, 2005.

4. Hallam, S. The powerful role of music in society. Retrieved July 30 (2008): 2013.

5. Kaindl, Klaus. The plurisemiotics of pop song translation: Words, music, voice and image. Song and Significance. Brill, 2005. 235-262.

5. Low, Peter. The pentathlon approach to translating songs. Song and significance. Brill, 2005. 185-212.

6. Low, Peter. When songs cross language borders: Translations, adaptations and replacement texts. The Translator 19.2 (2013): 229-244.

7. Low, Peter. Singable translations of songs. Perspectives: Studies in Translatology 11.2 (2003): 87-103.

8. Low, Peter. Translating song: Lyrics and texts. Routledge, 2016.

10.Venkanna, Goreti. Ekunadham Motha. Raghavendra Grapihcs,2014.

11.Venkanna Goreti. Relaputhgalu. Raghavendra Graphics, 2014.

12.Venkanna, Goreti. Ala Sendravanka. Madyamam. Literary Forum, 2010.

13. వెంకటేశ్వర్లు, బానోతు. గోరటి వెంకన్న సాహిత్యం–సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కోణాలు–సమగ్ర పరిశీలన. పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. 2024



✶ రచయిత: పరిశోధక విద్యార్థి, హెచ్‌సియు

## విమర్శ

# స్త్రీల చైతన్యానికి దివిటీ పట్టిన తాళ్లపాక తిమ్మక్క 'సుభద్రా కళ్యాణము'

డా. బడిగె ఉమేశ్

**ఉపోద్ఘాతం**

లోకంలో రుక్మిణీ, సుభద్రా కల్యాణములు ఎంతో ప్రసిద్ధి చెందినవి. యుక్త వయసులో ఉన్న పెళ్ళి కాని యువతులు శ్రీకృష్ణుడు, అర్జునుడిలాంటి విశిష్ట లక్షణాలు కలిగిన వారు భర్తలుగా రావాలని ఆకాంక్షిస్తూ వీటిని పారాయణం చేయటం పరిపాటిగా సాగుతూ వస్తుంది. ఇదిలా వుండగా తొలి తెలుగు కవయిత్రిగా ప్రసిద్ధి పొందిన 15వ శతాబ్ది కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క 'సుభద్రాకల్యాణము' ను వస్తువుగా స్వీకరించి, ఒక ద్విపద రచన గావించారు. ఇందులో స్త్రీలను చైతన్యపరిచే అంశాల్ని చాలా సమయోచితంగా క్రోడీకరించారు. ముఖ్యంగా బహుభార్యత్వమనే సాంఘిక దురన్యాయానికి బలైపోతున్న మహిళలు సమాజంలో ఎంతోమంది ఉన్నారని, పురుషుడికి ఒక భార్య ఉండగా, మరికొందరిని వివాహమాడినప్పుడు మొదటి భార్య ఎంతటి తీవ్ర మనస్తాపానికి గురవుతుందో, ఆమె మానసిక సంఘర్షణ గురించి చెప్పాల్సిన పనిలేదని తిమ్మక్క ఈ రచన ద్వారా వెల్లడించారు. అంతేకాదు, ఆ బాధ అనుభవించే వారికి మాత్రమే తెలుస్తుందని ఉద్ఘాటించారు. దీనిని తిమ్మక్క స్వయంగా ఎదుర్కొన్న విదుషీమణిగా సాహితీ ప్రియులకు ఎరుకే. పదకవితా పితామహులైన అన్నమాచార్యులకు(1408-1503) తిమ్మక్క (తిరుమలాంబ), అక్కలమ్మలని ఇద్దరు భార్యలు.

నన్నయ భారతం ఆదిపర్వంలోని అష్టమాశ్వాసంలో 135 గద్యపద్యాలలో విజయవిలాసం రాశాడు. దీన్ని ఆధారం చేసుకునే తిమ్మక్క 'సుభద్రాకల్యాణము' వెలయించింది. ఇందులో 1163 పంక్తులు ప్రాసలేని మంజరీ ద్విపదలో ఉన్నాయి. ఈ లఘుకృతిని సుప్రసిద్ధ పరిశోధకులైన వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీకాళహస్తి రాజావారి ఆస్థాన తాళపత్ర గ్రంథ సంచయం నుండి వెలికితీసి, పరిష్కరించి, పీఠిక రాయగా, 1950లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించింది. ఇదే ప్రతి 1956లో పునర్ముద్రణను కూడా పొందింది.

సాధారణంగా కావ్యావతారికల్లో చాలా మంది తమ పేరు రాసుకుంటారు. కాని తిమ్మక్క మాత్రం కావ్యం చివర్లో ***"అవనిలో తాళ్ళపా-కన్నయ్యగారి/తరుణి తిమ్మక చెప్పె- దాసు సుభద్ర/ కల్యాణ మను పాట- కడుమంచి తేట/పలుకుల, నీపాట- పాడినా విన్న/శ్రీహరి వారికి- చేరువై యుండు/నానాట పాపములు- నాశనం బౌను/ఆప్తులు బంధువు- లను వృందగలరు/సప్త సంతానములు- సమకూర గలవు."*** (సుభద్రాకల్యాణము పుట: 47) అని రాశారు. ఇది ఒక పెండ్లి పాట. దీన్ని ఎవరికి అంకితం ఇచ్చారన్నది ఆమె చెప్పలేదు. రచయితలు మామూలుగా ఆశ్వాసం ఆదిలోగాని, ముగింపులోగాని పూర్వ కవుల్ని స్తుతిస్తుంటారు. అయితే తిమ్మక్క మాత్రం అవేవీ చేయకుండా నేరుగా విషయంలోకి వెళ్లారు. అర్జునుడు సుభద్రను వివాహమాడినదే ఇందులోని కథావస్తువు.

ఈ కావ్యం ఆద్యంతం రసవంతంగా స్త్రీ ఔన్నత్యాన్ని పురిగొల్పేలా సాగిందని చెప్పాలి. కథలో సుభద్ర ఉండే ఇల్లు రత్నాల బొమ్మరిల్లు లాంటిది. అక్కడ దంతపు బొమ్మలు తయారు చేసుకుని, వాటిని అలంకరించి వినోదిస్తుంటుంది సుభద్ర. ఆమె ప్రవర్తన చిన్నపిల్లల్లాగా తోస్తుంది. అక్కడికి అర్జునుడు వచ్చి, తానే పురోహితుడై బొమ్మల పెళ్ళి చేయించాడు. దీన్ని తీర్చిదిద్దడంలో తిమ్మక్క తీసుకున్న జాగ్రత్తలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటాయి. ఒకసారి అర్జునుడు సుభద్ర చెయ్యి పట్టుకుని నర్మగర్భంగా నీకు జాతకం చెబుతానన్నప్పుడు కోప్పడి తన అన్నైన శ్రీ కృష్ణుడుతో ***"యెక్కడి యతివరం-డితడు వో యన్న/ చూడ సంయమి గాని- చూలకాడితడు/ఆడెడి మాట లి- ట్లని పల్కరాదు/సరసమాడగ వచ్చు- సారె నాతోను"*** (పుట: 17) అని ఫిర్యాదు చేస్తుంది. అప్పుడు కృష్ణుడు ఆమెను బుజ్జగించి, బలరామునితో ఏమైనా చెప్పిందేమోనని కంగారు పడతాడు. అనంతరం ఎందుకు ఇలా చేశావని అర్జునుడిని కూడా ప్రశ్నిస్తాడు. సుభద్రకు అర్జునుడిపై ఉన్న కోపాన్ని చల్లార్చేందుకు శౌరి **"అమ్మరా! ముద్దుల- గుమ్మ రా! వేగ/కొమ్మ రా ! నవకంపు- బొమ్మ రావమ్మ!/ముత్యాలసరమ రా! ముద్దరాలా రా!/చిత్తజుబాణమా! చెలియ రావమ్మ!"** (పుట: 18) అని ప్రేమగా సంబోధించినట్లు తిమ్మక్క పేర్కొన్నది. స్త్రీ హృదయాన్ని బాగా అవగాహన చేసుకున్న తిమ్మక్క అదే శ్రీకృష్ణుడితో మాయ యతిని గురించి '***'యేమని వర్ణింతు- నితని మాహాత్మ్య/మేమని వర్ణింతు- నితని పౌరుషము/ప్రమథగణముతోను- పార్వతీశ్వరుడు/ నవతాడ వచ్చితా- చాలంగ నొచ్చె/ఆ***

*కాలకంఠుఁడు- నటు లోడిపోయె/నీతని గెలువగా- నెవ్వరి వశము"* (పుట: 20) అని పలికిస్తుంది.

పాశుపతం పొందేటప్పుడు అర్జునుడు శివుడితో యుద్ధం చేశాడు కదా! ఆయనే ఈ యతీశ్వరడని చెప్పటంతో సుభద్ర ఆంతర్యాన్ని గ్రహించి వారికి కావాల్సిన సపర్యలు చేస్తూంటుంది.

కావ్యంలో తిమ్మక్క చిలుక రాయభారాన్ని నడిపి అర్జునుడి అందచందాల్నిలా ఎంత గొప్పగా వర్ణించిందో చూడండి. *"యెగుభుజమ్ములవాడు -మృగరాజునడుము/ నడచిపుచ్చుకొనునె-న్నడుముగలవాడు! /గరగరనివాడు చక్కనివాడునతడు/గొప్పకన్నులవాడుకోదండగుణకి/ ణాంకంబులౌబాహులమరినవాడు/వెన్నునమచ్చగల-విభవంబువాడు/బవిరి గడ్డమువాడు- పన్నిదంబిడిన/వెన్ను పగడసాల-వెసనాడవచ్చు/చిగురొత్తు చంద్రిక-చెలగు పాదములు"* (పుటలు: 28-29) అంటూ సాగిన వర్ణన చేమకూర వేంకటకవి లాంటి వారికి ఆదర్శనీయమైంది.

ఇది తిమ్మక్క సునిశిత పరిశీలనకు నిదర్శనమని చెప్పాలి. నన్నయ భారతంలో ఈ వర్ణన లేదు. అప్పటికే ప్రబంధాలు మొదలైన కాలమది. శ్రీనాథుడు మొదలు రామరాజ భూషణుడి వరకు మన ప్రబంధాల్లో ఎలాంటి వర్ణనలు చోటుచేసుకున్నాయో మనం చూశాం. ఉదాహరణకు రాళ్ళపల్లి వారన్నట్లు "స్త్రీలను వర్ణించు సన్నివేశమెట్టిదైనను మన కవుల దృష్టి పడకటింటిలో వేచియున్న పెండ్లి కొడుకు దృష్టియే కాని వేరుండదు." (సారస్వతాలోకము, పుట: 16) అనే మాట ప్రబంధాల్లో స్త్రీ అంగాంగ వర్ణన అశ్లీలంగా ఉన్నదనేదాన్ని గుర్తుచేస్తుంది.

ప్రబంధ కవులు స్త్రీని వర్ణించిన దానికీ, ఒక స్త్రీగా తిమ్మక్క పురుషుడిని వర్ణించినదానికి వ్యత్యాసాన్ని మనం అర్థం చేసుకోవాలి. అప్పటి సాహిత్యాన్ని దృష్టిలో పెట్టుకుని 'స్త్రీలు పురుషులతో సామరస్యాన్ని కోరుకుంటుంటే, పురుషులు మాత్రం స్త్రీని కావ్యాల్లో అశ్లీలంగా వర్ణించడం ఎంతవరకు సమంజసం?!

అర్జునుడు తన తీర్థయాత్రలో భాగంగా ఉలూచి, చిత్రాంగదలను వివాహం చేసుకోవడం, ఐదుగురి అప్సరసలకు శాప విముక్తి కలిగించడం, బభ్రువాహన జననం మున్నగు విషయాల్ని తిమ్మక్క సంక్షిప్తం చేసి, సుభద్ర కల్యాణాన్ని మాత్రం విస్తరించడానికి ప్రయత్నించారు. సాధారణంగా మన తెలుగువారి ఇళ్ళల్లో కనిపించే అనుబంధాలు, అనురాగాలు, అన్నదమ్ముల ప్రేమలు, వదినా మరదళ్ల ఆప్యాయతల్ని తిమ్మక్క అర్జునుడు, ద్రౌపది, కృష్ణుడు, బలరాముడు, రుక్మిణి, సుభద్ర పాత్రల ద్వారా అద్దం పట్టించారు. అంతేకాదు ఆ కాలం నాటి తెలుగు దనానికి తెలుగువారి మనుగడకు సాక్ష్యంగా ఈ కావ్యాన్ని కవయిత్రి మలిచారని చెప్పవచ్చు.

తిమ్మక్క సుభద్ర పాత్రను తీర్చిదిద్దేందుకు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంది. ఆమెతో ఈడుకు తగిన ఆటలు ఆడించింది. గొప్ప భద్రతకు సుభద్ర మనసును చిహ్నం చేసింది. దీని మూలంగానే చేమకూర వేంకటకవి తమ 'విజయవిలాసము' లో 'మన సుభద్ర మనసు భద్రమయ్యే' అన్నారనిపించింది. ఈ కావ్యం స్త్రీల కోసం, స్త్రీ రచించిన గొప్ప పాటగా నిలిచి వెలిగిందనవచ్చు. దీనిని తిమ్మక్క రాయలేదన్న వాదోపవాదాలు పండితలోకంలో లేకపోలేదు. ఇవన్నీ ఎన్ని ఉన్నా తాళ్ళపాక తిమ్మక్క 'సుభద్రాకల్యాణమ'నే విశిష్ట లక్షణాలు గల కావ్యాన్ని రాసి కీర్తి గడించడం ముదావహమని సుప్రసిద్ధ పరిశోధకులైన వేటూరి ప్రభాకర శాస్త్రి అభిప్రాయం.

ఆనాడు పురుషులు రాజ్యమేలుతున్న సాహిత్యంలోకి ఒక స్త్రీ ఏవిధంగా ప్రవేశించింది? దానికి ప్రేరణ ఏమై ఉంటుంది? కేవలం రాజాస్థానాల్లోనూ, సంస్థానాల్లోనూ ఉన్నటువంటి సాహిత్య రూపాలు సామాన్య ప్రజల చేరువలోకి తాళ్ళపాక తిమ్మక్క ఈ కావ్యం ద్వారా తీసుకురావడం ఒక సాహసమనే చెప్పాలి. దీంతో తిమ్మక్క ఇటు తెలుగు సాహిత్యానికి ముఖ్యంగా స్త్రీ సాహిత్యానికి ఎంతో ఆదర్శనీయంగా నిలబడిందని కూడా భావించాలి.

నిజానికి అర్జునుడు ఆ కాలంలో చేసిన యాత్రలను బట్టి ఆయనకు విజయుడనే పేరు వచ్చింది. 'విజయవిలాసము' వంటివి అర్జునుడి కేంద్రంగా నడిస్తే, తిమ్మక్క ఒక స్త్రీ గా ఆమె అస్తిత్వాన్ని తెలపడానికి 'సుభద్రాకల్యాణము' అనే పేరు పెట్టిందనవచ్చు. అంటే ఒక స్త్రీ కావ్యాన్ని రాస్తే దానిలో ఉండే ప్రత్యేకతలు ఏమిటనేవి దీని ద్వారా వ్యక్తమవుతుంది.

కావ్యంలో సుభద్రార్జునుల ప్రేమానురాగాన్ని వెల్లడించే సందర్భంలో మిగతా వర్ణనలు ఎంతో ఆసక్తిని రేపుతాయి. రుక్మిణి అప్పగింతలప్పుడు సుభద్రకు ఈ విధంగా చెప్తూ... **"చనవిచ్చినాడని - సకియరో నీవు/పలుమాటలకు నెట్లు - పాలుపడవద్దు"** (పుట:37) అంటూ... ***"పొలతి నమ్మగరాదు - పురుషుల నెప్పుడు/పలురీతి గృష్ణ స -ర్పమ్ములై యుంద్రు"*** (పుట: 37) అంటుంది.

ఇక్కడ మగవారిని ఎక్కువగా నమ్మరాదని, వాళ్ళు నల్ల తాచుపాము లాంటి వారని చెబుతుంది. అదే సమయంలో "కొంచక కృష్ణకు- కూర్మితో నుండం"టూ (పుట:37) ఉద్బోధచేస్తుంది. అంటే ద్రౌపదితో నీవు చాల సఖ్యతగా మెలగమంటుంది. పెళ్లైన పురుషులు మరొక స్త్రీని యిష్టపడటం జరిగిందంటే అలాంటి వారిని నమ్మకూడదని, బహు భార్యత్వం ఉన్నచోట సవతులపై ఈర్ష్యాద్వేశాలు పెంచుకోవటం కన్న, సవతితో ఎటువంటి వంచనలకు పోకుండా ప్రేమగా ఉండమని రుక్మిణి తన స్వానుభవాన్ని తెలుపుతుంది. ఇద్దరి భార్యల్ని కలిగిన పురుషుడు వారి కోప తాపాల్ని తనకు అనుకూలంగా మార్చుకుని

బలంగా ఉండగలుగుతాడు. అందుకే అది మనుగడలో నిలిచింది. దీన్ని ఎదుర్కోలేని స్త్రీలు సవతులతో స్నేహంగా ఉండటమే తెలివైనదిగా తిమ్మక్క భావించినట్లు తోస్తోంది.

సుభద్ర అత్తవారింటికి వెళ్ళినప్పుడు ద్రౌపదికి నమస్కారం చేసి ఆవిడ హృదయాన్ని చూరగొంటుంది. సుభద్రార్జునులకు శోభన ఏర్పాట్లప్పుడు ఆ బాధ్యత మొత్తం ద్రౌపది తీసుకున్నట్లు కావ్యంలో ఉన్నది. బాగా అలంకరించుకుని వస్తున్న సుభద్రార్జునుల్ని చూసిన ద్రౌపది ***"ఝుణ ఝుణత్కారమై పణతు లిద్దఱును"*** (పుట: 44) అంటూ జోడు చిలుకల్లా శోభిల్లుతున్నారని భావించింది. అంటే ఇక్కడ సవతులిద్దరూ వైరాన్ని పక్కన పెట్టి, కలిసిపోవడం బాగుంది. మరో చోట తిమ్మక్క ***'మూడువేల్ వెలసేయు – ముక్కఱ బెట్టి'*** (పుట: 23) నంటూ...సుభద్ర అర్జునుడి దగ్గరకు వెళ్ళిందని చెప్పడంలో ఆమె అలంకార ప్రీతిని మనం అర్థం చేసుకోవాలి.

ఆధునిక సమాజం ద్వంద్వ వివాహాల్ని వ్యతిరేకిస్తుంది. అయినా అక్కడక్కడ జరుగుతున్నాయి. పూర్వం సవతుల మధ్య ఉన్న స్నేహ సంబంధాలు ఈనాడు కనబడడం లేదు. అయినప్పటికీ అర్థం చేసుకునే వాళ్ళు లేకపోలేదు. దీనివల్ల స్త్రీకి కలిగే హృదయ వేదన చెప్పలేనిది. నిజానికి అప్పట్లో రాజులకు ఎంతో మంది భార్యలు, ఉంపుడుగత్తెలు ఉండేవారు. వారిలో రాజు పట్ల సర్వస్వాన్ని అర్పించిన స్త్రీకి ఎంత బాధ ఉంటుందో మాటల్లో చెప్పలేం కదా! అలాంటి జటిలాంశం నుండి మహిళ ఎలా బయటపడుతుందనే దానికి నిదర్శనంగా తాళ్ళపాక తిమ్మక్క ఈ కావ్యంలో ద్రౌపది సుభద్రను అర్జునుడి దగ్గరకు పంపించినప్పుడు... ***"తలపోసె మనసులో– తాళంగ లేక/ యేమి వస్తువులైన – నియవచ్చు గాని/ ప్రాణేశు నిచ్చి మఱి– బ్రతుకంగా రాదు!"*** (పుట: 45) అని వాపోయింది. ఏ వస్తువునైన ఇవ్వచ్చు కాని, ప్రాణానికి ప్రాణమైన భర్తనిచ్చి ఎట్లా బతకాలని కుమిలిపోతుంది. మళ్ళీ ద్రౌపది తనకు తానే... ***"అఖిలాండ కోటి బ్ర–హ్మాండనాయకుని/చెల్లెలు గనకనే– నొల్ల నసరాదు!!"***

***అదిగాక సభలోన – ఆ కౌరవులకు / మానభంగము గల్గు –హీనకాలమున /మానధన మొసగిన – మాహాత్మ్యశాలి / అటువంటి శ్రీకృష్ణు – కనుగు చెల్లెలట" అని మఱి తలపోసి – అతివ మోదించె"*** (పుట: 45) నని సాంత్వన పడుతుంది. దీన్ని గమనించిన ప్రసిద్ధ పరిశోధకులు ఆరుద్ర ఏమన్నారంటే!...'సుభద్ర కల్యాణమయ్యే నాటికి ద్రౌపది వస్త్రాపహరణం జరగలేదు. ఇటువంటి కాల వ్యత్యాసం మరొకటి కూడా తిమ్మక్క తన కావ్యంలో వ్రాసిందని చెబుతూ... ఇవి ఆడవాళ్ళ పాటల్లో కావ్య దోషాల కిందికి రావంటూ... తిమ్మక్క ఆ సమయంలో సుభద్ర పట్ల ఆప్యాయత కలిగి ఉంటుందని వత్తాసు పలికారు. (సమగ్రాంధ్ర సాహిత్యం, పుట: 1017)

నిజానికి ఆ కాలపు నాటి అంతఃపురాల్లో విపరీతమైన రాజకీయాలు జరుగుతుండేవి. ముఖ్యంగా స్త్రీలపై ఎత్తుకు పై ఎత్తులు వేసేవారు. ఏదీ ఏమైనప్పటికీ అన్ని కాలాల్లో స్త్రీల మధ్య ఆరోగ్యకరమైన సత్సంబంధాల్ని నెలకొల్పేటువంటి గొప్ప కావ్యం 'సుభద్రాకల్యాణము'ని చెప్పవచ్చు. దీనిని ఆబాలగోపాలము సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఇందులో ఎన్నో భాషా ప్రయోగ విశేషాలు, వ్యాకరణాంశాలు తారసపడతాయి. తిమ్మక్క శైలిలో ఆకట్టుకునే పదప్రయోగాల్లో శృంగార కన్య.

***తొలకరి మెఱువ, పండు వెన్నెల, గోండు కోవెల, మృగమధ్య వంటి సంబోధనలు, మనము గావించిన – మర్యాదలన్ని మనమె చేయకయున్న – మఱి ధర్మమేది?*** (పేజి: 3), **ధర్మమేదియు ప్రాణదానముతోను** (పేజి: 4), **వేసాలెల్ల – గ్రాసాల కొఱకె** (పేజి:11), ***ఏనుగునెక్కి దిద్దుదూరు*** (పేజి: 29) మున్నగు సామెతలు, అరలేక మ్రొక్క, సూదపుట్టంగ, చెవిపండగై లాంటి జాతీయాలు పాఠకుల్ని ఆలోచింపజేస్తాయి.

స్త్రీకి సాహిత్యకారులు సుమారు 66 పర్యాయ పదాలున్నాయని చెబుతారు. వాటిల్లో తిమ్మక్క రమారమీ 50 పదాల్ని కావ్యంలో ప్రయోగించడం విశేషమని చెప్పాలి. ఉదాహరణకు 'సుందరికొఱకునై– సూదు పుట్టంగ' (పుట:3) అన్న చోట 'సుందరి' అంటే అందమైన ఆడుది అని అర్థం వచ్చేటట్లు, **'మానిని వినవె! జి–హ్మగ లోకమునకు'** (పుట: 4) దగ్గర ఆత్మాభిమానం గల స్త్రీ అనే భావన కలిగేలా, ***'పరగ ధర్మస్థితి – పాంచాలికడను'*** (పుట: 4) చోట పాంచాల దేశపు స్త్రీ అనే అర్థం స్ఫురించేలా ఆయా స్త్రీ వాచక పదాల్ని సందర్భోచితంగా వాడడం సముచితమనిపించింది. తాళ్ళపాక తిమ్మక్క 15వ శతాబ్దంలోనే ఎంతో నిబద్ధతతో, దివ్యదృష్టితో మహిళా లోకాన్ని మేల్కొలిపేందుకు 'సుభద్రాకల్యాణము' కావ్యాన్ని రాశారని ముక్తకంఠంతో చెప్పవచ్చు. 47 పుటలు గల ఈ చిన్ని పొత్తము పరిమాణంలో చిన్నదైనప్పటికి పరిణామంలో చాలా పెద్దదని మనసుపెట్టి చదివితే అవగతమవుతుంది.

**ఆధార గ్రంథాలు:**

1. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి, సారస్వతాలోకము, ప్రచురణలు, హైదరాబాద్, 2009.

2. ఆరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్యము, (మొదటి సంపుటి) తెలుగు అకాడమి, హైదరాబాద్, 2017.

5. ప్రభాకరశాస్త్రి. వేటూరి 'సుభద్రాకల్యాణము' తాళ్ళపాక తిమ్మక్క, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2013.

★ **రచయిత: అసోసియేట్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.**

# బలగాన్ని కలిపిన బస్సు

రవి కుర్మకోల

ఓ... అక్కా తోడెమంత జాగియ్యరా..! జరంత ఆనుత యాడానుతవవ్వా. ఈడ కూసుండ తావ్యాడుందమ్మ జర ఎన్కముందు జరిగి కొంచెమంత తావియ్యుండ్రక్కా?
బస్సుల గన్నిగనం సీట్లుంటే, శిటుక్కున ఈన్నే అడగాల్నా?
సీట్లిద్దరు పెద్దోల్లుంటే అడిగేదాన్నా? సిన్నపిల్లుందనే అడిగినక్కా!
ఇద్దరికే మాకు ఇరుకుటమైతుంది. ఇంక్యాడ కూసుంటవవ్వా
జెర అసంతకు జరిగి ఓక్క కాలుమందమన్నా జాగియ్యుండ్రి
కాలుమందం లేదుగదా! ఏలుమందంగుడ జాగ లేదు.
జెరంత జాగిస్తే నీదేమన్న అరిగిపోతుందా? కరిగిపోతుందా?
తావులేదని సెప్తే నీగ్గాదా! ఏమో తలకాయదినవడ్తివి
ఎమో గట్లనవడ్తివి ఏదో నీ సంతం బస్సన్నట్టు జేస్తున్నవ్
అగోమరి నీ సంతం బస్సన్నట్టు ఈ పొక్కలకచ్చి అడగాల్నా?
తావుకోసం ఎన్ని బస్సులకు ఎదురుచూసినమో ఎరుకేనా?
ఏమో తయ్యారుగొచ్చి తావియ్యుమని ఈడ ఎగరవడ్తివి
తావియ్యబుద్దుంటే ఇస్తను, ఇయ్యబుద్దిగాకుంటే లేదను
ఎదో తావడిగినందుకు తలకాయ, గిలకాయని నీల్గుతున్నవ్
ఎదో సీటడిగినా కర్మానికి ఎటువడితే అటు మాటలనవడ్తివి
సెప్తుంటే సెవుమీద పేనువారుతలేదా? సెవులేమన్న మద్దెమైనయా!
పనేం మనుసునవడ్తలేనట్టు బస్సెక్కి నా పానం దీయవడ్తివి
అదెవతో అత్తమీదున్న కోపమంతా దుత్తమీద దీసిందన్నట్టు
ముత్తమంత సోటియ్యుమంటే, నీ సొమ్మడిగినట్టు జేస్తున్నవేందవ్వ
ఎక్కంగనే జాగ దొరకడానికి ఇప్పుడేమన్న ఎన్కటి దినాలనుకున్నవా?
ఎప్పుడువడ్తే అప్పుడు బస్సులు దొరికే ఎన్కటి కానూనుందనుకున్నవా?
ఎప్పుడువడ్తే అప్పుడు బస్సులల్ల ఊళ్లుదిరగా ఎవరేం ఉట్టిగలేరు
సంసారాలు ఇడ్సివెట్టి సన్యాసులల్ల కలిసేటోళ్లు దిరుగుతరు ఊళ్లు
తాసిలిపాడుగాను పొద్దునలేసి వోళ్ల మొఖంజూస్తినో ఇట్ల తగులుకునే!
నిన్నేమన్న దాసుకున్న ధనమడిగిన్నా, పోసుకున్న గాసమడిగిన్నా!



ముత్యమంత జాగడిగిన దోసానికి ముక్కుసెలిమెలెగిరేస్తున్నవ్

పైసవెట్టి బస్సెక్కినోళ్లుగుడ సీట్లకోసం ఇంత పరేషాన్ జేస్తలేరవ్వా!

ఇయ్యోడల్లా పైసలువెట్టి ఎక్కపోతే మన్నుబెడ్డలువెట్టి ఎక్కినమా?

పదొద్దుల ఏశానికి పైసలేకుండాజేసి మంది పానాలు దీయవట్టే

ఏమవ్వో సక్కగ మాట్లాడు, ఏమో అంకర, తొంకర మాట్లాడుతున్నవ్

అంకరేం మాట్లడుతలే, సక్కగనే మాట్లాడుతున్న. సక్కగగాకపోతే

సర్కారు బస్సున్నప్పుడు శాన మందెక్కుతరు, శానమందిగుతరు

ఈన్నే ఓల్లేమి ఉండిపోడానికి రాలేరు. జెర్రంత ఏశానికి ఏమో లావు నీల్గుతున్నవ్

నువ్ యాన్నో ఒక్కతాద దిగిపోయెదానివే కదా! ఈన్నే ఉండిపోడానికి రాలేదు గద

ఊరచ్చినంక ఓళ్లమైన దిగిపొయ్యెటోల్లమే! ఓళ్లమేం ఉండిపోడానికి రాలేదు

ఓ అవ్వా లొల్లేం బెట్టుకుంటరు ఈడచ్చి నిలబడు నేను అచ్చేఊరుకాడ దిగిపోత

సూడవ్వ జెర్రంత తావడిగితే ధనమేదో దాచుకున్నట్టు కయ్యం బెట్టుకుంటుంది

అవుమరి వనిపాట మననువట్టక నీతో పంచాదివెట్టుకుంటున్న

సర్కారోనింట్ల మన్నువడ పిరి బస్సుబెట్టి మంది పానాలుదీస్తుండు

నాలుగొద్దుల నడమంత్రం సోకులకు నరలోకంను అవస్థలు పెడ్తుండు

అవునవ్వా సర్కారోళ్లు పిరి బస్సన్నప్పటిసంది మనుసులల్ల సెమ లేకుంటవొయ్యింది

బొడ్డుపేగుదెగి బూమ్మీదవడ్డ తావుల బోకె పగిలెదాక బతికేటోల్లు

మాయిముంత దాసిన జాగల్నే జీవిడిసే జిమ్మెదారి లేకుంటవాయె

బలగం ఉన్న జాగల బతుకులేదు, బతుకున్న జాగల బలగంలేదు

పల్లెల బతికెటోల్లకు సేసుకుంటే పండుగైనా, కోసుకుంటే దావతైనా

పట్నం తొవ్వవట్టిన పేదోళ్ల బతుకుల్ల ఓ పెల్లిలేదు, సావులేదు

ఆపతికి రారని, సంపతికి రారని అయినోళ్లే దూరమైతుండ్రు

సేసే సేతుకు తీరెం ఉండదు, తిరిగే కాలుకు రికెం ఉండదు

కడుపునొచ్చిన, కాలునొచ్చిన కంటినిండ నిద్రకు నోచుకోరు

పల్లెల పనిలేదని పట్నం తొవ్వవట్టి బతుకుతున్న సంసారాలకు

గీ సర్కారు బెట్టిన పిరి బస్సే ఎంతన్న ఫికరు లేకుంట జేసింది.

ఆపతి, సంపతికి రాకున్నా అర్జంటు కార్యాలకు రాన మొఖ దొరికే

బలగాన్ని గలుసుకొని బాధక సాదకాలు చెప్పుకొని బరువుదీర్చుకోవడ్తిమి

దానమిచ్చి సాదుకోమన్న బర్రెకు మీదిపండ్లు లేవని లడాయివెట్టినట్టు

ఆడోల్లందరికి పిరిబస్సునిబెట్టే, అయిందానికి, కాందానికి తిరుగవడ్తిమి

అచ్చిన బస్సుల్లా ఆడోల్లే నిండితే, పైసవెట్టిన మొగోల్లకు పరెషాన్ గావట్టే

తిరిగి ఆడిది జెడిపోయిందట, తిరగక మొగడు జెడిండన్నట్టు

పిరిబస్సుందని పిల్లలను ఇడ్సి దిరిగి పచ్చని కాపురాలను ఇచ్చగొట్టుకొంటుండ్రు

మూడుకాళ్లతో నడిసే ముసలోల్లకైనా, పొట్టతోటున్న పదుసోల్లకైనా

అడిగంగనే కాదనకుంటా పిలిసి మరి ఆళ్ళ సీటిచ్చెటోళ్లు

సంటిపిల్ల తల్లైనా, సావుజాలకున్న ముసల్దడిగినా సాలిచ్చుకొని కూసుంటుండ్రు

అయిందానికి లొల్లే, కానిదానికి లొల్లి వెట్టుకుంటే లోకమెట్లుంటది

శాట్ల తవుడు వోసి కుక్కల లొల్లి జూసినట్టు జూస్తుండ్రు.

మొక్కవోయిన దేవుడు ఎదురంగొచ్చినట్టు పిలిసిమరి నీ సీటిచ్చినవక్కా

నీ కడుపు సల్లగుండని, నిన్ను ఆ దేవుడు సల్లగ సూడనక్కా

గింద్ల నాదేముందవ్వా ఇంక జెర్రసేపైతే నేనుదిగే తావస్తుంది

కండ్లేమో గుండ్రంగా దిరుగుతున్నయ్, కాళ్లేమో మస్తు గుంజుతున్నయ్

యాడ కూలవడి క్యాలిదవ్వుతనేమో అనుకునే యాళ్లకు తావిచ్చినవక్కా

ఐదార్లు జాగల్ల ఆపే గీ హైద్రాబాద్ బస్సుల గూసుండి అరికాళ్లు తిమ్మిర్లువట్టినై

గందుకే జెరంత ముందుగల్లనే లేసి నీకు తావిచ్చిననవ్వా...!

ఇచ్చెతందుకు జాగున్న ఇయ్యాలన్న సెమ అందరికుండదక్కా!

మనిసి మనుసుల సెమలేనియాళ్ల మనిసెట్లైతదవ్వా...!

అగో అస్తనే ఉంది నేను దిగే తావు, ముందుకు నడుసి నిలవడ్త

అవునక్కా..! మీదేవురో...! నీ పేరేందో చెప్పకనే దిగిపోవడ్తివి

మా ఊరా...! కామారెడ్డి దగ్గర ఓ పల్లె. నా పేరు... భారతి.

★ **రచయిత:** తెలుగు అధ్యాపకుడు డిగ్రీ & పి.జి. కళాశాల, కామారెడ్డి

# కాలువ మల్లయ్య నవలలు-వస్తు విశ్లేషణ

డా. గడ్డం లింగరాజు

**1. పరిశోధన శీర్షిక** (Title of the Research)

సామాజిక దృక్పథంతో వచ్చిన నవలలపై పరిశోధన చేయాలన్న కోరికతో కాలువ మల్లయ్య నవలా సాహిత్యాన్ని పరిశోధనకు తీసుకోవడం జరిగింది. "కాలువ మల్లయ్య నవలలు-వస్తు విశ్లేషణ" అనే అంశంపై పిహెచ్.డి. పరిశోధన చేశాను. దీన్ని ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి పర్యవేక్షణలో తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి 2022లో సమర్పించాను.


[redacted]
Kaluva Mallaiah Navalalu – Vastu Vishleshan[redacted]
(A Thesis submitted to the University of Hyderabad in partial fulfilm
of the Degree of Doctor of Philosophy in Telugu)

Research
GADDAM LINGARAJU
Regd. No.16HTPH20

Supervisor
Prof. S. SARAT JYOTHSNA RANI

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad – 500046
Telangana

July – 2022

**2.పరిశోధన పరిధి** (Boundary of Research)

తెలుగులో ఎన్నో ప్రక్రియలు ఉన్నప్పటికీ జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా చిత్రించి మధ్య తరగతి ప్రజల జీవిత సమస్యలను సాహిత్యంలోకి ప్రవేశపెట్టిన ఘనత నవల ప్రక్రియకే చెందుతుంది. నవలాకారులు సమాజంలోని అనేక సమస్యలను చిత్రిస్తూ, పరిష్కార మార్గాలను చూపిస్తూ, చైతన్యాన్ని సాధిస్తున్నారు. అలా తమ నవలల ద్వారా సమాజ చైతన్యాన్ని కాంక్షించిన రచయితలలో కాలువ మల్లయ్య ఒకరు.

కాలువ మల్లయ్య నవలలు, కథలు, వ్యాసాలు, కవిత్వం,నాటకాలు మొదలైన ప్రక్రియల్లో తన రచనా వ్యాసంగాన్ని సృష్టించారు. అంతటి విస్తృతంగా ఉన్న కాలువ మల్లయ్యగారి సాహిత్యాన్ని సేకరించి, పరిశోధన చేసి విశ్లేషించడం పరిశోధన కాలం దృష్ట్యా క్లిష్టతరం. కాబట్టి పర్యవేక్షకులైన ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణిగారి సలహాతో కాలువ మల్లయ్యగారి నవలలను మాత్రమే నా పరిశోధన పరిధిగా ఎంచుకొని "కాలువ మల్లయ్య నవలలు-వస్తు విశ్లేషణ" అనే శీర్షిక పేరుతో పరిశోధన చేశాను.

**3. పూర్వ పరిశోధనల సమీక్ష** (Review of Literature)

'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' గ్రంథం, వివిధ విశ్వవిద్యాలయాల్లోని గ్రంథాలయాలకు తిరిగి సేకరించిన సమాచారం ప్రకారం కాలువ మల్లయ్య నవలలపై 'కాలువ మల్లయ్య నవలలు-సామాజిక విశ్లేషణ' అనే అంశంపై బి.మల్లికార్జున్ 2005 వ సంవత్సరంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. పగిడ్యాల మహేందర్ 'కాలువ మల్లయ్య అస్పృశ్య కోయిల నవల- వస్తు రూపవిశ్లేషణ' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించారు. వారి సిద్ధాంత వ్యాసం, సిద్ధాంత గ్రంథం ద్వారా కాలువ మల్లయ్య రచించిన భూమిపుత్రుడు, సాంబయ్య చదువు, మాట్లాడే బొమ్మలు, అస్పృశ్య కోయిలఅనే నాలుగు నవలలపై మాత్రమే పరిశోధన జరిగిందని తెలుసుకున్నాను. కాబట్టికాలువ మల్లయ్య రచించిన మొత్తం పదహారు నవలలపై సంపూర్ణంగా పరిశోధన జరగలేదని ఈ పరిశోధన చేశాను.

**4. పరిశోధన ఉద్దేశ్యం** (Purpose of the Research)

సాహితీ క్షేత్రంలో అన్ని రకాల ప్రక్రియలతో కూడిన సాహిత్య సేద్యాన్ని పండిస్తున్న నిత్య కృషీవలుడు కాలువ మల్లయ్య. కాలువ మల్లయ్య తెలుగు కథ, నవలా రచయితలలో తనకంటూ ఓ ప్రత్యేకతను కలిగి ఉండి ఒక సామాజిక నిబద్ధతతో తెలంగాణ పల్లె జీవితాన్ని, అట్టడుగు శ్రామిక వర్గ సంస్కృతిని, దళిత, బహుజనుల చైతన్యాన్ని వాస్తవిక దృక్పథంతో తన నవలల్లో నిక్షిప్తం చేస్తున్నాడు.కాలువ మల్లయ్య పదహారు నవలలు రచించాడు.కాలువ మల్లయ్య నవలల్లో ఉన్నటువంటి సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను తెలియజేస్తూ, కాలువ మల్లయ్య నవలల ద్వారా సమాజం ఏ విధంగా చైతన్యం అవుతుందో తెలియజేయాలన్నది నా పరిశోధన ఉద్దేశ్యం.

**5. పరిశోధన లక్ష్యం** (Research Aims & Objective)

కాలువ మల్లయ్య నవలల్లో గ్రామీణ జీవితం, సంస్కృతి, సంక్షోభం, మధ్య తరగతి ప్రజల సమస్యలు, కార్మికుల సమస్యలు, కుల వృత్తుల జీవన విధానం, వలసలు, దళిత,బహుజనుల జీవితం, రైతాంగ జీవితంలోని సమస్యలు,

భూస్వామ్యులైన దొరల దౌర్జన్యాలు, మావోయిస్టుల ఉద్యమాలు, విదేశాలపై మోజు, మాతృభాషపైప్రేమ, ఇంగ్లీష్ మీడియం చదువు, బీడీ కార్మికుల సమస్యలు, స్త్రీలపై అత్యాచారాలు మొదలైన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలు కనబడతాయి. ఇలాంటి నవలలను సాహిత్యపరంగా అన్వయించి చెప్పడమే ఈ పరిశోధన లక్ష్యం.

## 6. పరిశోధన మెథడాలజీ, సిద్ధాంత భూమిక (Methodology and conceptual framework)

ఈ పరిశోధనలో కాలువ మల్లయ్య నవలలను పరిశీలించాను. కాలువ మల్లయ్య జీవిత విశేషాలను, సాహిత్య ప్రస్థానాన్ని, తెలంగాణలోని నవలలని కొన్నిటిని పరిచయం చేశాను. ముఖ్యంగా సాహిత్యకారులు, విమర్శకులు పరిశోధకులు తెలిపిన వస్తువు దృష్ట్యా తెలుగు నవలల వర్గీకరణను తెలియజేసి, కాలువ మల్లయ్యగారు రచించిన పదహారు నవలలను సామాజిక నవలలు, దళిత నవలలు, వృత్తి నవల, చైతన్య స్రవంతి నవల, కార్మిక నవల, ఇతర నవలలు అని వర్గీకరించాను. ప్రతి నవలను పరిచయం చేస్తూ, నవలా వస్తువును తెలియజేసి, నవలల్లోని వస్తువును విశ్లేషించాను. కాలువ మల్లయ్య నవలల్లోని పాత్రల పేర్లను తెలియజేశాను. సాహితీకారులు, విమర్శకులు, పరిశోధకులు తెలిపిన పాత్రల వర్గీకరణను ఆధారంగా చేసుకొని కాలువ మల్లయ్య నవలల్లోని పాత్రలను ప్రధాన పాత్రలు, ఆదర్శ పాత్రలు, సందేశాత్మక పాత్రలు, సహాయక పాత్రలు అని నాలుగు రకాలుగా వర్గీకరించి ఆ పాత్రల పాత్రచిత్రణలోనే పాత్ర స్వభావం, ప్రయోజనం, వైశిష్ట్యం, వైవిధ్యాలను విశ్లేషించాను. కాలువ మల్లయ్య సమాజంలోని వివిధ మనస్తత్వం గల వ్యక్తుల మనోభావాలను పరిశీలించి ఆ వైవిధ్యాన్ని అంతా పాత్రలతో నిక్షిప్తం చేశాడు. కాలువమల్లయ్యమట్టిమనుషులైనలసుమయ్య, కొండమల్లయ్య, భిక్షపతి, వీరమ్మ, నర్సమ్మ, సాంబయ్య మొదలైన వారిని తీసుకొని ఆ పాత్రలకు జీవం పోశాడు.

కాలువ మల్లయ్య నవలల్లో ఉన్న విభాగాలు, నిడివి, ఎత్తుగడ, ముగింపు, నవల శీర్షిక ఔచిత్యం, పాత్రోచిత భాష, దృష్టి కోణం, మాండలికాలు, సామెతలు, జాతీయాలు, ధ్వన్యనుకరణ పదాలు, జంటపదాలు, అన్యదేశ్యాలు కాలువ మల్లయ్య రచనాశైలిని విశ్లేషించాను. ముగింపులో కాలువ మల్లయ్య నవలల్లోని సారాంశాన్ని తెలియజేసి, పరిశోధన ఫలితాలను వెల్లడించాను.

## 7. అధ్యాయ విభజన (Chapter Division)

నా పరిశోధనాంశాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించాను. అవి :

**1. కాలువ మల్లయ్య జీవిత విశేషాలు**

**2. తెలంగాణ నవల-పరిచయం**

**3. కాలువ మల్లయ్య నవలలు-వస్తు విశ్లేషణ**

**4. కాలువ మల్లయ్య నవలలు-పాత్ర చిత్రణ**

**5. కాలువ మల్లయ్య నవలలు-రచనా శిల్పం**

**ఉపసంహారం, ఉపయుక్త గ్రంథసూచి, అనుబంధాలు.**

## 8. పరిశోధన ఫలితాలు (Research Findings)

కాలువ మల్లయ్య నవలలను పరిశోధించిన తరువాత గుర్తించిన కొన్ని ఫలితాంశాలను తెలియజేస్తున్నాను. అవి :

1. ప్రజలు దొరలను ఎదురించి గ్రామాలను చైతన్యవంతం చేసి పట్టణాలకు వెళ్లి ఉన్నతమైన విద్యనం అభ్యసించి నాగరికత వైపు మళ్లిన విషయాలను కాలువ మల్లయ్య నవలలు తెలియజేశాయి.

2. తెలంగాణ గ్రామీణ సమాజంలో అంటరానివారిగా ముద్రపడిన సమాజ వివక్షకు గురైన దళితులు స్వాతంత్ర్యానంతరం బాగా చదువుకొని ఉద్యోగాలు పొంది సమాజంలో గౌరవాన్ని, జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకున్నారు.

3. చేనేత కార్మికులు ప్రపంచీకరణ ప్రభావం వల్ల వృత్తిని కోల్పోయి పట్టణాలు, ఇతర రాష్ట్రాలకు బతుకుదెరువు కొరకు వలస వెళ్లారు 4. కాలువ మల్లయ్య నవలలు సమాజంలో చోటు చేసుకున్న సామాజిక సమస్యలను చిత్రించి ఆ సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించాయి. దళిత, బహుజనుల్లో చైతన్యాన్ని తీసుకువచ్చాయి. దళిత, బహుజనులు రాజ్యాధికారం దక్కించుకోవాలని ఈ నవలలు స్పష్టం చేస్తున్నాయి.

5. కాలువ మల్లయ్య దళిత బహుజనుల జీవితాల్లోకి పరకాయ ప్రవేశం చేసి ఆయా కులాల వారి వేదనను, సమస్యలను, జీవితాల్ని ప్రేమతో అక్షరీకరించినట్లు కనిపిస్తుంది. దళిత నవలలు చదివితే దళితుడిగా, దళితబంధుగా కనబడతాడు. వృత్తి కులాల నవలలు చదివినప్పుడు ఆ కులానికి చెందిన వాడిగానే భావించే తథాద్మియత అతని అక్షరాలలో కనబడుతుంది. మొత్తంగా పరిశీలిస్తే దళిత, బహుజనుల జీవితాల గురించి ఇంత ప్రేమతో రాసిన రచయితలలో కాలువ మల్లయ్య అగ్రగణ్యుడు. కాలువ మల్లయ్యగారిని దళిత బహుజన నవలా శిల్పిగా పేర్కొనవచ్చు.

## 8. భావి పరిశోధకులకు సూచనలు (Suggestions for upcoming Researchers)

నా పరిశోధన కాలువ మల్లయ్య నవలల్లోని వస్తువు మీద ప్రధానంగా దృష్టి పెట్టింది. కాబట్టి భవిష్యత్తులో కాలువ మల్లయ్య నవలల్లోని భాష, శిల్పం, దళిత, బహుజనుల జీవితాలపై ప్రత్యేకంగా పరిశోధన చేయవచ్చని తెలియజేస్తున్నాను. అలాగే తెలంగాణలో ఉన్న నవలాకారుల యొక్క నవలల పై కూడా పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది.

**పరిశోధకుని వివరాలు :** డా. గడ్డం లింగరాజు, ఈదులగూడ, మిర్యాలగూడ మండలం, నల్లగొండ జిల్లా, ఫోన్: 9492610170 , gksraju1@gmail.com.

*****

# యాష్‌గార్డ్; పప్పన్నం

స్నేహలత ఎం.

బిర్యానీలు, కబాబ్‌ల కాలంలో జీవిస్తున్నాం. ఏ సెంటర్‌లో చూసినా అవే కనిపిస్తున్నాయి. నూట యాభై నుంచి మొదలు నాలుగైదు వందల వరకు ధర పలికే బిర్యానీ రోజులో ఏ సమయంలోనైనా, ఎక్కడైనా అందుబాటులో ఉంటోంది. ఏదో పని మీద బయటికెళ్తుంటాం. ఆలస్యమైతుంది. ఏమైనా ఇంత తిందామని చూస్తే మనకు చుట్టుపక్కలంతా సుమారు 95 శాతం వరకు అయితే టిఫినీలు, లేదా బిర్యానీలు అందుబాటులో ఉంటున్నాయి. బిర్యానీ తినే ఆలోచన లేనివాళ్లు మామూలుగా టిఫిన్లవైపు మళ్లుతున్నారు. ఈ స్థితిలో హైదరాబాద్ నగరంలో మెస్‌లు దాదాపు కరువయ్యాయనే చెప్పాలి.

పోయిన నెలలో ఓ రోజు నేను, నా మిత్రులు కలిసి కారులో కొన్ని పనుల రీత్యా జూబ్లిహిల్స్‌కు బయలుదేరాం. మధ్యలో పంజాగుట్టలో చిన్నపని చూసుకొని బారులుగా నిలబడిన ట్రాఫిక్‌ను దాటుకొని జూబ్లిహిల్స్‌కు చేరకముందే మధ్యాహ్నం ఒకటిన్నర అవుతోంది. ఆకలి మొదలైంది. ఎక్కడైనా తిందామని ఆలోచిస్తూ అలా రోడ్డుకు ఇరువైపులా హోటల్ కోసం చూస్తూ వెళ్తున్నాం. పైన ప్రస్తావించినట్లు ప్రతిచోట బిర్యానీ అవైలబుల్ బోర్డులే దర్శనమిచ్చాయి. అలా అవన్నీ దాటుతూ ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ తర్వాత ఎడమ వైపు తిరిగాం. ఆ పక్కనే నా మిత్రురాలికి చిన్నపని ఉండడంతో నెమ్మదిగా వెళ్తున్నాం. రోడ్డుమీద ఉన్న ఒక బోర్డు మమ్మల్ని ఆకర్షించింది. దాని పేరే యాష్‌గార్డ్ అంటే మీకందరికీ తెలిసిందే బూడిద గుమ్మడికాయ. రోడ్డు పక్కనే ఉన్న చిన్నపాటి షెడ్‌లో నల్లటి బ్యానర్‌లో ముద్దపప్పు, తోటకూర, మామిడికాయ పచ్చడి అన్నం, పెరుగన్నం అన్న అక్షరాలు చూసి కారు ఆపి ఆ షెడ్డు లాంటి హోటల్‌కు ముగ్గురం వెళ్లాం.

పెద్దగా హడావిడి లేకుండా ఫుట్‌పాత్‌పైనే చిన్నపాటి రేకుల షెడ్‌లో యాష్‌గార్డ్ హోటల్‌ను ఒక మహిళ ఇద్దరు సహాయకుల సహకారంతో నడిపిస్తోంది. మేము వెళ్లేసరికే ఇద్దరు ముగ్గురు అక్కడ ముద్దపప్పు, పచ్చడితో అన్నం తింటున్నారు. ప్లేటు భోజనం వంద రూపాయలు. మనం తినగలిగేంత వేడివేడి అన్నం, ముద్దపప్పు, తోటకూర పులుసు, మామిడికాయపచ్చడి, పాపడాలు, పెరుగు అందుబాటులో ఉన్నాయి.

ఒక స్నేహపూరితమైన నవ్వుతో యాష్‌గార్డ్ యజమాని మమ్మల్ని పలకరించింది. అందరం ప్లేట్ భోజనానికి ఆర్డరిచ్చి అక్కడ ఏర్పాటు చేసిన బెంచీలపై కూర్చున్నాం. ప్లేట్‌లో అన్నం, ముద్దపప్పు, మామిడికాయ పచ్చడి, నెయ్యి, పాపడ్‌తో మాకు సర్వ్ చేసారు. తోటకూర, పెరుగు కూడా వడ్డించారు. అది అద్భుతమని చెప్పలేం కానీ, ఒక మిట్టమధ్యాహ్నం ఆకలితో ఉన్న కడుపు నింపుకోవడానికి సరిపోయే సాధారణమైన భోజనం.

తిన్నతర్వాత ఆ చిన్న హోటల్ యజమానితో కాసేపు మాట్లాడాం. ఆమె పేరు సునీత. 35 సంవత్సరాల వయస్సుంటుంది. తల్లి హైదరాబాదీ. తండ్రి ఉత్తర భారతదేశానికి చెందినవాడు. తను చిన్న వయస్సులోనే తల్లిని కోల్పోయానని చెప్పింది. ఉన్నత విద్య అంతా కూడా ఉత్తర భారతంలో, బీటెక్ చెన్నైలో పూర్తిచేసినట్లు తెలిపింది. ఇప్పుడు హైదరాబాద్‌కు వచ్చింది. ఇప్పుడు ఇలా స్వయం ఉపాధిలో భాగంగా చిన్న హోటల్ నడుపుతోంది. ఆమె చిన్ననాడు తన అమ్మమ్మ చేసిన వంటల రుచుల ఆధారంగా ఈ హోటల్ మెనూని నిర్ణయించుకుంది. ఆమె కూడా ఆకలైనప్పుడు సాధారణ భోజనాన్ని కోరుకునే ఒక మహిళ. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బిర్యానీ పాయింట్లు వంటివాటి నుంచి విసుగుచెంది ఈ చిన్న షెడ్డు లాంటి యాష్‌గార్డ్‌ను ప్రారంభించింది. మంచి ప్రయత్నంగా అనిపించింది. బయట తినడం ప్రెస్టేజీ కోసం, సందర్భం కోసంగా మారిపోయిన కాలంలో ఉన్నాం. కనీసం పనుల మీద బయటికెళ్లి అవసరం కోసం తినే పరిస్థితిలోనైనా మనం ఇటువంటి యాష్‌గార్డ్ ప్రయత్నాలను తప్పకుండా ప్రోత్సహించాలి అన్పించింది. T